# వ్యాసావళి

## కొన్ని-ఇంకొన్ని వ్యాసాలు



శ్రీ

కౌముది

మీ ముంగిట్లో సాహితీ వెన్నెల

www.koumudi.net

కౌముది ప్రచురణలు - 134

# కౌముదిలో ప్రచురించబడిన ప్రత్యేక శీర్షికల సంకలనం

## విషయసూచిక


| ఏడాది | నెల | పేరు | రచయిత(త్రి) | పేజి |
|---|---|---|---|---|
| 2011 | 06 | కారులో షికారుకెళ్ళే | బుచ్చిబాబు | 03 |
| 2011 | 03 | ముళ్ళపూడి వెంకట రమణగారి అముద్రిత ప్రసంగ వ్యాసం | బాపుగారి తరపున ముళ్ళపూడి వెంకటరమణ గారు | 10 |
| 2009 | 10 | వేల సంవత్సరాలుగా ప్రపంచాన్ని ప్రభావితం చేసిన భారత్ – ది గ్లోబల్ ఇండియా | డా వల్లూరుపల్లి శివాజీ రావు | 13 |
| 2009 | 08 | దాశరధి దృక్పధం – ఒక సమాలోచన | గొల్లపూడి మారుతీ రావు | 18 |
| 2009 | 07 | తిలక్ ఒక అమృతం కురిసిన రాత్రి ఒక పునర్మూల్యాంకనం | అద్దేపల్లి రామమోహనరావు | 25 |
| 2008 | 08 | 'ఆత్మకథ" ల కథ | గొల్లపూడి మారుతీ రావు | 39 |
| 2008 | 07 | మారుతికో నూలుపోగు | భువనచంద్ర | 45 |
| 2008 | 06 | ప్రవాస ప్రయాసలో మారిషస్ ఆంధ్రులు దాటిన మైలు రాళ్లు | వింజమూరి రాగసుధ | 53 |
| 2008 | 03 | తెలుగు సినీసాహిత్యం – నాటకరంగ ప్రభావం | గొల్లపూడి మారుతీ రావు | 57 |


koumudi

# ప్రముఖ రచయిత బుచ్చిబాబు గారు, తోడికోడళ్ళు సినిమాలోని ఆత్రేయ పాట గురించి ఆ రోజుల్లో వ్రాసిన సమగ్ర విశ్లేషణ

'కారులో షికారు'

- బుచ్చిబాబు




*కారులో షికారుకెళ్ళే పాల బుగ్గల పసిడీచాన*
*బుగ్గమీద గులాబి రంగు ఎలా వచ్చెనో చెప్పగలవా*
*నిన్ను మించిన కన్నెలెందరో మండు టెండులో మాడిపోతే*
*వారి బుగ్గల నిగ్గు నీకు వచ్చి చేరెను తెలుసుకో ||కారులో||*
*నిలిచి విను నీ బడాయి చాలు తెలుసుకో ఈ నిజా నిజాలు*
*చలువరాతి మేడలోన కులుకుతావె కుర్రదానా*
*మేడగట్టిన చలువరాయి ఎలా వచ్చెనో చెప్పగల*
*కడుపు కాలే కష్టజీవులు ఒడలు విరిచీ గనులు తొలిచీ*
*కడుపు కాలే కష్ట జీవులు ఒడలు విరిచీ గనులు తొలిచీ*
*చెమట చలువను చేర్చి రాళ్ళను తీర్చినారూ తెలుసుకో ||కారులో||*
*గాలిలోన తేలిపోయే చీరగట్టిన చిన్నదాన*
*జిలుగు వెలుగుల చీర శిల్పం ఎలా వచ్చెనో చెప్పగలవా*
*చిరుగు పాతల బరువు బ్రతుకుల నేతగాళ్ళే నేసినారు*
*చాకిరొకరిది సౌఖ్యమొకరిది సాగదింకా తెలుసుకో ||కారులో||*



ఇదొక సినిమా పాట. దీనిలో అందచందాలు పరామర్శించే ముందు, ఈ పాటంటే నాకు చాలా ఇష్టమని చెప్పి వేస్తున్నాను.

1959 లో కాబోలు ఈ పాటని ఒక గ్రామఫోన్ రికార్డుగా విన్నాను. ఇది ఏ చిత్రంలోనిదో నాకు తెలియదు. విన్నాక బాగుందనుకున్నాను. దీన్ని వ్రాసిన కవి ఎవరో అప్పట్లో తెలిసింది కాదు. తర్వాత ఈ పాటని చాలా మార్లు విన్నాను. అప్పుడు కూడా ఈ పాట బాగుందనుకున్నాను. పాతబడలేదు. ఈ మధ్య మళ్ళా విన్నాను. ఇంకా బాగానే ఉంది. నాలో నిలిచిపోయింది. అట్లా నిలిచిపోయినప్పుడే అది మంచి కవిత్వం అంటారు.

ఇది అంతగా నాకెందుకు నచ్చిందో మరి, పరామర్శిస్తే గాని దాని రహస్యం బైటపడదు.

పాఠకుడి సహాయమో ఆ పనికి పూనుకుంటున్నాను. ఏం బైటపడేది ఉభయులమూ చూద్దాం. ఈ పాటలో - "పాట" అనడం మానేసి "గేయం"అందాం. కాసేపు సినిమా పాటనీ సందర్భాన్నీ, పాడిన వారినీ మరిచిపోయి, పుస్తకంలో చదివిన గేయంగా చూద్దాం. ఈ గేయంలో మూడు ప్రశ్నలున్నాయి. వాటికి సమాధానాలూ ఉన్నాయి. ఇందులో సగంపైగా సొంపు ఆ ప్రశ్నలడిగిన రీతిలోనే ఉందనిపిస్తుంది.

అందమైన అమ్మాయి వయస్సు పదిహేను - పదహారు దాటదు. పాలబుగ్గలు, బుగ్గమీద గులాబి రంగు; కాస్తంత నిగ్గు; గాలిలో తేలిపోయే చీర కట్టుకుంది - జిలుగు వెలుగుల శిల్పంతో కూడిన చీర, అమ్మాయిలో కాస్తంత బడాయి ఉంది; కులుకుతుంది. సుఖంగా నవ్వుతూ ఉంటుంది.

ఆ అమ్మాయి మకాం, చలువరాతి మేడలో, సాయంత్రం అవగానే హాయిగా కార్లో షికారుకి బైలుదేరింది. మన కవి కంటబడింది. ఆమెని నిలేశాడు. కారు, ఆమే డ్రైవ్ చేస్తుందనుకోను. తనే డ్రైవ్ చేస్తే కులుకూ, తళుకూ, వయ్యారం వీలుపడవు. ఆమె లేత చేతులు స్టీరింగ్‌ని తిప్పగలవా? మృదువైన పాదాలు బ్రేక్‌ని నొక్కగలవా? అందమైన చిరకి మోర్ తైలం అంటుకుని పాడైపోదూ? పెట్రోల్ వాసనకి, జడలో పరిమళం సమసిపోదూ? నేననుకోడం, ఆమె వెనక సీట్లో వయ్యారంగా కూర్చుంటుంది. ముందు సీట్లో డ్రైవర్ నడుపుతాడు. "గాలిలోన తేలిపోయే చీర గట్టిన చిన్నదానా" అని సంబోధిస్తున్నాడు కవి. కారులో కూర్చుని ఉండగా గాలిలో చీర ఎల్లా తేలిపోతుంది? కారు మంచి జోరుగా వెడుతోంది. గాలికి ఆమె ముంగరులు అల్లల్లాడి పోతున్నాయి. జుట్టు రేగిపొయ్యే ప్రమాదం ఉంది. అందుకని, చీర కొంగుని తలపై కప్పుకుని ఉండాలి. ఆ కొంగు, చివరి భాగం గాలికి, కిటికీలోంచి బైటపడి తేలియాడిపోతూ ఉండాలి.

కవి రోడ్డుకి అడ్డంగా నిలబడ్డాడు. డ్రైవర్ కారు నిలవక తప్పిందికాదు. ఆమె కారు దిగి నిలబడి, చీరకొంగు, జడ సర్దుకొంటూ ఉంది. డ్రైవ పక్కవీధిలో టీకొట్టు కెళ్ళాడు అప్పుడడిగారు - ఆ బుగ్గమీద గులాబి రంగు ఎలా వచ్చిందో చెప్పగలవా అమ్మాయీ, అని 'చెప్పగలవా?' అన్నది చాలా అందమైన ప్రశ్న. అందులో ఆప్యాయతా, కారుణ్యం ఉన్నాయి. కాస్తంత వెటకారం ఏ మారుములో ఉన్నా, అది పొగలా కమ్మివేసే ఆరాధనా భావం వెనక, మరుగుపడింది. "నిన్ను దేవుడూ ఇంత అందంగా ఎందుకు అన్న ప్రశ్నలకి కావ్య రూపం చెప్పగలవా?' అన్నది. ఈ సమాధానం, నీకు తెలుసా? - తెలియదు పాపం" అన్న "ముందు ముందు తెలుసుకుంటావులే" అన్న జాలీ ఉంది. ఒకరకమైన 'విశ్వప్రేమ' ఇమిడివున్న ప్రశ్న అది. కవి, సౌందర్యం ఎక్కడున్నా ప్రేమిస్తాడు - ప్రేమలో, ప్రేమించినదాన్ని తన స్వంతంచేసుకోవాలన్న వాంఛలేదు. సూర్యాస్తమయం అందంగా ఉంటాయి. వాటిని ప్రేమిస్తాం - కాని అవి 'నావి' అనుకోం. అట్లాంటిదే ఈ కన్యపట్ల ప్రేమ. ఆ కన్య సమాజంలో సౌందర్యానికి ప్రతినిధి. ఆమె వెనక 'తరతరాల నాగరికత' ఉంది, ఆ నాగరికత ప్రతినిధిగా నిలబడ్డ కన్య బుగ్గమీది గులాబి గురించి, కవిలో కుతూహలం రేకెత్తి, సమాధానం తెలిసికూడా, ఆ సమాధానం ఆ కన్యకి తెలీదుగదా! అన్న భావం పట్ల సానుభూతి చూపుతూ అడిగిన ప్రశ్న అది.

అందుకే ఇందులో కరుణ రసం ఉందన్నాను.

కవి అడిగిన ప్రశ్నలూ, చెప్పిన సమాధానాలు ఎట్లాంటివో పరిశీలిద్దాం.

*మొదటి ప్రశ్న:-బుగ్గ మీద గులాబి రంగు ఎలా వచ్చింది?*

సమాధానం: ఎందరెందరో కన్నెలు మండుటెండలో మాడిపోతే వారి బుగ్గల నిగ్గు నీకు వచ్చి చేరింది - అల్లా చేరడం నిజానిజాలెట్టివో తెలుసుకో. అంటే ఏమిటి? ఎందరెందరో కన్యలు ఎండలో కష్టపడి పనిచేసి మాడిపొయ్యారు. ఆ కన్యల బుగ్గల నిగ్గు ఈ కారులో అమ్మాయికొచ్చింది. ఆ కన్యలు కష్టపడ్డారు. ఫలితం అనుభవిస్తున్నది కారులో కన్య.

ఒకటి రెండు సందేహాలు: "నిన్ను మించిన కన్నెలు" అంటే? ఎందులో ఈమెని మించిన కన్నెలు? చక్కదనంలోనా? ధనం, హోదాలోనా? బలంలోనా? ఎందులో ఈ కన్యని మించారు? స్పష్టంగా లేదు. ఈమె కంటే అందమైన కన్యలై ఉండరు. అయివుంటే, ఈ కారు కన్య చక్కదనం, ఆ కష్టపడిన ఇల్లాలి కూతురికి అబ్బిందన్నా తప్పులేదు. ఈమె కంటే ధనం, అధికారం గలవారా? అయి ఉండరు.

koumudi

అయివుంటే మండుటెండులో మాడిచావరు. ఏ సమాధానమూ తృప్తికరంగా లేదు. 'నిన్ను మించిన కన్నెలు' - అనడంలో ఇక్కడ సరైన అర్థం కుదరదు. ఇది దోషం.

మొత్తం మీద, కొందరు కన్యలు మండుటెండలో మాడిపొయ్యాక, వారి బుగ్గల నిగ్గు ఈ కారు కన్య బుగ్గ మీదికొచ్చింది - అని ఒప్పుకుందాం. కాయకష్టం చేసిన వారి శరీరాలు మృదువుగా, నాజూకుగా, సుకుమారంగా ఉండవు. చేతులు, చర్మం, వేళ్ళు దళసరెక్కుతాయి. వారి యవ్వనం ఇట్టే గడిచిపోయి, వార్ధక్యం వచ్చి మీద పడుతుంది కష్టపడి పనిచేశారు గావున, వారి బుగ్గలమీద గులాబి రేకులు ఎండలో వాడి, విడివడిపోతాయి. కష్టపడని కారు కన్య బుగ్గమీదకి ఎగిరివస్తాయి.

కారులో కన్య - ఏ పనీ చెయ్యదు. కష్టపడనక్కర్లేదు. తండ్రి ధనికుడు. లక్షాధికారై ఉండాలి. అంత డబ్బు ఎలా సంపాదించాడో మనకి తెలియదు. కష్టపడి గడించిన డబ్బా? బ్లాక్ మార్కెట్ వ్యాపారం ద్వారానా? పెద్దలు గడించి పడేసిన ఆస్తివల్లనా? మనకి తెలియదు. కూతురుకి ఒక కారు కొనిచ్చాడు. హాయిగా ఆమె షికారు కెడుతు ఉంటుంది. అన్నం తినేటప్పుడు, చేతులకూ, నాలుకకూ నోటికీ పని తప్ప, - మరే పనీ ఎరగదు. కాబట్టి ఈమె బుగ్గమీద గులాబి ఎక్కువ రోజులు పరిమళిస్తూ ఉంటుంది. - అని కవి భావన. కాని ఇది పూర్తిగా నిజం కాదు. కష్టించి పనిచేసినా - చేయకపోయినా యవ్వనం సమాప్తం అవడం, నడివయసు వచ్చిపడడం తప్పదు. భౌగోళికమైన స్థితిగతులు, వంశపారం పర్యంగా వచ్చిన ప్రత్యేకమైన భౌతిక పరిణామాలను మినహాయిస్తే, కాలం తెచ్చిన ఈ మార్పు అందరి కన్యలకీ సమంగా వర్తిస్తుంది. స్త్రీ లోలుడూ, బ్రహ్మచారి - ఇద్దరికీ నడివయస్సు ఒకే సమయంలో సంక్రమిస్తుంది. బ్రహ్మచారిలో యౌవన దశ పెరగదు. కావున కష్టపడి పనిచేసే కన్యల బుగ్గలూ, కారులో షికారెళ్ళే కన్యల బుగ్గలూ - ఒకేసారి వాడిపోతాయి. పెద్ద తేడా ఏం లేదు. అందుకని, ఈ కవి చెప్పిన ఈ సమాధానం తృప్తికరంగా లేదు. కారులో కన్య తండ్రి - దొంగ వ్యాపారం చేసి డబ్బు గడించాడనుకుందాం. పట్టు బడ్డాడనుకుందాం. అతన్ని జైల్లో పెడతారు. ఆస్తిపోతుంది. అప్పుడు కారులో కన్య గతి ఏం కాను? ఏ ఫ్యాక్టరీలోనో చేరి కష్టపడి, మండుటెండలో పనిచేసి పొట్టబోసుకోవాలి. అల్లా పని చేసినంత మాత్రాన, ఆమె బుగ్గల్లో నిగ్గు వెంటనే నశింపవుతుందా? అవదు. వయస్సు మళ్ళాకనే అవడం మొదలెడుతుంది. కాని ఓ విధంగా అవుతుంది. - బుగ్గ మీది గులాబి, యార్డ్లీ కంపెనీ వారి టాల్కమ్ పౌడరూ, క్రీమ్ వాడడం వల్ల ఏర్పడినప్పుడు 'ఎర్ర గులాబులు' (రెడ్ రోజెస్) అను పేరిట యార్డ్లీ కంపెనీ వారి టాల్కమ్ పౌడర్ మార్కెట్లో ఉంది. కారులో కన్య, అది వాడుతూ ఉంటుంది. తండ్రి తప్పిదం వల్ల ఆస్తంతా పోయి తను ఫ్యాక్టరీలో పనికి కుదురుకున్నప్పుడు, మరి టాల్కమ్ పౌడర్లకీ వీలుండదు. గులాబి ఎగిరిపోతుంది. కాబట్టి, ఆ కన్యలు మండుటెండలో మాడడం వల్ల ఈమె బుగ్గ మీద గులాబి మొలిచిందనుకోవడానికి ఆధారం లేదు. 'నిజమే బాగా చెప్పాడు సుమా, కవి' అనిపిస్తుంది గేయం చదివినప్పుడు, కాని, ఇందులోదంతా నిజం కాదు.

*రెండో ప్రశ్న - సమాధానం:*

'నిలిచి విను నీ బడాయి చాలు; తెలుసుకో ఈ నిజా నిజాలు' అంటున్నాడు మధ్యలో కవి. ఇది మంచి హెచ్చరిక. కారులో అమ్మాయి రోడ్డు మీద నిలబడింది. ఇతను మాట్లాడుతుంటే, తనకేమీ సంబంధం లేనట్లు, పరధ్యానంతో అటూ ఇటూ చూస్తూ ఉంది కాబోలు, మన కవి ఒళ్ళు మండింది - 'నిలిచి విను' "కాళ్ళు ఊపకు" - "నీ బడాయి ఆపుచెయ్యి" - "నిజానిజాలు తెలుసుకో" - అంటే, "ఇంట్లో నీకెవ్వరూ అసలు రహస్యాలు చెప్పరు. అంతా దొంగలు, అసలు సంగతి నేను చెపుతున్నాను - విని, ఇప్పుడేనా తెలుసుకో ఈ నిజానిజాలు", అనడం ఎంతో బాగుంది. "ఇవి విను" మిగతా విషయాలు నువ్వు ఎన్నో తెలుసుకుంటావు. అవి అంత ముఖ్యమైనే కావు. ఈ నిజాలు గమనించు." ఈ విధంగా ఆ కన్యను హెచ్చరించి, ప్రశ్న అడుగుతున్నాడు కవి.

ఏమిటి ప్రశ్న? "చలువరాతి మేడలోన కులుకుతావే కుర్రదానా, మేడ గట్టిన చలువరాయి ఎలా వచ్చెనో చెప్పగలవా?"

koumudi

ఆమె బిత్తరపోతుంది. ఆశ్చర్యంతో కనుబొమ్మలు చిట్లించి, కళ్ళు పెద్దవి చేస్తుంది. అవును, నిజమే, వాళ్ళది పెద్ద మేడ, అందులో కులుకుతూ ఉంటుంది. స్నానం చేసి, 'మేకప్' చేసుకుని ఉయ్యాల మీద ఊగుతూ టిఫిన్ తింటుంది - పావురంతో ఆడుకుంటుంది. రామచిలుక భుజమ్మీద - తొడమీద కుక్కపిల్ల, రేడియోగ్రామ్ వింటూ ఉంటుంది. తనూ పాడుతుంది. ఏదో జ్ఞాపకం వచ్చి ఉయ్యాల దిగి, నాట్యం చేస్తున్నట్లు గంతులేస్తుంది. అద్దంలో చూసుకుని మురిసిపోతుంది.

'తను కులుకుపోతున్నట్లు ఈయనకి ఎట్లా తెలుసో', అని ఆశ్చర్యపడుతుంది.

పెద్దమేడ - కాని అది చలువరాతి మేడ - అన్నది తను గమనించనే లేదు. ఈయనకెట్లా తెలుసు? చలువరాయి ఎలా వచ్చిందో తనకి తెలియదు. ఎందుకు ఆలోచిస్తే తప్పేం లేదు. విజ్ఞాన సర్వస్వం తయారు చేస్తున్న సంపాదకుడికి తప్ప, చలువరాయి ఎక్కడ దొరికేదీ, దాని ఖరీదు ఎంతైందీ అని అందరూ తెలుసుకోవాలని లేదు. నిరుపయోగమైన భోగట్టా ఇది. కారు కన్య తండ్రి, ఏ రోడ్ల కాంట్రాక్టరో, ఇళ్ళు కట్టించే ఆసామియో అయితే, ఆ పిల్ల కొన్ని వివరాలు తెలుసుకుని ఉండేది. అట్లాకానప్పుడు చలువరాళ్ళని గురించిన ఈ ప్రశ్న సమంజసం కాదనాలి. మన కవికి ఈ ప్రశ్న ముఖ్యమైంది. చలువరాయి ఎల్లా వచ్చింది?

__*సమాధానం:*__ కడుపు కాలే కష్టజీవులు ఒడలు విరిచీ గనులు తొలచీ చెమట చలువను చేర్చి, రాళ్ళను తీర్చినారు.

కష్టజీవులు గనులు దొలిచారు. వారి చెమటే చలువను చేరింది - ఆ కూర్పుతో రాళ్ళు పైకి లాగారు.

నిజమే, వాళ్ళు చేసినపనే ఇది. కాని కేవలం వాళ్ళ వల్లే జరిగిందనలేము. ఫలానాచోట చలువరాయి దొరుకుతుంది. ఫలానాచోట గని తవ్వండి - అని చెప్పేవారు కూడా కొందరుండాలి. ఫలానా పని చెయ్యి - అని కొందరు చెప్పాక. మరికొందరు ఆ పని చెయ్యాలి. మొదటి వాడిది మెదడు పని; రెండోవాడిది శరీర కష్టం. కాని ఇద్దరూ అవసరమే రెండోవాడు ఒళ్ళు విరిచి పనిచెయ్యాలి - మొదటివాడు, చటుక్కున భావం తట్టక, బుర్రని గోడకేసి కొట్టుకోవచ్చు.

ఇద్దరికీ చెమట పడుతుంది. ఇద్దరూ కడుపు కాలినవాళ్ళే - కాలుతున్న కడుపుతో వాడు ఆలోచిస్తున్నాడు. మంచి ఆకలిగా ఉన్నప్పుడే మెదడు చురుకుగా పనిచేస్తుందంటారు కొందరు. కాబట్టి కేవలం కష్టించిన వాళ్ళ వల్లే ఈ చలువరాయి రవాణా అయిందనుకోండి. పూర్తి నిజం కాదు.

చివరి ప్రశ్న ఏమిటో చూద్దాం.

గాలిలోన తేలిపోయే చీరగట్టిన చిన్నదానా - అని సంబోధన, అంటే పల్చటి చీర - తేలికైంది; మెత్తటిది, మృదువైన చీర, గాలిలో తేలిపోతుంది. వెనక - బ్రిటిష్ వారు రాకపూర్వం మనదేశంలో అగ్గిపెట్టెలో ఇమిడేటంత పల్చటి చీరలు నేసేవారని చెపుతారు. ఈ కారులో కన్య అంతటి పల్చటి చీర ధరించిందన్నమాట.

"జిలుగు వెలుగుల చీర శిల్పం ఎలా వచ్చెనో చెప్పగలవా?" జిగేల్ మని మెరిసే చీర - వెండి తీగలూ, బంగారు తీగ పోగులూ ఉంటే అల్లా మెరుస్తుంది. నేడు కృత్రిమ రసాయనిక ప్రక్రియలు రూపొందించిన వాటితో తయారైన చీరలు - రేయాన్, నైలాన్ మొదలైనవి - అట్లా మెరుస్తాయి. చీర తయారీలో ఎంతో 'శిల్పం' - పనివాడితనం ఉంది. ఆ శిల్పం ఎట్లా వచ్చిందో తెలుసా అని అడుగుతున్నాడు కవి.

అవును, ఆమె వాటిని గురించి ఎప్పుడూ ఆలోచించలేదు. అసలు ఆ ఖరీదెంతో ఆమెకి తెలియదు! ఏ పార్టీలోనో, ఏ పెళ్ళిలోనో, ఏ ధనవంతురాలో అట్లాంటి చీర కట్టే ఉంటుంది. ఆమె ఆ చీరని చూసి, నాన్నతో చెప్పింది - నా కట్లాంటి చీరే కావాలి అని. అంతే; రెండు రోజుల్లో ఆ చీరెలు నాలుగైదు వచ్చి పడ్డాయి."

__*సమాధానం:*__

koumudi

"చిరుగు పాతల బరువు బ్రతుకుల నేతగాళ్ళే నేసినారు." ఆ చీరని నేసిన వాళ్ళు బీదవాళ్ళు. చిరుగు పాతలు ధరిస్తారు. వారి బ్రతుకులు వారికి భారం. అట్లాంటివారు నేశారు. ఇందాకా, రెండో ప్రశ్నకి మనం సమాధానం పరిశీలిస్తున్నప్పుడు, దొరికిన పొరబాటే మళ్ళా ఇందులోనూ ప్రత్యక్షమైంది. నేసినవాళ్ళు చిరిగిన చొక్కాలు, ధోవతులు ధరించి ఉండవచ్చు. కానీ, ఆ చీరలో 'శిల్పం' అంతా వాళ్ళ పనే అన్నది పూర్తి యదార్థం కాదు. బట్టకి ప్రత్తి అవసరం. దాని ఉత్పత్తి, పంపిణి అదంతా పెద్ద వ్యవహారం. ఎన్నెన్ని దేశాలలోనో ఇది తయారై రవాణా అవుతుంది. కొన్ని లక్షల మంది ఆ పనిలో ఉన్నారు. జిలుగు, మెరుపు, తళుకు ఇచ్చేటందుకు అవసరమైన సిల్కు, రేయాన్, నైలాన్ మొదలైన వాటి తయారీ, మళ్ళా వేరే పెద్ద పరిశ్రమ. కొన్ని పాశ్చాత్య దేశాలలో తయారవుతాయి. రసాయనిక శాస్త్ర రంగంలో నిపుణులు ఆ పనిలో ఉంటారు. ఇవన్నీ పోగైనాక, ఒక 'నమూనా' (డిజైన్) - ఇట్లా ఉండాలి, అని నేసి చూపెట్టే కళాకారుడుండాలి. ఆ కళాకారుణ్ణి అవసరమైతే పై దేశం నుండి రప్పించాలి. దానికోసం బోలెడు డబ్బు కావాలి. వీళ్ళందర్నీ పోగుచేసి, ఉండేటందుకు ఇళ్ళు చూసి పెట్టికావల్సిన యంత్రాలను తెప్పించి, నడిపించే వ్యవహర్త కావాలి. బోలెడు డబ్బు పెట్టుబడి పెట్టాలి. అట్లాంటి పెత్తందారు లేకపోతే, అసలు నేతగాళ్ళే ఉండరు. నేతగాళ్ళకి ఈ నేసే పని చూపే నాథుడు లేకపోతే చిరుగు పాతలు కూడా లేకుండా అటవీకులల్లె ఉండిపొయ్యే పరిస్థితి ఏర్పడుతుంది. అందుచేత కారులో అమ్మాయి చీరలో శిల్పం, కేవలం నేతగాళ్ళపనే అనలేం. అయినా ఆ శిల్పం ఎల్లా వస్తే ఆమెకెందుకు? ఆ నేతగాళ్ళకి తాము నేసిన చీర ఎవరు ధరించారో తెలుసా? వాళ్ళకి అదెంత తెలుసో ఈమెకీ అంతే తెలుసు.

గేయంలో ప్రశ్నలు, సమాధానాలూ ముగిసాయి. అంతా అయిపోయింది. కానీ కవి అంతటితో గేయం సమాప్తం చెయ్యలేదు. చివర మరో వాక్యం కూర్చాడు.

"చాకిరొకరిది, సౌఖ్యమొకరిది, సాగదింక తెలుసుకో" అని పాఠకుడికి ఇబ్బంది లేకుండా, ఆ గేయంలోని అంతరార్థం ఏమిటో కవి చెప్పుకున్నాడు. ఇదొక నీతి పాఠం. ఏమని? కష్టపడేవాడొకడు, ఫలితం అనుభవించే వాడొకడు; - ఇట్లాంటి పరిస్థితి ఇంక సాగదు - అని తెలుసుకో, కష్టపడినవాడే ఫలితం అనుభవించాలి.

"నువ్వు కూడా కష్టపడి పనిచెయ్యాలి, ఇల్లా సింగారించుకుని, కులుకుతూ కార్లో షికార్లు తిరిగితే లాభం లేదు ఇంక నీ షికార్లు సాగవు - అని తెలుసుకో." అన్నాడు కవి.

నిజానికి మన కవికి ఆ కార్లో అమ్మాయి పట్ల కోపం, ద్వేషం లేవు. ఇవన్నీ ఆ అమ్మాయిని ఉద్దేశించి చెప్పినవి కావు. ఆ అమ్మాయికి షోకులూ, షికార్లూ, అమిర్చి పెట్టిన పెత్తందార్లని ఉద్దేశించి చెప్పిన విషయాలివి. అంటే, ఆ అమ్మాయి తండ్రిని ఉద్దేశించి చెప్పినవన్నమాట.

అమ్మాయి తండ్రి, మొదట్లో అంత పెద్ద ధనికుడు కాడు. సామాన్య కుటుంబీకుడే ఎక్కడో నౌకరీ చేసి పొట్టబోసుకునేవాడే అతనికి పెద్దల నుండి సంక్రమించిన ఆస్తిలేదు. కానీ రెండో ప్రపంచ యుద్ధం సాగిన రోజుల్లో ఓ కలప వ్యాపారంలోనో, ఇనప కడ్డీల వ్యాపారంలోనో, బోలెడు లాభాలు వచ్చిపడ్డాయి. దొంగ వ్యాపారం చేసి మరికొంత డబ్బు సంపాదించాడు.

తన అవసరాలూ, కుటుంబంలో వారి అవసరాలూ తీరాక కొంత డబ్బు మిగిలిపోయింది. అల్లా మిగిలిందే మూలధనం అంటారు. దాన్ని ఏం చేయాలి? అనేక విధాలుగా ఖర్చు పెట్టొచ్చు. సత్రవలు, ఆస్పత్రులూ కట్టించొచ్చు. దాన ధర్మాలు చెయ్యొచ్చు. లేక ఒక సినిమా తియ్యవచ్చు. ఆ చిత్రం బాగుండి, డబ్బొచ్చి పడితే, మరో చిత్రం తియ్యవచ్చు. కోటీశ్వరుడై, పెద్ద సినిమా స్టూడియో నెలకొల్పవచ్చు.

అట్లా డబ్బు చేసుకున్నాక - పెత్తందారు కూతురు, మన కారులో షికార్లు తిరిగే అమ్మాయి. కాబట్టి ఏమిటన్నమాట? "పెత్తందార్ల ఆటలుసాగవు సుమా" అంటున్నాడు కవి. దీన్ని రెండు విధాలుగా విమర్శించవచ్చు.



koumudi

ఒకటి, పెత్తందారు, కష్టపడకుండా, ఈ డబ్బు సంపాదించాడనడం సబబుకాదు. 'కష్టం' అంటే కాయకష్టం మాత్రమే అనుకోకూడదు. సమాజంలో రెండు రకాల వారుంటారు. ఏం చెయ్యాలో చెప్పేవారు; చెప్పిన దాన్ని చేసేవారు; వీళ్ళిద్దరూ సమంగా కష్టపడి పనిచేసేవారే - మెదడు పని కొందరిదీ, మరికొందరిది కాయకష్టం. కొందరు మాత్రం, చెప్పేవారుగా ఎందుకుండాలి? అవసరాలు తీరాక మిగిలిపోయిన ధనం ఉన్నవారే చెప్పేవారుగా ఉంటున్నారు. కార్లో అమ్మాయి తండ్రి మెదడు పనితో లక్షాధికారి అయివుండొచ్చు. ఇతనితో మన కవికి పేచీలేదు. ఆ మెదడు పని లేకుండా, పెద్దలు సంపాదించి పారేసిన వందెకరాల భూమి సంక్రమించి ఉంటే, దానిపై వచ్చే ఆదాయంతో, సలహా చెప్పేవారి చిట్టాలో చేరిపొయ్యే దక్షత తెచ్చుకున్నాడు - అన్నప్పుడే 'ఇది సాగదు' అంటాడు కవి. ప్రస్తుతం ప్రజాస్వామ్యం కొనసాగుతున్న దేశాలలో ఇది సాగుతూనే ఉంది. ఏం చెయ్యాలో చెప్పడం, పనికి కావలిసిన వాటిన తన అధీనంలో ఉంచుకోవడం - ఈ రెండూ, పెత్తందార్ల చేతుల్లో ఉండకుండా, అందరికీ సమంగా చెందే సామాజిక వ్యవస్థ ఉండాలంటాడు కవి. కాని 'ఇది సాగదు' అని ఖచ్చితంగా అనడం కవి కుస్తీకి దిగినట్లు ధ్వనిస్తుంది.

'ఇది సాగదు' - మరో వ్యవస్థ వచ్చి పడుతుంది. బాగానే ఉంది. అందరూ కష్టపడి పని చేసి, ఫలితాన్ని సమ్మంగా అనుభవించడం వల్ల, మనందరికీ ఇష్టమే. కానీ తీరా ఆ వ్యవస్థ వచ్చాక, అందులో ఎట్లాంటి పేచీలుంటాయో, కవికి ఏం తెలుసు? ఎల్లా తెలుసు? ఎవరో చెప్పింది చెపుతున్నాడు, ఆ సూత్రాలు ఆధారంగా రూపొందిన సమాజంలో ఈ గేయంలో కవి అడిగిన ప్రశ్నలను అడిగే స్వేచ్ఛ కవికి ఉండకపోవచ్చు. పెట్టుబడిని స్వాధీనం చేసుకున్న ప్రభువు నిరంకుశ ప్రభువు కావొచ్చు. ఆ ప్రభువుని ప్రశ్నలడిగే స్వేచ్ఛ కవికి ఉండక పోవచ్చు.

రెండోది - కవి నిజానికి, కార్లో అమ్మాయిని సంబోధించి చెప్పడంలేదు. ఆమె వెనక ఉన్న సమాజ వ్యవస్థనీ, దానిలో పెత్తందారల్నీ ఉద్దేశించి చెపుతున్నాడు. తిన్నగా ఆ కార్లో అమ్మాయి తండ్రి సినిమా కంపెనీ పెట్టాడనుకుందాం. కవిని కేకేసి, "పాటకి ఇంతిస్తాను, నాలుగు సినిమా పాటలు వ్రాసిపెట్టు" అంటాడు. అప్పుడు ఆ కవి, పెత్తందారు ఏ విధంగా దొంగ వ్యాపారంలో డబ్బు సంపాదించిందీ ఏకరువు పెడుతూ పాటలు వ్రాయగలడా? సాహసించి వ్రాస్తే, ఆ పాటలో అర్థం, ఆయన గ్రహిస్తే, ఈ కవిని మాన్పించి, మరో కవిని పెట్టుకోవాలి. ఎవరి కూడుతింటున్నామో, వారినే వెక్కిరించలేము. భారతదేశంలో కర్షుడి విషయం వేరుగా చెప్పనక్కర్లేదు. ఉదాహరణకి, మన పెత్తందారు, కాలేజి పెట్టాడనుకుందాం. అందులో కవిని, ఉపాధ్యాయుడుగా వేశాడనుకుందాం. పెత్తందారు వీరశైవుడనుకుందాం. అప్పుడు వీరశైవం తుక్కు మతం, అని మేష్టరు బోధించగలడా? ఆ ధైర్యం లేక, ఇస్లామ్ మతాన్నో, క్రైస్తవ దూషిస్తూ, చివరికి అన్ని మతాలూ తుక్కు మతాలే అనేసి నాస్తిక తత్వాన్ని బోధించడంతో తృప్తి పడాల్సి వస్తుంది. అసలు మతం గొడవలేకుండా, లౌకిక సూత్రాలపై ప్రభుత్వమే కళాశాల నిర్వహిస్తే పండితుడికి ఈ పేచీలుండవు. కాని, ప్రభుత్వం ఆదేశించిన ప్రకారమే, బోధించే పరిస్థితి ఏర్పడుతుంది. మళ్ళా దాని పర్యవసానం వేరు. మనకిక్కడ అప్రస్తుతం.

ఆధునిక కావ్య సంపుటిలో ఒక గేయంగా, ఈ రచన చదివినప్పుడు నాకెల్లా నచ్చింది? ఈ గేయం నాకిష్టం అన్నాను మొదట్లో! ఒక సామాజిక వ్యవస్థకి సంకేతంగా ఉన్న ఒక అమాయకురాలైన కన్యని, కొన్ని ప్రశ్నలడగడం నాకు నచ్చింది. మూడు ప్రశ్నలున్నాయి ఈ గేయంలో. ఈ మూడు, మూడు విలువలకి సాంకేతికాలుగా స్వీకరిస్తాను. బుగ్గమీద గులాబి, సౌందర్యానికి సాంకేతికం, చీరలో శిల్పం, కళకి సాంకేతికం, చివరలో 'నీతి' కూడా నాకు నచ్చింది. ఒక్క బాగాలేనిది 'సాగదింక తెలుసుకో' - అన్న బెదిరింపే.

ఈ గేయం ఒక సామాజిక వ్యవస్థని పరామర్శిస్తోంది. కాని, సాధారణంగా మన కవితలో వెదికే, పరమార్థ చింతన సాక్షాత్కారం, అతీంద్రియ జ్ఞానంతో ముడిపడ్డ మహదానందం ఇందులో దొరకవు. కవి ఆశించిన వ్యవస్థ సిద్ధించగానే గేయంలో 'పస' పోతుంది. విశ్వమానవుడిలో సదా నివాసం ఏర్పరచుకున్న 'జిజ్ఞాస, తృష్ణ, ఆశ, మానవత్వం' మొదలైన వాటిని అంటిపెట్టుకున్న రసం అంతగా లేదు. ఇది లేనందున, ఇది మంచి కావ్యమే అయినా, మంచి సాహిత్యం అనలేను. కావ్యం, దానికున్న స్వరూపాన్ని బట్టీ, అందులో కవిత

koumudi

ఉన్నా లేకపోయినా, కావ్యంగా, సాహిత్యంగా చలామణీ అవుతుంది. కథో, నవలో అయితే; అందులో ఎంత కవిత, సాహిత్యం ఉన్నా, గద్య స్వరూపం బట్టి, సాహిత్యంగా చలామణీ అవదు.

పాఠకుడుగా నే పొందిన అనుభూతిని విడిచేసి, సినిమా పాటగా, దీని ప్రభావం ఎట్లాంటిదో చూద్దాం. దీన్ని పాడేవారొకరుంటారు; నేపథ్యవాద్యాలెన్నో ఉంటాయి. తెరపై కథలో, ఒక సందర్భంలో ఎవరో పాడతారు. ఎవరో నటిస్తారు. హాల్లో వేలమంది జనం చూస్తారు. ఆ పాట నుండి ఉద్భవించేది సాముదాయకమైన రసం. పాటలో విషయం, భాగ్యవంతుణ్ణి ఆక్షేపించడం. ఒళ్ళొంచి పని చెయ్యకుండా సుఖాలనుభవించే వారిని వయ్యారంగా వెక్కరించడం, హాల్లో జనంలో చాలామంది 'బీదలే' - అంటే కష్టపడి పనిచేసి పొట్టపోసుకునేవారే. వారికి సినిమా కసి ఉంటుంది. ఆ 'కసి' ఈ పాట ద్వారా బైటపడుతుంది. వారి మనస్సులో రహస్యంగా ఉన్న ఆవేదన, వ్యథ, ఇతరులతో పంచుకోవడంతో తగ్గుతుంది. అందుకని, ఈ పాట సినిమా హాల్లో బాగా రక్తికడుతుంది. ప్రేక్షక జనంలో వారి తెలివితేటలు, సున్నా నుండి వందవరకు ఉంటాయనుకుంటే - ఈ పాట 30 పాళ్ళు తెలివిగల సమూహానికి రుచిస్తుంది, "నీ బడాయి చాలు" "సాగదింక తెలుసుకో" అన్న పదాలు, వారు లోలోన అనుకుంటున్నవే.

హాల్లో జనం ఏ పదిమందో ఉండి సినిమా చూస్తే చిత్రం ఎంత మంచిదైనా రక్తికట్టదు. సమూహ ఉద్రేకానికి - అంతటి ప్రభావం ఉంది. ఒక గుంపులో కలిసిపోయినప్పుడు, వ్యక్తి ఎంత నిదానం కలవాడైనా ఎంతటి శాంతి కామి అయినా, ఆ గుంపులో ఆ క్షణంలో రేగిన ఉద్రేకానికి లొంగిపోయి, వ్యక్తిత్వాన్ని కోల్పోయి, వారిలో ఐక్యం అయి, చేష్టలో, మాటలో వారినే అనుసరిస్తాడు. అట్లాంటి సమిష్టి ఉద్రేకాన్ని పురిగొల్పేదిగా ఉంది గనకనే సినిమా పాటలో, ఎంతటి కవిత్వం ఉన్నా, అది 'చౌకబారుగా' ఉందన్న సాముదాయక భావం ప్రజాస్వామ్యంలో ప్రచారమౌతూ ఉంది. ఆ పాటకి కట్టిన ట్యూన్, పాడడంలో నటుడి చేష్టలు, సినిమాలో సందర్భం ఇవన్నీ పాట స్థాయిని దిగలాగే ప్రమాదం సాముదాయక కళా వ్యవస్థలో ఉందనే ఒప్పుకోవాలి. సినిమా - కళా, పరిశ్రమా అన్న విషయం ఎందరో చర్చించారు. ఒక వ్యక్తి సృష్టించిన దానికి ఎందరెందరో రూపకల్పన చేసి, ప్రదర్శనని వేలాదిమంది కైసి ఆస్వాదించి, ఆనందించినప్పుడు, అది పరిశ్రమ. కవి మొదటి దశలో కళాకారుడూ. సినిమా నిర్వాహకులు నిర్దేశించినట్లు పాట వ్రాసి ఊరుకుంటాడు. ఆ రచన చివరి దశలో 'పరిశ్రమ'గా అంతమొందవచ్చు. ఇది వరలో సినిమా లేదు గనక, మొదటి దశ కళనే మనం మెచ్చుకుంటున్నాం; ఇప్పుడే సినిమా స్వీకరించి, రెండవ దశకి అనువైన కొలత బద్దతో విలువలు కట్టడం నేర్చుకోవాలి.

కార్లో అమ్మాయిని రోడ్డుమీద చాలాసేపు నిలబెట్టాం. డ్రైవర్ పక్కవీధిలో టీ తాగి, సిగరెట్ కాల్చి చక్కా వచ్చాడు. అమ్మాయి కార్లో ఎక్కి, 'పీసీ' అంది డ్రైవర్‌తో, కవిని 'థ్యాంక్' చేసి ఉంటుందా? అతను 'కవి' అని ఆమెకి తెలియక పోవచ్చు. ఏ ప్రెస్ రిపోర్టరో అనుకుందా? అసలు, ఆ కవి కూడా, కార్లో అమ్మాయిని ప్రశ్నలడిగాడను కోగలమా? ఆమె ఒక సినిమా నటి కాకూడదూ! ఆ అమ్మాయి నటిస్తున్న చిత్రానికే, మనకవి పాటలు వ్రాసి ఉంటే, అసలు విషయం గ్రహించి, ఆ ప్రశ్నలడిగినందుకు పెదవి కొరుక్కుని బాధ పడతాడా? ఏమో. ఆ కవి ఎవరు?

ఈ పాట వచ్చిన కొత్తలో (1959లో కాబోలు) "చాలా బాగుందండి పాట" అన్నాను శ్రీశ్రీగారిని, ఆయనే వ్రాశాడనుకుని. వ్రాసింది ఆయన కాదుట. ఆచార్య ఆత్రేయట. కాని నేను పెదవి కొరుక్కోనక్కర్లేదు. - మీరు అంతే. !!


రచయిత-బుచ్చిబాబు

koumudi

*స్థలం:* టెక్సాస్

*తేది:* అక్టోబర్ 14, 2006

*సందర్భం:* బాపు గారికి లైఫ్ టైమ్ ఎఛీవ్‌మెంట్ అవార్డు ప్రదానోత్సవం

*నేపథ్యం:* బాపుగారి తరుఫున ముళ్ళపూడి వారు వ్రాసిచ్చిన ప్రసంగమిది

*జరిగింది:* బాపుగారు ఎలానూ వేదిక మీద మాట్లాడరు కాబట్టి పప్పు వేణుగోపాల రావుగారు దీన్ని ప్రేక్షకులకి చదివి వినిపించారు.

koumudi

సభకు నమస్కారం

శ్రీ వంగూరి చిట్టెన్ రాజుగారు మా దేశం వచ్చి నన్నూ ముళ్ళపూడి వెంకట రమణగారినీ ఎంతో ప్రేమాభిమానాలతో ఈ సభకి ఆహ్వానించారు. రమణగారు రాలేనన్నారు. మౌనంగా ఉన్న నన్ను చూసి - నాకు సభాకంపం జనగండం ఉందని తెలిసీ, తమ సహజ హాస్యధోరణిలో - మీరన్నా వచ్చి నాలుగు ముక్కలు మాట్లాడండి అన్నారు రాజుగారు. అంశం "సాహిత్యములో హాస్యం."

నిఘంటువు చూశాను. సాహిత్యం అనగా సాహచర్యము, మైత్రి, సంఘము, సంఘటన, కావ్య వాఙ్మయము, కవిత్వము కావ్యశాస్త్రము, సామగ్రిసంకలనము, భోజనావసర వస్తువుల మొత్తము - అనిన్నీ, హాస్యము అనగా నవ్వతగినది, నవరసములలో నొకటి, నవ్వు, సంతోషము వేళాకోళము, -ఆక్షేపము అని ఉంది.

అందాల రాముడు రాజబాబు అన్నట్టు నాకు తెలుగే సరిగ్గా రాదు. సంస్కృతం నిల్లు. అందుచేత నాకేం తోచక ఇద్దరి తరపునా - సాహిత్యం అంటే మైత్రి అనివుంది కదా ఏదేనా చెబితే రాసుకుని చదువుతాను అని రమణగారిని అడిగాను.

ఇలా చెప్పారు.

శ్రీ చిట్టెన్ రాజుగారి మధుర వాక్యంతో మొదలెడదాం.

"అయ్యా నమస్కారం"

"స్కారం"

"రేపాదివారం తమరికి సన్మానం"

"ఎందుకూ?"

"తమరు గొప్పవారు కనక"

"అలాగా! అలాక్కానీండి. చేసుకోండి"

"ఛీక్ నువ్వేం పెద్దమనిషివయ్యా - మర్యాదకి - మాటవరసకి నువ్వోహ గొప్పవాడివీ అంటే - అవును మరేస్మీ అని ఠంగున ఒప్పేసుకుంటావా! సన్మానం చెయ్యమ్మటావా!!"

"అదీ రైటే - అయితే నేను మీరన్నట్టు ఒహ గొప్పవాణ్ణికాను. సన్మానాలకి తగను"

"ఛీక్ - ఎడ్డెమంటే తెడ్డెమంటావ్. సన్మానం చేస్తామయ్యా మగడా అని దేవులాడితే నేను తగనూ సన్నాసినీ అని పొమ్మంటావా - మాకు బుర్రలేదా? టేస్టులేని ఏబ్రాసులమా? నువ్వుగొప్పవాడివయ్యా అని మేమంటే - కాదూ నేనుత్తి సన్నాసినండీ అని నవ్వంటావా! అది మా జెడ్జిమెంటుకీ మా టేస్టుకీ ఇన్సల్టు కాదయ్యా!"

"అలాగా! అలా వచ్చారా! - సరే - నా ఇష్టం. నేను గొప్పవాడినో వట్టి వెధవాయినో నువు చెప్పేదేవిటీ - నేనే ఢంకా బజాయించి మరీ చెప్పుకుంటాను. గీతలో కృష్ణభగవానుడిలా..."

"ఆయనేం చెప్పాడు?"

"ఏం చెప్పలేదటా!? అన్నిట్లోనూ బెస్టుగార్ని నేనే - జంతువుల్లో సింహాన్నీ, పక్షుల్లో హంసనీ - పువ్వుల్లో గులాబీనీ - మాసాల్లో మార్గశిరాన్నీ - భక్తుల్లో ప్రహ్లాదుడినీ - శత్రువుల్లో హిరణ్యకశిపుడినీ డబ్బులో డాలర్నీ - రచనలో రమణ్ణీ - బొమ్మల్లో బాపునీ."

"ఆగండీ - ఇది కల్తీలేని అహంకారం - ప్యూర్ ఈగో! దేవుడైనా సరే" -

- ఎంత దేవుడైనా ఒంటిమీద ఎన్ని భూషణాలున్నా వినయభూషణం ఉన్నట్టులేదే! "మరే లేనట్టే ఉంది.- మాలాగే! ఇదేకాదు రాజు గారూ.. దీన్ని మించినది ఆ శ్రీహరిగారి గురించి ఇంకో కథ ఉంది. అదితికశ్యపులు పదివేల ఏళ్ళు తపస్సు చేశారు. విష్ణుమూర్తి ప్రత్యక్షం అయి వత్సా వరం కోరుకో అన్నాడు. జగన్నాధా - నీ వంటివాడు పుత్రుడుగా పుట్టాలి అన్నారు వాళ్ళు. భలేవారే! నా వంటివాడు ఇంకోడెక్కడుంటాడుటా! బాగు బాగు. నేనే పుడతానులెండి అన్నాడు శ్రీహరి. ఆయన అబద్ధం చెప్పలేదు కదా! అహంకార దోషం అంటుందని మొహమాట పడలేదు కదా! పైగా మీ బోటివాడు 'మీకు గర్వం కదా శ్రీహరీ అంటే - ఓరి సన్నాసీ! గర్వం నాక్కాపోతే నీకా ఉంటుంది అని నవ్వేస్తాడు."

రాజుగారు - "ఈ హరికథలాపేసి అసలు కథకి రండి" అని కోప్పడ్డారు.

****

వస్తున్నాం - మేము ఒహ గొప్పాళ్ళం కాదు. ఇద్దరు గొప్పాళ్ళం - ముప్పాళ్ళ రంగనాయకమ్మగారిలా

గోదారి కెడా పెడాగా - నేను తూగోజీలో - బాపు పగోజీలో పుట్టాంట. అపుడు ప్రపంచంలో పూలవాన కురవలేదు. ప్రళయాలేం రాలేదు. గంధర్వులు పాడలేదు. కోకుల్ని కుహూ అనమంటే 'ఉహూ' అన్నాయని గిట్టని వాళ్ళ ప్రచారం. అచ్చరలాడలేదు. దుబాయి టూరెళ్ళాయట. పేపర్లు సప్లిమెంట్లు వేయలేదు. టీవీ యాంకర్లు హలో బాపూ అండీ హలో రవణాంకుల్ అని గ్రీటింగ్స్ చెప్పలేదు. భూ చక్రంలో భూమండలంలో ఆ రోజు తెల్లారగానే సూర్యుడు మామూలుగానే ఉదయించాడు. ఆ రాత్రి చంద్రుడు కూడా అలవాటు ప్రకారం వెన్నెలే కాశాడు. చుక్కలు తళుకు తళుకుమన్నాయి కొబ్బరాకులు మిలమిలమన్నాయి. పువ్వులు పూశాయి. పిల్లలు అల్లర్లు చేశారు. రెండు జెళ్ళ సీతలు బాపు బొమ్మల కోసం పోజులు పెడుతూ రెండుజెళ్ళ లేళ్ళలా చెంగుచెంగున దూకుతున్నారు. బాబాయిగాళ్ళ ఒంటి కాళ్ళమీద తపస్సులు చేస్తూ గడ్డాలు గీసుకుంటున్నారు. అప్పారావులు అప్పులు చేసేస్తున్నారు. ఎగేస్తున్న వారవుతున్నారు. క్రిష్ణశాస్త్రుళ్ళు (ఉన్నదీ ఉండేదీ ఒక్కడే) పొయెట్రీలు రాసేస్తున్నారు. గిరీశాలు లంక చుట్టల కొసలు కొరికి ఫట్ మని బుచ్చెమ్మల వైపు గురికొడుతున్నారు. ఇల్లాళ్ళు కూరల కావిళ్ళ దగ్గర కూరలు బేరాలు చేస్తున్నారు. వావిళ్ళ వారి కోడళ్ళకి

koumudi

వేవిళ్ళవుతున్నాయి. అగ్నిహోత్రావధాన్లు అంకాళమ్మ గుడి చాటు సంతలో బుచ్చమ్మ చెల్లి పెళ్ళికి కన్యాశుల్కం బేరాలు నడుపుతున్నాడు. మధురవాణి బారెడు జడను గిరున తిప్పి రామప్పంతులు నడ్డివిరగ్గొడుతోంది. అజ్జాసి మంచి వాళ్ళ బుర్రల్లో దుష్టాలోచనలు తళుక్కుమని చెంపలేసుకుంటున్నారు. చెడ్డవాళ్ళకి మంచాలోచన పుట్టి గతుక్కుమని ఛూ ఛూ అనుకుంటున్నారు విశ్వనాధవారిలా. నేను 1931లో పుట్టి కెవ్వుమనగానే ఆ అరుపుకి తెలుగు మూకీలు మేలుకుని టాకీలయి పోయి సినిమాలో భక్తప్రహ్లాదుడికి మాటలొచ్చేశాయి. అన్నట్టు మరిచాను - అంతకు ముందే రాజేసిన కుంపటి మీద అంతకు ముందే పెట్టి మాలతిగారు మర్చిపోయిన మాడిన వేడి మూకుడులో అంతకు ముందే తరిగి ఉంచుకున్న కూరముక్కల్ని వెయ్యగానే అవి చుయ్ చుయ్ మన్నాయి. అది విని కావు కావుమన్నాయి కాకులు. దేవుడా కావుకావుమన్నారు లోకులు. ఇవు ఇవ్వుమన్నారు పేదలు. లెవ్వు లెవ్వు అన్నారు లోభులు - ముద్దు ముద్దు అన్నారు ముగుళ్ళు. వద్దు వద్దు అన్నారు ఇల్లాళ్ళు.

ఈ ప్రకారంగా బాపు రమణల పుట్టడాలు పెరగడాలు కారం అప్పడాలూ, వడియాలూ ఏ ఒడిదుడుకులు లేకుండా సూర్యమండల చంద్రమండల భూ మండల ఉభయ గోదావరి మండలాలలో జీవకోటికి అలవాటైన బాటలోనే చంద్రబాబు గారిలాగా ‘ముందుకు పోతా‘ ఉండగా నేను 76వ మైలురాయి దగ్గరా బాపు 74 దరిదాపుల్లోనూ తేలాం.

అందువల్ల ఇంత గొప్ప అవధానం చేసినందుకు గర్విస్తున్నాము. ఎందువల్లనంటే అవధానంలో అప్రస్తుత ప్రసంగం ఉంది గనుక.

ఓపిగ్గా విన్న పెద్దలకు మనసారా నమస్కారాలు. పిన్నలకు వయసారా దీవెనలు.

(ఈ ప్రసంగపాఠం ఒరిజినల్ ప్రతిని ‘కౌముది‘కి అందించిన చిట్టెన్ రాజు గారికి కృతజ్ఞతలు)

koumudi

## ది గ్లోబల్ ఇండియా

డాక్టర్. వల్లూరుపల్లి శివాజీరావు

*తాతలు తాగిన నేతి వాసననే తలచుకుంటూ ఉండి పొమ్మని ఎవ్వరూ అనరు కానీ, తాతలు నిర్మించిన వైభవం, తాతలు సృష్టించిన చరిత్ర మరచిపోవడం మాత్రం పురోగమనానికి మంచిది కాదు. ఏ దేశపురోభివృద్ధి ఐనా చరిత్ర పునాదుల మీద ఎంతో కొంత ఆధారపడక తప్పదు. ఐతే మన విద్యాలయాల్లో మనం చదువుకున్న, ఈనాటి విద్యార్థులు చదువుతున్న భారతదేశ చరిత్ర పదివేల సంవత్సరాల వైభవానికి నిజమైన దర్పణమేనా? ప్రపంచంలోని అనేక భాషలకీ, అనేకమతాలకీ, అనేక శాస్త్ర విజ్ఞాన పరిశోధనా ఫలితాలకీ భారతదేశమే పునాది అన్న విషయం మనలో ఎంతమందికి తెలుసు? రాజ్యవిస్తరణ కాంక్షతో భారతదేశాన్ని దాదాపు రెండు శతాబ్దాల పాటు తమ కబంధ హస్తాల్లో బంధించి బ్రిటిష్ పాలకులు వదిలివెళ్ళిన సాంఘిక శాస్త్ర పుస్తకాలని స్వాతంత్ర్యం వచ్చాక మనమేమైనా మార్చుకున్నామా? వాళ్ళు చేసిన ఘోరాలని కప్పిపుచ్చుకోడానికి భారత దేశ చరిత్రని వక్రీకరించిన బ్రిటిష్ పాలకుల కుటిలత్వాన్ని ఎదిరించి, మన దేశ చరిత్రని మనం ఎప్పుడైనా తిరగరాసే ప్రయత్నాలు చేసుకున్నామా? కేవలం కొన్ని శతాబ్దాల చరిత్రవున్న దేశాలే తమ చరిత్రగురించి ఎంతో గర్వంగా చెప్పుకుంటూ, ప్రచారం చేసుకుంటుంటే వేల సంవత్సరాల వైభవం కలిగిన మనదేశ చరిత్ర గురించి మనమెంత గర్వంగా చెప్పుకుంటున్నాం? -*

ఇన్ని ప్రశ్నలు వేసుకున్నది చరిత్రని ఎన్నో సంవత్సరాల బోధించిన ఉపాధ్యాయుడు కాదు, దేశ విదేశ చరిత్రల మీద పరిశోధనలు చేసిన చరిత్రకారుడు కాదు.. ఇన్ని ప్రశ్నలకి సమాధానం వెదకదలచుకున్నది ఒక వ్యవసాయ శాస్త్రవేత్త..!!

ఇలాంటి ఇంకెన్నో ప్రశ్నలు సంవత్సరాల తరబడి తన ఆలోచనలని తొలిచివేస్తుంటే వృత్తి రీత్యా వ్యవసాయ శాస్త్రవేత్త ఐన డా.శివాజీ రావు గారు, 68 సంవత్సరాల వయసులో, ఈ అరుదైన, అద్భుతమైన, అపురూపమైన, అమూల్యమైన గ్రంధాన్ని ప్రపంచవ్యాప్తంగా అందరికీ అందుబాటులో ఉండేలా ఆంగ్లభాషలో రచించారు. ఎవరూ చూడని కోణంలో మనదేశ చరిత్రని చూపించడమే కాక భారతదేశం సహస్రాబ్దాలుగా ప్రపంచంలోని అన్ని దేశాలనీ ఎలా ప్రభావితం చేసిందీ అనే కోణంలో ఈ పరిశోధనా గ్రంధాన్ని అందరికీ అర్థమయ్యే సులువైన భాషలో వ్రాశారు. ప్రతి పేజీ, ప్రతి వాక్యం ఎంతో ఆసక్తికరంగా సాగుతుంది. మనదేశంతో బాటు అంతర్జాతీయంగా కూడా విడుదలైన THE GLOBAL INDIA గురించిన కథనం ఈ నెల కౌముదిలో మీకోసం ప్రత్యేకం..!

'బ్రిటిష్ సామ్రాజ్యపు కిరీటంలో ఉన్న అత్యుత్తమమైన మణి'గానూ, 'భూగోళపు కిరీటానికి కలికితురాయి'గానూ ప్రసిద్ధిగాంచిన మన భారతదేశం కొన్ని వేల సంవత్సరాలుగా ప్రపంచంలో అతి సంపన్నదేశమని చాలా తక్కువ మందికే తెలుసు. సుమారు లక్ష




సంవత్సరాల క్రితం ఆఫ్రికానుంచి వలసి వెళ్ళిన మొదటి తెగల తొలి అడుగు భారతావనివైపుకే వేశారు. కొన్ని వేల సంవత్సరాల తర్వాత, పెరిగి పెద్దదైన వారి సంతానం నాగరికతను నేర్చుకుని, దానిని అభివృద్ధి చేసుకుని, తద్వారా సనాతన ధర్మాన్ని స్థాపించి వేదాలు ప్రభోదించిన రీతిలో జీవన సరళిని అనుసరించారు. దీని ఆధారంగానే పదివేల సంవత్సరాల క్రితం అందరికీ ఆమోద్యమయిన, అన్ని దేశాల కంటే ఉన్నతమైన సంస్కృతిని ఏర్పరచుకుని, దానిని వృద్ధి చేశారు..

ఈ భారత నాగరికత సుమేరియా (మిసొపొటేమియా), ఈజిప్ట్, గ్రీకు, రోమన్, చైనా నాగరికతలకంటే అతిప్రాచీనమైనదని, అత్యుత్తమమైనదని ప్రపంచంలో చాలామందికి, ముఖ్యంగా పాశ్చాత్యదేశస్తులకు తెలియదు. ఈ భారతావని సనాతన ధర్మం (హిందూ మతం) తోపాటు ప్రపంచంలో ముఖ్యమైన జైన్, బౌద్ధ, సిక్కు మతాలకు కూడా జన్మనిచ్చింది. ఈ దేశ ప్రజలు కొలంబస్‌కు కొన్నివేల సంవత్సరాలకు పూర్వమే ఓడలు నిర్మించారు, భయంకరమైన సముద్రయానం చేశారు. దూరదేశాలకు వలస వెళ్ళారు, మరియు తమ వేద, ఇతిహాస, పురాణ వేదాంగాలను, వాటి సారాంశాలను పరదేశాలకు వ్యాప్తిచేశారు.

koumudi

ఇవి తెలుసుకునే మార్క్‌ట్వైన్ అనే అమెరికా రచయిత ఈ విధంగా అనటం జరిగింది: "ఇండియా మానవజాతికి ఒక ఊయల, మానవభాషకు, వాక్కుకు పుట్టిల్లు, చరిత్రకు అమ్మమ్మ (గ్రాండ్ మదర్), ఐతిహ్యానికి (ట్రడిషన్) జేజమ్మ (గ్రేట్ గ్రాండ్ మదర్). మానవాళికి అత్యంత విలువయిన బోధనా మూలవస్తువులు నిక్షిప్తమైన దేశం ఏది అంటే అది ఇండియానే". అలాగే నోబెల్ బహుమతి గ్రహీత, ఫ్రెంచ్ గ్రంధకర్త రొమెయిన్ రోలాండ్ ఇలా వ్రాసాడు: "ఈ భూమి మీద పుట్టిన మానవులకు వాళ్ళు పుట్టినప్పటినుండి నిలయమైనది అందరి కలలు, ఆలోచనలు నెరవేరిన దేశమేదంటే అది ఇండియానే"

ఇలాగే ఎంతో మంది నిష్పక్షపాత చరిత్రకారులు, పండితులు కూడా మన భారతావనిని ప్రస్తుతించారు. కాని విదేశస్తులలో, ముఖ్యంగా పాశ్చాత్య దేశాల వారిలో 98 శాతం, అనాగరికతతో మగ్గుతున్న వారి దేశాలకు కొన్నివేల సంవత్సరాలకు పూర్వమే భారతదేశం మానవజాతికి పట్టుకొమ్మయని, అనేకరంగాలలో ముందంజ వేశారని, చాలా రకాలుగా మానవ మనుగడకు తోడ్పడిందని తెలియదు. మనదేశస్తులకు కూడా కొంత తెలుసుగాని, సంపూర్ణంగా తెలియదంటే అతిశయోక్తి కాదు.

✡ ✡ ✡

డాక్టర్.శివాజీరావు గారు 'భారతదేశం పదివేల సంవత్సరాలుగా మానవాళి మనుగడకు అభివృద్ధికి, శ్రేయస్సుకు వివిధరంగాలలో చేసిన పురోభివృద్ధిని, మహత్కార్యాలను అవి ఈ భూగోళంలోని వివిధదేశాలకు ఏ విధంగా వ్యాపించాయి, తద్వారా అవి ఎంత ప్రభావితమైనవి' మొదలైన విషయాలను ఈ పుస్తకంలో వ్రాశారు. ప్రారంభ అధ్యాయంలో బ్రిటిష్ వారు పద్దెనిమిదవ శతాబ్దాంతరం వరకు భారతదేశపు అద్భుతమైన, అసమాన్యమైన, సదృశ్యమైన, దివ్యమైన చరిత్రను ఎలా బయటకు రాకుండా చేశారు, వక్రీకరించి వాళ్ళ చరిత్రకారులతో తప్పుల తడకలు వ్రాయించి మనవారికి బోధనా పాఠ్యాంశాలుగా ఉపయోగించారు, అప్పటివరకు ఉన్న మన ఉన్నత విద్యావిధానాన్ని ఎలా అధోగతి చేశారు, ఇంకా ఇతర ఆసక్తికరమైన విషయాలు ఉన్నాయి.

రెండవ అధ్యాయం భారతావని ప్రాచీన నాగరికత, సంస్కృతి, భాషలు, సమాజంలో జరిగిన జాతి, వర్గీకరణ, నివాసితుల తెగల గురించిన ఆసక్తికరమైన కథనం ఉంది.. ఇందులో సరస్వతీ - సింధూ (ఇండస్ వాలీ) నాగరికత, హరప్పా, లో థాల్, మొహంజిదారో ధోలవీరలాంటి ఇతర వేదకాలపు తావులలో త్రవ్వకాల ద్వారా బయల్పడిన విశేషాలు కూడా ఉన్నాయి.

మూడవ అధ్యాయంలో వేదకాలంలో ఉద్భవించిన వివిధవేదాలు, బ్రాహ్మణాలు, అరణ్యకాలు, ఉపనిషత్తులు, భగవద్గీత, వాటి సారాంశాలు, తత్వబోధనలు సులభంగా అర్ధమయ్యే రీతిలో వ్రాయబడ్డాయి.. అలాగే వేదకాలం తరువాత వెలువడిన ఇతిహాసాలు, పురాణాలు, వేదాంగాలు, ధర్మశాస్త్రాలు, దర్శనగ్రంధాలు, ఆగంశాస్త్రాలు, తత్వవిషయాలతోపాటు వాటి సంక్షిప్త సారాంశాలు నాలుగవ అధ్యాయంలో ఉన్నాయి.

ఇక అయిదవ అధ్యాయంలోకి వెళితే అందులో సనాతన ధర్మం (హిందూమతం), దీనికి సంబంధించిన వివరాలు, వివిధ శాఖలనుండి ఉద్భవించిన తాత్విక సిద్ధాంతాలు, మొదలైనవి ఉన్నాయి. ఇవేకాక జైన, బౌద్ధ, సిక్కు, పారశీ, మహ్మదీయ, క్రైస్తవ, యూదు మతాల పుట్టుకకు హిందూమతం ఏ విధంగా కారణమయిందీ, వాటి మనుగడలను ఎలా ప్రభావితం చేసిందీ, ఆ మత పెద్దలు క్రమేణా హిందూ మతతత్వ సిద్ధాంతాలను ఎలా ఉపయోగించుకున్నారనే అరుదైన విషయాలను పాఠకులకు వివరించటం జరిగింది.

ఆరవ అధ్యాయం కొన్ని వేల సంవత్సరాలుగా మన పూర్వీకులు అనేక శాస్త్ర - సాంకేతిక కళా, విద్యా రంగాలలో కనుగొన్న విషయాలకు పరిమితమయింది. ఇవేకాక, ఈ పరిశోధనా ఫలితాలను విదేశస్తులు, ముఖ్యంగా పాశ్చాత్యులు గ్రీకులు, రోమన్‌లు, మహ్మదీయులు, చైనీయులు, ఇతరులు ఎలా కాపీ చేసుకున్నదీ, స్వంతం చేసుకున్నదీ, వాటిని మార్చి తమపేరున ఉన్న పరిశోధనా ఫలితాలుగా వెల్లడించుకున్నదీ, ఇతర్రతా విషయాలనుకూడా వివరించటం జరిగింది.

ఏడవ అధ్యాయం మాత్రం కొన్ని సహస్రాబ్దాలుగా మన నావికుల పరదేశ సముద్రయానాలు, విదేశాలకు మన వర్తకులు జరిపిన వ్యాపార రవాణాలులాంటి వాటికి పరిమితమైంది. ఎనిమిదవ అధ్యాయంలో ఋషులు, తత్వజ్ఞానులు, మతపెద్దలు, రాజులు, నావికులు, వర్తకులు, వలస వెళ్ళిన వారు ఇతర దేశాలలో భారత నాగరికత, సంస్కృతి మత వేద, ఇతిహాసాలను వ్యాపింపచేసి, రాజ్యాలు స్థాపించి పరిపాలించిన విషయాలను చర్చించటం జరిగింది. ఈ దేశాలలో ముఖ్యమైన చైనా, ఇండోనేషియా, థాయ్‌లాండ్, మలయా, కొరియా, ఫిలిప్పీన్స్, బర్మా, జపాన్, సింగపూరు, ఇరాన్, మిసొపొటేమియా ఈజిప్ట్, ఇథియోపియా, అరేబియా, సైబేరియా గ్రీస్, రోమ్‌లతో పాటు అమెరికా ఖండ దేశాల గురించి కూడా ఉన్నాయి.

తొమ్మిదవ అధ్యాయం మన దేశస్తులు 1947కు ముందు, ఆ తరువాత జరిపిన అద్భుత ప్రక్రియలలో కొన్ని ముఖ్యంగా "గాంధియన్ పసిఫిసమ్" "ఇంటర్నేషనలిజం", "ఎంటర్‌ప్రెన్యూర్ షిప్" మొదలగు విషయాలు కలిగి ఉంది. చివరిది అయిన పదవ అధ్యాయంలో 1947 తరువాత మన దేశంలో జరిగిన అభివృద్ధి, అసమానతలతో పాటు, వచ్చే 40 సంవత్సరాలలో ఆర్ధిక, దేశభద్రత, విదేశీ వ్యవహారాలలో జరుగవలసిన అభివృద్ధి, ప్రణాళికలు, వ్యూహాల గురించి విపులంగా చర్చించటం జరిగింది. 1757 వరకు కొన్ని వేల సంవత్సరాల తరబడి "సూపర్ పవర్"గా ఉన్న భారతదేశాన్ని అణగ్రదొక్కి, కొంతకాలం బ్రిటన్ అనుభవించిన ప్రపంచాధిపత్యాన్ని, అమెరికా అధిగమించి గత 65 ఏళ్ళుగా కొత్త సూపర్ పవర్ చెలామణి అవుతున్నది. మరో నాలుగుశతాబ్దాలలో అమెరికాను ఇండియా ఎలా అధికమించగలదనే విషయాన్ని విషయం గురించికూడా ఈ రచయిత చర్చించటం జరిగింది.

2009, జూలై 20న పబ్లిష్ అయిన 312 పేజీలున్న ఈ పెద్దసైజు పుస్తకంలో మన నాగరికత, సంస్కృతి, మతాలు, భాషలు ప్రతిబింబించే 80 మంచి క్వాలిటీ కలర్ ఫోటోలు కూడా ఉన్నాయి. ప్రతి భారతీయుడు ఈ అరుదైన గ్రంధాన్ని తప్పక చదివి, తెలియని చాలా విషయాలను తెలుసుకుని, మన పూర్వ చరిత్ర వృత్తాంతాలను ఆకళింపుకోవడం ఎంతైనాఅవసరం..

✡ ✡ ✡

ఈ పుస్తకం కావాలంటే..

Oscar Publications: (alltimebooks.com/shop/index.php?productID=102591);

Muniram Manoharlal publications (mrmlonline.com/si/027933.html)

## రచయిత గురించి:



కృష్ణాజిల్లా గుడ్లవల్లేరులో వల్లూరుపల్లి సూర్యనారాయణ, వెంకటశేషమ్మ దంపతులకి పెద్దకొడుకుగా 1940లో శివాజీ రావుగారు జన్మించారు. రాజేంద్రనగర్ లోని అగ్రికల్చరల్ కాలేజీ ఇంకా ఉస్మానియా యూనివర్సిటీ పరిపాలనా పరిధిలోనే ఉన్న రోజుల్లోనే అక్కడ ఎం.ఎస్.సి(అగ్రికల్చర్)లో యూనివర్సిటీ టాపర్గా పట్టాపుచ్చుకున్నారు. ఏడెనిమిదేళ్ళపాటు ఇండియాలోనే వివిధ పరిశోధనా సంస్థల్లో పనిచేశాక 1969లో న్యూయార్క్ స్టేట్ లోని కార్నెల్ విశ్వవిద్యాలయంలో అగ్రోనమీ విభాగంలో వీడ్ సైన్స్ ప్రధానాంశంగా శాస్త్రపరిశోధనకి శ్రీకారం చుట్టారు. నాలుగేళ్ళలో డాక్టరేట్ పట్టా తీసుకున్నాక రెండేళ్ళపాటు అమెరికాలోనే పనిచేసి 1975 లో ఇండియాకి తిరిగి వెళ్ళారు. అస్సాం, మద్రాసుల్లో కొంతకాలం పనిచేశారు. ఐతే తన శాస్త్రవిజ్ఞానం వ్యవసాయదారులకి సూటిగా చేరే మార్గం ఏమిటా అని ఎప్పుడూ ఆలోచిస్తూ ఉండేవారు. తన ఆశయాలని నిజం చేసుకోడానికి గాను ఆంధ్రప్రదేశ్‌కి తిరిగివచ్చి వ్యవసాయరంగంలో కలుపుమొక్కల గురించిన ప్రొఫెషనల్ కన్సల్టెన్సీ సంస్థని మొదలుపెట్టారు. దాని ద్వారా అనేక జాతీయ అంతర్జాతీయ పెస్టిసైడ్స్‌కంపెనీలకి తన సలహాలనందించి అనేక విలువైన కీటక సంహారక మందుల తయారీలో కీలకపాత్ర వహించారు. వరి పండించడంలో శివాజీరావు గారు ప్రవేశపెట్టి ప్రాచుర్యంలోకి తెచ్చిన హెర్బిసైడ్ టెక్నాలజీ వల్ల అనేక మంది రైతులకి ప్రత్యక్ష సేవలందించారు. తద్వారా వరి దిగుబడిని పెంచడంలో రైతులకు ఎంతో సహాయం చేశారు. 1995 లో తిరిగి అమెరికా వచ్చి, ప్రస్తుతం కాలిఫోర్నియా రాష్ట్రప్రభుత్వానికి ప్రత్యేక ప్రోజెక్టులకి సలహాదారుగా వుంటున్నారు.

ఇంతేకాక వీరు వ్రాసిన పుస్తకాలు ఇండియాలోని అన్ని వ్యవసాయ కళాశాలల్లోనూ పాఠ్యగ్రంథాలుగా నియమించబడ్డాయి. అంతర్జాతీయంగా గుర్తింపుపొందిన పుస్తకాలని కూడా వ్రాశారు. తన రంగంలోని ప్రొఫెషనల్ జర్నల్స్‌కి సంపాదకుడిగా కూడా చాలా కాలం పనిచేశారు.

డా. శివాజీ రావు గారి జీవన చిత్రణలో ఇదంతా ఒక ఎత్తు ఐతే ఆయనకి చిన్నప్పటినుంచీ చరిత్ర మీద ముఖ్యంగా భారతదేశ చరిత్రమీద గల ప్రత్యేకమైన అభిమానం మరొక ఎత్తు. తనలో చిరకాలంగా సాగుతున్న అంతర్మథనకి ఒక రూపం తీసుకురావాలని 2005 లో ఈ బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కేవలం రెండువేల సంవత్సరాల గత చరిత్ర కలిగిన యూరోపియన్లూ, నాలుగు వందల సంవత్సరాల చరిత్రకలిగిన అమెరికన్లూ తమ చారిత్రక వైభవాన్ని ఎంతో గర్వంగా చాటి చెప్పుకుంటున్నారు. నిజమైన ఘనకీర్తి కలిగిన వేల సంవత్సరాల చరిత్రకలిగిన భారతదేశ చరిత్ర గురించి చెప్పుకోడానికి మనమెందుకు సిగ్గుపడుతుంటాం? అని ఆలోచిస్తూ పుస్తకాలు చదువుతున్నప్పుడు శివాజీగారికి ఇద్దరు విదేశీ ప్రముఖులు భారతదేశం గురించి వ్రాసిన వ్యాఖ్యలు కనిపించాయి.

koumudi

Mark Twain, the American novelist and writer, said, “India is the cradle of the human race, birthplace of human speech, mother of history, grandmother of legend, and great grandmother of tradition; and our most valuable and most instructive materials in the history of man are treasured up in India only.”

Romain Rolland, the French writer and Nobel laureate, observed that “If there is one place on the face of the earth where all dreams of living men have found home from the very earliest days when man began the dream of existence, it is India.”

అక్కడ మొదలుపెట్టి అనేక దేశ, విదేశ గ్రంధాలని పరిశోధించి THE GLOBAL INDIA పుస్తకాన్ని మూడు సంవత్సరాల్లో పూర్తి చేశారు.

ఈ ప్రయత్నంలో తాను మొదటి మెట్టుమీదే ఉన్నాననీ ఇంకా ఇలాంటి పుస్తకాలు మరికొన్ని వ్రాయాలని ఉందనీ చెబుతూ ఇలా అన్నారు డా.శివాజీ రావు గారు..

”ప్రతి భారతీయుడు తనదేశ గత వైభవాన్ని తెలుసుకుని గర్వపడాలి. తన దేశం వేల సంవత్సరాల క్రిందటే ప్రపంచవ్యాప్తంగా విజ్ఞాన శాస్త్ర రంగంలోనూ, కళారంగంలోనూ, ఆధ్యాత్మిక రంగంలోనూ..అన్ని రంగాల్లోనూ ప్రపంచాన్ని ప్రభావితం చేసే చరిత్రని సృష్టించిన సంగతి మరచిపోకూడదు. మన దేశలో రూపుదిద్దుకున్న సనాతన ధర్మం ప్రపంచ మతాలకి కన్నతల్లి అనడంలోనూ, మన సంస్కృతం ప్రపంచభాషలకి మూలం అనడంలోనూ అతిశయోక్తి లేదు. ఆ రోజుల్లోనే మనవాళ్ళు ఓడలు నిర్మించారు, సముద్రాలని దాటారు. వర్తక వ్యపారాల్లో తమదైన ఆధిక్యతని నిరూపించుకుంటూ ప్రపంచవ్యాప్తంగా పర్యటిస్తూ సామ్రాజ్యాలని నెలకొల్పారు. భూగోళంలో భారతీయులు తమ విజయపతాక ఎగరెయ్యని ప్రదేశం లేదు. మన దేశ గతవైభవం గురించి విదేశీయుల ముందు మాట్లాడ్డానికి మనం ఏమాత్రం, తొట్రుపాటు పడాల్సిన అవసరం లేదు. ఈ నాటి యువతరానికి మన దేశ గత చరిత్రగురించి వివరంగా వాస్తవాలని చెప్పాలి. ప్రపంచ ఆర్థిక శాస్త్రవేత్తలు 21వ శతాబ్దం చైనా, ఇండియాలదే నని ఇప్పటికే ప్రకటించిన విషయం మరచిపోకూడదు.

ఈ పుస్తకాన్ని అందరూ చదవాలని కోరడం కేవలం నేను వ్రాశానని కాదు, అనేక విలువైన యదార్థాల సంకలనం ఒక్కచోట లభించే అరుదైన గ్రంథం ఇది. ఇందులో తికమకపెట్టే అంశాలేమీ లేవు. కఠినతరమైన వాక్యాలేమీ ఉండవు. అందరికీ అందుబాటులో ఉండే భాషకి పెద్దపీటవెయ్యాలనేది ఈ పుస్తక రచనకి పూనుకున్నప్పుడు నేను తీసుకున్న నిర్ణయాల్లో మొదటిది.

మీ విలువైన అభిప్రాయాలని తెలియచేయండి. మన చరిత్రని పదిమందికీ తెలియచేయండి. గత వైభవం పునాదుల మీద భవిష్యత్ రూపకల్పనలో మీవంతు పాత్ర పోషించండి....!”

koumudi

## దాశరథి దృక్పథం - ఒక సమాలోచన - గొల్లపూడి మారుతీరావు.

*( ఇటీవల జరిగిన తానా సభల్లో చదివిన ప్రసంగపాఠం )*



నా పదిహేడవ ఏట మొదటిసారిగా దాశరథిగారిని ఆంధ్రావిశ్వవిద్యాలయంలో చూశాను. ఆయన కవిత విన్నాను. ఆయనకి అప్పుడు ముప్పై ఏళ్ళు. మరో మూడు దశాబ్దాల పాటు ఆయనతో - ఆయన పని చేసిన అన్ని రంగాలలో సాహచర్యం సాధ్యమయింది. ఆయన్ని తలచుకుంటేనే హృదయం ఆనందంతో, ఆత్మీయతతో ఆర్ద్రమవుతుంది. అది ఆయన వ్యక్తిత్వం. ఆయన కవిత్వాన్ని తలుచుకుంటే హృదయం ఆవేశంతో, ఆనందంతో, దేశభక్తితో, స్వాతంత్ర్య స్ఫూర్తితో ఉర్రూతలూగుతుంది. అది ఆయన సాహితీ వ్యక్తిత్వం.

జీవితాంతం నన్ను సాదరంగా తమ్ముడూ, అబ్బాయ్ అని పిలిచిన సౌజన్య మూర్తి. జీవితాంతం తను నమ్మిన నిజాలకు పోరాటం ఆపని యోధుడు. తనని తాను రక్షించుకోవడం తెలీని అమాయకుడు. జీవితం చక్కపెట్టుకోవడం తెలీని నిజాయితీపరుడు. బొత్తిగా లౌక్యం తెలీని మనిషి. జీవితంలో తారసపడిన మనుషుల్ని నిండైన మనస్సుతో ఆహ్వానించి, వారి అండన నిలిచిన అద్భుతమైన స్నేహితుడు. అన్న. ఆప్తుడు.

ఈ వాక్యాలు మరే కవికీ నేను వ్రాయను. కవుల వ్యక్తిత్వ పట్టకంలో చూస్తే - ఏ కవికీ ఇన్ని అందమయిన రంగుల పొందిక కుదరదు. కారణం-ఆయన నమ్మింది రాశాడు. నమ్మి రాశాడు. నమ్మించడానికి రాయలేదు. నమ్మకంతో రాశాడు. ఈ మాటలు 'ఇజాలు' భుజాల కెత్తుకున్న చాలామంది మహాకవులు విషయంలో నిర్భయంగా నేనన‌ను. ఇది స్వానుభవంతో చెపుతున్న మాటలు.

ఈ వ్యాసం ఓ మహాకవికి నేను సమర్పించే నివాళి కాదు. ఇచ్చే కితాబు కాదు. అది ఆయనకి అవసరంలేదు. గత 56 సంవత్సరాలలో నన్ను బాగా ఆకర్షించిన మూడు గేయాలను అప్పుడప్పుడు నా డైరీల్లో రాసుకున్నాను. వాటిలో ఇద్దరు కవులెవరో అప్పుడు తెలీదు. ఇప్పుడూ తెలీదు. ఒకాయన తెలుసు. ఆయన కవిత తెలుసు. ఆయన దాశరథి. ఆ గేయం ఇది:

కొత్తపాట పేరుతో చెత్త పాట పాడకు
కొత్తదనం పేరుతో రిత్తదనం పెంచకు
గుడ్డ విడిచి నడ్డి విరిచి
రోడ్డు మీద నడవకు
ఇజాలతో భుజం కలిపి

నిజం దాచ చూడకు

హింస నుంచి సమ సమాజ

హంస ఉద్భవించుననే

అసత్యాన్ని నమ్మకు

హంతకుడవు కాబోకు

దురదృష్టం ఏమిటంటే దాశరథిగారు బతికున్న కాలంలో ఈ గేయం నా చేతికి రాలేదు. మేమిద్దరం రేడియోలో, సినీమాల్లో కలిసి పనిచేశాం. మిత్రులుగా కలిసి తిరిగాం. సభల్లో పాల్గొన్నాం. కానీ ఈ గేయాన్ని నేనప్పుడు చదవలేదు. చదివితే ఆయన దగ్గర కూర్చుని 'గుడ్డ విడిచి, నడ్డివిరిచి రోడ్డు మీద నడిచిన' కవులెవరు అన్నగారూ అని అడిగేవాడిని. బహుశా గుడ్డవిడిచిన కవులుగా దిగంబర కవులు, కవిత్వానికి నడ్డివిరిచానని చెప్పుకున్న కవిగా శ్రీ శ్రీ ఆయనమనస్సులో ఉండి ఉంటారని మనం భావించాలి. వారంతా ఇక 'ఇజా'నికి కట్టుబడ్డ కవులు కనుక, దాశరధిగారు 'ఇజం' మీదే ధ్వజం ఎత్తారు కనుక.

ఈ కోణంలో ఈ ఆలోచనకు case study యే ఈ ప్రసంగం.

'Ism' అంటే ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ ఏం చెపుతోందంటే used to refer to a set of ideas or systems of beliefs or behaviours అంటూ బ్రాకెట్లో usually disapproving అని పేర్కొంది. ఇంకా disapproving అన్న మాటని మనం సీరియస్‌గా తీసుకోమేమోనని నిఘంటుకారుడు భయపడి ఆ మాటని ఇటాలిక్స్‌లో వేశాడు. సాధారణంగా మనం అంగీకరించని, అంగీకరించలేని కొన్ని ఆలోచనలు - ఆ ఆలోచనలకు కట్టుబడి ఉండే ఏ ప్రక్రియ అయినా 'యిజం' కిందకి వస్తుంది.

అంటే - రచన ప్రారంభించేటప్పటికే రచయిత ఆయా నమ్మకాల మీద తనదయిన విముఖతని ఏర్పరచుకుని - ఆ దృష్టితోనే సమస్యల్నీ, జీవితాన్నీ, జీవనాన్నీ, ఆలోచనల్నీ, ఆవేశాన్నీ - నిర్దేశించడాన్ని ఈ 'యిజం'కు కట్టుబడి ఉండడం అన్నమాట. ఇక్కడో వివరణ. కొన్ని సిద్ధాంతాలను విశ్లేషించి - ఆ నిర్ణయాలకో, ఆ అభిప్రాయాలకో చేరడం 'యిజం' కాదు. ఆ అభిప్రాయాల నుంచి ప్రయాణాన్ని ప్రారంభించడం యిజం. ఆ నిజాల మీద నమ్మకంలేని లేదా మరో నిర్దిష్టమయిన సిద్ధాంతాల మీదే నమ్మకం ఉన్న రచయిత ఆ దృష్టితోనే రచనని సాగించడం. It is like wearing a coloured glass even before you judge the colour of – say – a flower. .

నిష్పాక్షికమైన దృక్పథమో, అభిప్రాయమో ఏర్పడడానికి ముందు మన మనస్సులో ఏర్పరచుకున్న pre-conceived notion ని పక్కన పెట్టాలన్నది దాశరధి ఉద్దేశం.

ఎందుకంటే an "ism' pre-supposes the end even before it addresses itself to the problem.

ఇజానికి కట్టుబడ్డ రచయిత మొదటి పోరాటం తను చెప్పే నిజం మీద కాదు. తను నమ్మే యిజం కోసం. తను ఎంచుకున్న మార్గాన్ని అంగీకరించేటట్టు చేయడం కోసం. సమాజంలో జరిగే అన్యాయం దృష్ట్యా ఈ దృక్పథం అవసరమనే తన ఆలోచనకి పాఠకుడి సమ్మతిని కోరుతున్నాడు. He is advocating for the process and not as much for the goal.

అయితే - అన్యాయానికో, అనర్ధానికో, అక్రమానికో, పీడనకో, దురదృష్టానికో, నిస్సహాతకో రూపు దిద్దే కవి సిద్ధాంతానికి కట్టుబడనక్కరలేదు. ఆ నిజానికి బద్ధుడయితే చాలు.

ఇక్కడ ఇద్దరు కవులని సాక్ష్యం తెచ్చుకోవాలని ఉంది.

"తాజ్ మహల్ నిర్మాణానికి రాళ్ళెత్తిన కూలీలెవ్వరు?" అన్నారు నూరేళ్ళ కిందట పుట్టిన ఓ కవి - శ్రీ శ్రీ ఈ గేయాన్ని ఎంత మంది వల్లించారో చెప్పలేం. ఈయన 'ఇజం' కవి.

"ఒక్కొక్క రాతిలో నిమిడియున్నవి షాజహాను భూభుక్కు నెడందలో నుడికిపోయిన రక్తపుంజుక్కలలోని చక్కదనమ్ము" అన్నారో కవి. ఆయన జాషువా.

ఇద్దరిదీ దృష్టి బేధం. ఒకాయన ప్రపంచ అద్భుతాలలో ఒకటయిన కట్టడం వెనక శ్రమని చూశాడు. మరొకాయన కట్టిన వ్యక్తి అభిరుచిని చూశాడు. ఒకాయన చూసే ముందే తన దృష్టిని నిర్దేశించుకున్నాడు. మరొకాయన కనిపించింది కనిపించినట్టూ చూశాడు. ఒకటి యిజం. రెండవది కేవలం నిజం.

అలాగని జాషువాకి అన్యాయానికి స్పందించే దృష్టి లేదని కాదు.

కొడవటి టెక్కమున్ తలను గూరిచి కార్మిక కర్షకాళితో

నడుము బిగించె ఈ యుగమునందొక నూతన సామ్యవాద మ

న్గడిబిడి, దాని దెబ్బకు వికావికలైనది స్వార్థ జర్మనీ

జడనిధి, నేటి మార్పు లసంఖ్యము లంచితముల్ విచిత్రముల్.

కవి తన కాన్వాస్‌నీ, పరిధినీ కుంచించుకోకుండా ఉన్నా ఇజాలలో ఉన్న నిజాలను చెప్పగలడు.

ఊర్వశినీ, ప్రేయసినీ ఆరాధించి - ఏడుపుకి అందమయిన ఊడుపులు దొడిగిన నవ్యసాహితీ పరిషత్తు కవి దేవులపల్లి కృష్ణశాస్త్రి:

"ఆమె కన్నులలోన అనంతాంబరపు నీలి నీడలు కలవు" అని మురిశాడు. కాని ఒక చోట:

"పనిచేస్తే పది పైసలొస్తాయ్

పగలంతా సూరీడు మేస్త్రీ

రేతిరి సెందరవంక జోస్తీ" అన్నాడు.

కవిత్వం నినాదం కాదు, పాంప్లెట్ కాదు, శాసనం కాదు, శాసించే సాధనం కాదు. హృదయాన్ని మేల్కొలిపి ఆలోచనని అలంకరించే మేస్త్రి.

'ఇజం' అనే కళ్ళద్దాలు అక్కరలేదన్న దాశరథిగారి మాటకి బలం చేకూర్చడానికి నేను మొహమాటంగా చెప్తున్నాను. కాని ఆయన తన గేయంలో ఇంతకంటె గట్టిగానే చెప్పాడు.

దాశరథి నన్ను తన పరిధిలోకి లాక్కున్న పాట:

మాట్లాడని మల్లెమొగ్గ మాదిరిగా నడిచిరా

నిశ్శబ్దం ఎరుగనట్టి నిమ్నగ వలె విడిచిపో

చేదగు కన్నీటి బొట్టు చిందిన చప్పుడులు విను

వాదింపగరాని మనసు పరివాదిని లోతుగను

సుతారమైన ఆలోచనకీ, muse కీ తెరలేపిన ఈ కవే

నా గీతావళి ఎంత దూరము ప్రయాణంబౌనొ, అందాక ఈ

భూలోకమ్మున కగ్గిపెట్టెదను...

అని హెచ్చరించాడు. ఎందుకని? ఆయనే సమాధానం చెప్పాడు. ఎంత గొప్పగా, ఎంత స్పష్టంగా, కమిటెడ్ కవుల కే మాత్రం తీసిపోనంత ఆవేశంతో -

ఈ కొరగాని లోకమున కిప్పుడె నిప్పురగిల్చి కాల్చి, నా

లో కదలాడు నూహలకు రూప మొసంగి పునస్సృజింతు; న



koumudi

ఝ్హాకట గుండు పేదలకు బ్రహ్మ లిఖించిన కొంటె వ్రాతలో

వ్యాకరణమ్ము లేదు...

కవికి అఝ్హాకటి గొన్న పేదల దుస్థితి మీద బాధ, అందుకు కారణమైన వారి మీద కోపం మాత్రమే కాదు. దహించిన ఈ లోకం మీద ప్రేమ ఉంది. కవి వినాశకుడుకాదు. పునఃసృష్టి చేసే బ్రహ్మ. ఈ కోపంలో పెద్దరికం ఉంది. ప్రేమించే ప్రపంచం ఉంది. న్యాయం జరగని ఆర్తుల పట్ల స్పందన ఉంది. అన్నిటికన్న ముఖ్యం - కవిత్వం ఉంది.

ఈ కవి దగ్గర నెత్తుటి వరదలు, విప్లవ శంఖాలు, గర్జనలు లేవు. నాశనం చేయాలనే దుందుడుకు ఆవేశం లేదు. ఆయన దృష్టిలో-

ఏనాడెవ్వడు కత్తితో గెలువలేదీ విశ్వమున్, ప్రేమ పా

శానన్ కట్టుము నాలుగుంబది ప్రపంచాలన్...

అంటాడు. కవిత్వం ఆవేశాన్ని పుక్కిలిస్తుంది. ఆలోచనని సునిశితం చేస్తుంది. 'ఆహా!' అనిపిస్తుంది. 'అబ్బా!' అనిపిస్తుంది. కాని నిర్దేశించే ఆవేశం 'ఇజం'ది. నిజానికి శ్రమజీవుల పాటకూడా శ్రమకి ఊతమే. కవి కామన ఉదాత్తం కావాలి. కూలిపోతున్న ప్రపంచం మీద కూడా అతనికి ప్రేమ ఉండాలి. అది తల్లి బిడ్డని చేసే మందిలింపు కావాలి. పక్కింటి వాడు ఎత్తే పదునైన కత్తి కాకూడదు.

దాశరథి భయపెట్టడు. బాధపడతాడు. బాధపెట్టడు. తన బాధని వ్యక్తం చేస్తాడు. ఆయన కత్తి పట్టుకున్న హంతకుడు కాడు. కత్తి పట్టుకుని అక్కరలేని భాగాలను ఉత్తరించే చికిత్సాపరుడు.

1950 ప్రాంతాల్లో ఇలా గర్జించాడు:

ఎవరు కాకతి?

ఎవరు రుద్రమ?

ఎవరు రాయలు?

ఎవరు సింగన?

అన్ని నేనే

అంత నేనే

తెలుగు నేనే

వెలుగు నేనే

ఈయనే అతి నేలబారు మనిషిని ఆనందపరిచే మాధ్యమంలోనూ - సినిమాల్లో - తన కవితా హృదయానికి విడాకులివ్వలేదు.

నీవు రావు నిదుర రాదు

నిలిచిపోయె ఈ రేయి -

కౌగిలిలో ఒదిగిపోయి

కలలు కనే వేళాయె

ఎదురు చూచి ఎదురు చూచి

కన్ను దోయి అలిసిపోయె

నేను నా జీవితంలో ఒకే ఒక్క ఫాన్ మెయిల్ రాశాను - సినీకవికి. ఈ గీతం విన్నాక ఇంటికి వచ్చి దాశరథికి. నేనూ ఆ సినిమాలో పనిచేశాను.

koumudi

ఇజాలతో ముడిపడి రాముడినీ. కృష్ణుడినీ, విష్ణువు దశావతారాలనీ ఆకాశానికెత్తిన కవులున్నారు. ఒకటి వృత్తి, మరొకటి వ్యావృత్తి అని సర్ది చెప్పుకున్న అభిమానులూ ఉన్నారు.

పరిధిని విస్తృతంగానే ఉంచుకుంటూ, తన ధోరణికి ఏ 'లేబుల్'నీ అంటించుకోకుండా - అధర్మానికి స్పందిస్తూ సౌందర్యాన్ని ఆస్వాదిస్తూ - కవిత్వాన్ని objective గా నిలుపుకున్న కవులు బోలెడు మంది.

ఆకాశం రమ్మంటోంది చెట్ల సందుల్లోంచి
ఇళ్ళ కప్పుల మీదనుంచి
కొండ శిఖరాలెక్కి మేఘాల గుంపుల్లోంచి
పక్షిలేని తోటనుంచి పొమ్మంటోంది
ఒక చంద్రున్నిస్తా
నీ ఆత్మ చప్పరించడానికి
రమ్మంటోంది

ఈయన కేవలం కలలు కనే మిస్టిక్ కాడు. నేల విడిచి సాము చేసే గుడ్డివాడు కాదు. అన్యాయాన్ని, విప్లవ కారుల సాహసాల్నీ వెనకేసుకొచ్చిన ధైర్యశాలి...

చెట్లకు వ్రేలాడిన శిరసులు పూస్తున్నయ్
కొమ్మల్లో పూలై
గోలీ దూరిన గుండెలు కదులుతున్నాయ్
ఈ దేశపు ప్రాచీరేఖ మీద
సూర్యుడు ఉదయించకపోతే
మండే నా గుండె చీల్చి
దాని మీద పెడతా
ఎర్రటి నా కండలతో
ఎండలు కాయిస్తా

అని మధనపడ్డాడు కవి. ఆయన గుంటూరు శేషేంద్ర శర్మ

నా అక్షరాలు కన్నీటి జడులలో దయాపారావతాలు
నా అక్షరాలు ప్రజాశక్తులావహించే విజయ ఐరావతాలు
నా అక్షరాలు వెన్నెలలో ఆడుకునే అందమైన ఆడపిల్లలు

అంటూ ఆర్ద్రతకీ, సుతారమైన ఆలోచనకీ పట్టం కట్టిన ఓ కవి-

కూడు లేని లోకం యిది
గుండె లోతు తాపం యిది
సోమయాజి శాపం యిది
భూమి అడుగు లోకం యిది

అని వాపోయాడు. ఆ కవి పేరు బాలగంగాధర్ తిలక్.

koumudi

వ్యవస్థ మీద తిరగబడి నిజామాబాద్ కోటలో ఇందూర్ ఖిల్లాలో తెలంగాణా విమోచన పోరాటానికి 1946 - 48 మధ్య జైల్లో ఉన్నాడు దాశరథి.

గొంతుకలెండి, డొక్కలకు కొంచెము గంజియు లేకపోయినన్
పంతము నెగ్గగావలెను, ప్రాణము పోయిన గూడ సమ్మెగా
వింతు మటంచు ఆకట తపించెడు పేదల గూర్చి నేను మ్రో
గింతును రుద్రవీణ...

అన్నాడు.

అయితే కవి తన సుతారమైన స్వప్నాన్ని తాకట్టు పెట్టలేదు

వలపునై నీ హృదయ సీమల నిలువ వలెనని యున్నది
పిలుపునై నీ అధర వీధుల పలుక వలెనని యున్నది

అంటాడు. Dasaradhi is a complete poet.

1960 ప్రాంతంలో మిసిసిపీ విశ్వవిద్యాలయంలోని తొలి నీగ్రో పట్టభద్రుడు జేమ్స్ మెరిడెత్‌ని ఉద్దేశించి చెప్పిన మాటలు:

మిత్తిని మొత్తి, గుండియల మెత్తని పువ్వుల గుత్తులెత్తి, గ
మ్మత్తొనరించినట్టి నవమానవుడా! నినుగెల్చువాడు లే
డిత్తరి నీకు నీవె భళిరే సరివాడవు, నీ మనస్సులో
ఎత్తిన పూల దీపముల నెవ్వడు నార్పగలేడు సోదరా

అభ్యుదయాన్ని నిండైన మనస్సుతో ఆహ్వానించిన కవి దాశరథి.

దాశరథి కవితా వైభవాన్ని ఎత్తిచూపడం, విశ్లేషించడం నా ఉద్దేశం కాదు. ఆయన కవితలో విస్తృతమైన కాన్వాస్, దృక్పథంలో ఏ ఒక్క ఆలోచనకూ తనని తాను పరిమితం చేసుకోని విశాలత్వం - వెరసి - ఒక రేంజ్‌ని సాధించిన దాశరథి, ఆయనవంటి మరికొందరు కవుల గొంతుల్ని సాక్ష్యం తెచ్చుకోవడమే నా ఉద్దేశం.

ఆయన చల్లని స్నేహ హస్తాన్ని అందుకున్నవారికి ఆయన వ్యక్తిత్వంలోనూ ఇంతటి విశాలత్వమూ కనిపిస్తుంది. ఆయనప్పుడు మద్రాసు రేడియోలో పనిచేసేవారు. నేను విజయవాడలో పనిచేసేవాడిని. నేనెప్పుడు మద్రాసు వచ్చినా నన్ను తీసుకెళ్ళి నా చేత రచనలు చదివించేవారు. ఒక్కసారి ముందుగా మీరు చదవండి అంటే కోపం తెచ్చుకుని 'నేను నీ రచనలు చదవడం ఏమిటబ్బాయ్! నాకు నువ్వేం రాసినా బాగుంటుంది' అన్న సహృదయుడు.

మనిషి ఆవేశి. ఒక నిజాన్ని నమ్మడం, కవితను మనసారా చిమ్మడం తప్ప కవితను అమ్మడం తెలీని మనిషి. కనుక డబ్బునీ, బిరుదుల్నీ ఎక్కువ కూడగట్టుకోలేకపోయాడు. అవి ఆయన మనస్సుదాకా పోని విషయాలు. అయినా ఆంధ్రదేశానికి ఆస్థాన కవి అయాడు. కళాప్రపూర్ణుడయాడు. పద్మశ్రీ అయాడు.

1984 లో అనుకుంటాను - సినీనటుడు కృష్ణంరాజు ఏర్పాటు చేసిన ఏదో పాకేజ్‌లో అమెరికా వెళ్ళారు. ఆ సందర్భంలో నేను మద్రాసు రేడియోలో పనిచేస్తున్నాను. అప్పటికి ఆయన రేడియో ఉద్యోగాన్ని విడిచిపెట్టారు. ఇద్దరం రేడియో స్టేషన్‌కి రికార్డింగుకి వెళుతున్నాం. కారులో నా చెయ్యి మీద చెయ్యి వేసి అన్నారు: "ఆరోగ్యం బాగులేదు మారుతీరావ్! అమెరికా వెళుతున్నానే కాని మనస్సు అటు లేదు." అని కాస్సేపాగి "రేడియో ఉద్యోగం రాజీనామా చెయ్యడంలో నేను తొందరపడ్డాను. నువ్వా పని చెయ్యకు" అని హెచ్చరించారు.

మరి రెండేళ్ళకి - 61 ఏళ్ళ వయసుకే - కళ్ళు మూశారు. ఆయన సోదరులు దాశరథి రంగాచార్యులు అన్నారు: "మృత్యువు సైతం మా అన్నయ్య మందహాసాన్ని ఆర్పలేకపోయింది. ఆయన మృత్యువుని గెలిచిన యోధుడు. తిమిరంతో సమరంలో ఉంటాడు. గాలిబ్ గీతాల్లో ఉంటాడు. మిత్రుల మనసుల్లో ఉంటాడు. "

నిజం. ముమ్మాటికీ నిజం. ఇప్పుడు అమెరికా తెలుగు మిత్రుల సమక్షంలో ఆయన చిరంజీవి. తిమిరంతో సమారాన్ని సాగిస్తూ గాలిబ్ హృదయంలోని రసధునిని వెలికి తీసిన కవే ఇజాలు గురించిన నిజాలు చెప్పగలడు.

మరొక్కసారి -

గుడ్డ విడిచి, నడ్డి విరిచి
రోడ్డు మీద నడవకు
ఇజాలతో భుజం కలిపి నిజం దాచ చూడకు

ఎందుకంటే – An “ism” conditions the outlook of the writer, restricts him to stunted goals, retards his vision, discounts the function of his thoughts and most importantly, undercuts the literary stature of his work.

ఆఖరుగా నాకు చాలా ఇష్టమయిన - కొన్ని దశాబ్దాలు - ఎప్పుడు చదివినా, ఎన్నిసార్లు చదివినా ఆహా అనిపించే కవిత - ఆర్చిబాల్డ్ మెక్‌లీష్‌ది. అందులోంచి రెండు మూడు పంక్తులు -

A poem should be palpable and mute
As a globed fruit
A poem should be motionless in time
A poem should be equal to
not true
A poem should not mean
But be.

అయితే ఆధునిక కవులు - చాలా మంది - ఆర్చిబాల్డ్ మెక్‌లీష్‌నీ, దాశరథినీ క్షమిస్తారనుకుంటాను.

✡ ✡ ✡



koumudi


అద్దేపల్లి

తిలక్ అమృతం కురిసిన రాత్రి

# ఒక పునర్మూల్యాంకనం

- అద్దేపల్లి రామమోహనరావు




సాధన సాహితీ స్రవంతి, హైదరాబాద్ వారు జనవరి 2008లో ప్రచురించిన తిలక్ సాహితీ సమాలోచనమ్ విశేష సంచికనుంచీ పునర్ముద్రితం. తిలక్ గారి కుమారుడు డా.సత్యనారాయణ మూర్తి(యు.కె) గారి ప్రత్యేక అనుమతితో..

కవిత్వాన్ని విలువ కట్టేటప్పుడు, ఎప్పుడు మూడు అంశాల్ని తప్పనిసరిగా గుర్తుంచుకోవాలి.

1.శాశ్వతమైన విలువ 2.దీర్ఘకాలికమ్మైన విలువ 3.సమకాలీనమ్మైన విలువ

koumudi

**1.శాశ్వతమైన విలువ:**

కవిత్వంలో కొన్ని శాశ్వతమైన విలువలు తప్పనిసరిగా ఉంటాయి. ఎందుకంటే, ఏ కాలపు మానవుడిలో నైనా మౌలికమైన ఉద్రేకాలు గాని, వాటి ఆవిష్కరణలుగాని, మానవత్వపు విలువలుగాని, అలాగే సౌందర్యాన్ని గూర్చిన, ప్రకృతిని గూర్చిన అనుభూతులుగాని, అనుబంధాల తీవ్రతలుగాని - ఇలాటి ఎన్నో అంశాలకు సార్వకాలికత ఉంది. అందుకే ఎంతోకాలం కిందటి రచనల్నిగాని, వేరే భాషల్లో వేరే సంస్కృతుల్లోంచి వచ్చిన కావ్యాలని గాని, చదివి స్పందించడం సాధారణమౌతోంది. వీటిలో ఆయా కవుల కాలంలో ఉన్న అనుభవాలకి సంబంధించిన ప్రత్యేకతలుగాని, భాషా విషయకమైన, అభివ్యక్తి విషయకమైన విశేషాలుగాని ఉండవచ్చు. కాని, రాయడంలో ఉన్న ప్రతిభగాని, అనుభవాలు అందజెయ్యడంలోని విధానాలుగాని, తల్లకిందులుగా మారిపోవడమనే స్థితి ఎప్పుడూ ఉండదు. గతమే వర్తమానాన్నీ, వర్తమానమే భవిష్యత్తునీ రూపొందించే క్రమం ఉన్నంతవరకూ ఈ శాశ్వత విలువల స్థానం స్థిరంగా ఉంటుంది.

**2. దీర్ఘకాలికమైన విలువ:**

కవిత్వంలోని వస్తుశిల్పాల్లో కొన్ని విలువలు చాలాకాలం వరకు స్థిరంగా ఉండి, తర్వాత మొదటి అనుభూతిని కలిగించలేక మాసిపోయేవి ఉంటాయి. భాషలో ఒక్కొక్కప్పుడు సంస్కృతపద బాహుళ్యం, సమాస నిర్మాణం అభ్యంతరం లేకుండా కొనసాగుతాయి. తెలుగు పలుకుబడికే ప్రాధాన్యం వచ్చినప్పుడు అవి వింతగా కనిపించి, అనుభూతిలోకి ఇంకకుండా పోతాయి. అనుప్రాసాదులూ ఇలాంటివే. శిల్పంలో కూడా అనేక విధాల మార్పులు వస్తాయి. అందువల్ల శాశ్వత విలువలు, అలా ఉండగా, దీర్ఘకాలిక విలువల్ని కూడా కేటాయింపుగా చూడవలసిన అవసరం ఉంది. పైగా, ప్రక్రియల్ని బట్టి శిల్పాలు కూడా మారిపోతూ ఉంటాయి. కాలానికి సంబంధించిన సంవేదనల్లో మార్పు వస్తూ ఉంటుంది. దానికి కారణం భావకులూ, విమర్శకులూ వ్యాప్తి చేసే భావధారలే.

**3. సమకాలీనమైన విలువ:**

సామాజిక నిర్మాణమూ, సిద్ధాంతాలూ, లక్ష్యాలూ, ఉద్యమాలూ మారిపోతున్నప్పుడు, ఒక కాలపు కవిత్వం, ఇంకోనాటి భావాలతో కూడా అంచనా వెయ్యాల్సి ఉంటుంది. దీన్నే ఇప్పుడు 'పునర్మూల్యాంకనం' అంటున్నారు. దీనిలో మళ్ళీ రెండు విధాలున్నాయి.

(1) ఈ కాలంలో కొన్ని భావాలు మారినై కాబట్టి మరోకాలపు రచయితని పూర్తిగా తీసెయ్యమనేది ఒకవాదం. ఇది 'అతిశయ పునర్మూల్యాంకనం'

*'మోడరన్‌గా ఉందామనీ, ఏదో అందామనీ*
*తనకే తెలియని అస్పష్టపు అనుభూతిని*
*అర్థంలేని ఇమేజరీతో, కలగాపులగపు వర్ణనలతో*
*డిలాన్ థామస్‌కు, చేతగాని అనుకరణలతో*
*ఒక దేశం, నిర్దేశం లేని వాక్యాల వికారంతో*
*ఎందుకు బాధిస్తావు నన్ను, బాధపడతావు నువ్వు!*
*ఈ కషాయం వికటిస్తుంది*
*ఈ వ్యవసాయం వెర్రితలలు వేస్తుంది'*

ఈనాడు, తెలుగు కవిత్వంలో ప్రజానేపథ్యం సుస్థిరం కాబట్టి, పైమాటలనడం సులభమే. కాని అరవైలలో అనడానికి చాలా కొత్త దృక్పథం ఉండాలి; సాహసం కావాలి.

koumudi

'జరామయం' కాదనడంలో, నలిగి నలిగి ముసలివైపోయిన లక్షణాల్ని వదిలిపెట్టి, తన కవిత్వాన్ని కొత్త దోవలో నడిపిస్తాననే సూచన ఉంది. తన కవిత్వం'కాదొక తత్వం' అన్నాడు. అంటే, ఏ 'ఇజమ్'నీ ఆయన నేపథ్యంగా చెప్పే అవకాశం లేదు. ఇజమ్‌గా చెప్పే అవకాశం లేకపోయినా, భావాల ఆవిష్కరణకు మాత్రం అనేక ఇజాల విభిన్న అంశాల్ని తీసుకున్నాడు. అందుకే 'ప్రజాశక్తుల్ని' గ్రహిస్తానన్నాడు గాని, ఉద్యమాల విషయం చెప్పలేదు. 'దయ'ను గూర్చి చెప్పాడు గాని, 'పోరాటం' గూర్చి చెప్పలేదు. అగాధ బాధల్ని గూర్చీ, ధర్మవీరుల కృతరక్త నాళాల్ని గూర్చి, త్యాగ, ప్రేమ, శాంతి శక్తుల్ని గూర్చి చెప్పాడుగాని, ఇవన్నీ సంఘర్షణ మూలంగా వస్తాయని చెప్పలేదు. కళని 'కరవాలం' గానే చెప్పాడు గానీ, దాని ధగద్ధగమనే శబ్దాల మీద కేంద్రీకరణ పొందాడు. సంఘర్షణని మాత్రమే చెప్పకపోయినా, సమస్యలు, పేదరికం, బాధలు - మొదలైన వాటికి, వాటికవిగా బలంగా చెప్పడం కూడా విస్తృత పరిధిలో ప్రగతిశీలమే ఔతాయి. ఆ దృష్టితోనే తిలక్‌ని చూడాలి. వాటి అభివ్యక్తిలోనూ తిలక్‌ది ప్రత్యేకమైన మార్గమే. అది తర్వాత వివరింపబడుతుంది. ఈ మార్గానికి కారణం, ఆయన ఏకాంత జీవితమూ, రుజాగ్రస్తవేదనామయత్వమూ, ప్రధాన కారణాలు కావచ్చు.

సౌందర్యమూ, అనుభూతీ ఆయనకి నిరంతర చైతన్యంలో కలిసిపోయిన భావనలు. అందుకే...

*'అగ్ని జల్లినా, అమృతం కురిసినా*
*అందం, ఆనందం దాని పరమావధి'*

అని చెప్పిన మాటల్ని జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి. ఒక సిద్ధాంతానికి సంబంధించిన అవగాహనని తీసుకుని, దానికెదురుగా ఈ మాటల్ని పెట్టి ఆలోచించవలసిన అవసరంలేదు. ఇది ఒక ఆవిష్కరణకి సంబంధించిన అంశం మాత్రమే. ఆయన మొత్తం కవిత్వపు అభివ్యక్తికి స్ఫోరకంగానే ఈ మాటల్ని వివరించుకోవాలి గాని విడిగా తీసి, సిద్ధాంత నిర్ణయం చెయ్యడం సముచితం కాదు. పైగా 'నవత - కవిత' అనే కవితలో, అనేక వక్ర కవితా ధోరణుల్ని విమర్శిస్తూ, ఈ ముగింపు నిచ్చాడు. ఈ వక్రధోరణి ఖండనలన్నీ ప్రగతివాదులకు

అంగీకారమయ్యేవే. అందువల్ల పై మాటల్లో తన నూతన మార్గమే ఉద్ఘాటింపబడిందనుకోవాలి. ఆ నూతన మార్గం 'అంతరాంతర జ్యోతిస్సీమల' మీద, 'చైతన్య పరిధి' మీద, సామాజిక కవిత్వానికి కూడా అందాన్నీ ఆనందాన్నీ జోడించడం మీద.. ఆధారపడి ఉంది. అంతవరకే పై మాట్ల పొసగుదల ఉంటుంది.

'నా కవిత్వం'లో ఆయన చెప్పిన మాటల్లో కొన్ని లక్షణాలివి.

*'గాజు కెరటాల వెన్నెల సముద్రాలూ*
*జాజిపువ్వుల అత్తరు దీపాలు*
*మంత్రలోకపు మణిస్థంభాలు*
*నా కవితా చందనశాలా*
*సుందర చిత్ర విచిత్రాలు'*

వెన్నల్లో సముద్ర తరంగాలు తెల్లని గాజు కెరటాల్లా ఉంటాయి. ఇది 'దర్శనం'లోని అనుభూతి.

'జాజిపువ్వుల అత్తరు' 'సువాసన'కు సంబంధించిన అనుభూతి. "మంత్రలోకపు మణిస్థంభాలు" మాటల ద్వారా అపూర్వ లోకాల్లోని తీసుకుపోయే అనుభూతి. ఇలాంటి 'పంచేంద్రియ' సంబంధమైన సంవేదనలన్నీ నా కవిత్వంలోని ఏ వస్తువులోనైనా మిళితమై ఉంటాయని తిలక్ అభిప్రాయం. అందుకే ' నాకవిత్వంలో' ముగింపులో కూడా

*'నా అక్షరాలు వెన్నెలలో ఆడుకునే*
*అందమైన ఆడపిల్లలు'*

అనే ఒక అద్భుతమైన భావచిత్రాన్ని మన ముందుంచాడు. కాబట్టి, అక్షరగతంగా, భావగతంగా ఏ అంశాల్ని చెప్పినా, సౌందర్యాన్ని సౌందర్యంగా వర్ణించినా, ప్రజాభావాల్ని చెప్పినా, అవి సౌందర్యంతో మిళితమై ఉంటాయి. అది శైలి కావచ్చు. భావచిత్రాలు కావచ్చు మరొకటేదైనా కావచ్చు.

తన కళ్ళ ముందు అనేకానేక 'సంఘర్షణ' భావధారలున్నప్పుడు వాటిని కూడా ఆయన స్వీకరించి ఉండవచ్చునని అనిపించే అవకాశం ఉంది. ఐతే, 55 దాటిన తర్వాత 'సంఘర్షణ' భావధార ప్రధానంగా భావించబడలేదు. అందువల్ల తిలక్, కుందుర్తి మొదలైన వారిలో వాస్తవిక భావాల ఆవిష్కరణలోని బలాన్ని మాత్రమే చూడవలసి ఉంది. ఈ బలం తిలక్‌లో, ఆయన ప్రత్యేక మార్గంలో, చెప్పుకోతగినంతగా ఉంది.

తిలక్ శైలిలో పదాల కూర్పు ఒక ప్రధానమైన అంశం. అప్పచెప్పే వారికి గాని, పైపైన చదువుకుపోయే వారికి గాని ఇది చాలా ఆకర్షణ కలిగిస్తుంది. ఇదికూడా ఆయన సౌందర్యభావంలో అంతర్భూతమయ్యే విషయమే. ఆయన తన భావాల్నీ, పదాల్నీ, వాక్యాల్నీ అమరించుకునే విధానం విశ్లేషిస్తే, శైలిలోని ప్రత్యేకతని గమనించవచ్చు.

వచన కవిత్వంలో అనేక విధాలైన లయను సాధించడం, తిలక్‌లో మొత్తంగా పరుచుకుని ఉండే ఒక విశిష్టత. రెండుగాని, మూడుగాని అంతకంటె ఎక్కువగాని అంశాల్ని, ఏదో ఒక విధమైన సమానత గలిగిన భావక్రమంతో, పదక్రమంతో, వాక్యక్రమంతో చెప్పడమే 'లయ'. ఏదో ఒక విధమైన లయ ఆనాటి వచన కవుల్లో ఉందిగాని, అన్నిచోట్లా ఆ స్పృహని మరేలాంటి లయని కూడా, వచన కవిత, తన పరిణామంలో పూర్తిగా వదిలేసింది. భావాధారక్రమమే వచన కవితా నిర్మాణమైంది. కాని, తిలక్‌ని, తిలక్‌నాటి వాతావరణంలోనే చూడవలసివుంది. ఒకమాటనీ,ఒక భావచిత్రాన్నీ, ఒక వాక్యాన్నీ తిలక్ ఎక్కడా ఒంటరిగా వదలడు. దానికి సమానతగల అంశాన్ని పక్కనే చెప్పకుండా ఉండడు.

*'కన్నీరుగా కరిగిన గీతికను'*

అనే భావచిత్రాన్ని ఒక్కటిగా చెప్పడు. తర్వాత ఒకటో రెండో భావచిత్రాలు వస్తాయి.

*'సిగ్గుతో రెండుగా చీలిన వెదురుబొంగును*
*మంటలో అంతరాంతర దగ్ధమైన బూడిదను'*

పై మూడింటిలో ఉన్నది భావానికి సంబంధించిన లయయే. అయితే, ఇలాటి వరస చెప్పేటప్పుడు ఒక మెలుకువ చాలా అవసరం. మొదటిదానికంటే రెండోది, రెండోదానికంటే మూడోది బలంగానే ఉంటేనే, ఈ లయకి బలం వస్తుంది. చాలామంది కవుల్లో దీని బలహీనత చూడగలం. కాని, తిలక్‌లో ఇది ఒక బలమైన అంశం. మరికొన్ని ఉదాహరణలు:

*'ఏ పిచ్చి పొగడ పువ్వుల గాలి సోకిందో*
*ఏ పండు వెన్నెల మత్తు కమ్మిందో*
*ఏ పికిలిపిట్ట కిటికీలో వాలి నాకేసి చూసి నవ్విందో'*

*'డేగలాంటి ఆ చూపుని ఆ విసురుని ఆ ఎత్తుని*
*మబ్బులాంటి ఆ పొగరుని మైకాన్ని స్వర్గసామీప్యాన్ని'*

*'వేలవేల బార్లలో కొన్నివేల నిషాగీతాల మధ్య*
*జాలిగొలిపే జవరాలి నృత్యం పరవశింపచేస్తుంది*
*ఓరగా తెచ్చిన జనానాల తలపులలోంచి*
*ఉండి ఉండి నిలవ గాలి వస్తుంది*
*హుసేన్ సాగర్ మీద ఒలికిన వెన్నెలలోంచి*
*విరహిణి మధుర విషాదగాథ వినిపిస్తుంది'*

*'గడియారపు డయల్ మీది*
*రేడియమ్ అంకెలు*
*చీకటి మార్జాలపు పచ్చని కళ్ళు -*
*కిటికీ అవతల*
*ఒక వెన్నెల బిందువు*
*కొబ్బరి మొవ్వులోనికి జారినట్లు*
*వినపడీ వినపడని చప్పుడు'*

ఇలా ఎక్కడైనా, ఎన్నైనా తిలక్‌లో చూడవచ్చు.

(2) <u>అంత్యప్రాస</u>

ఆ రోజుల్లో మామూలుగా కనిపించే అంత్యప్రాస తిలక్‌లో సాధారణంగా ఉండదు. భావానికి అనుకూలమైనా సరే. కావాలని వెయ్యడు. కాని, అంత్యపదాల్లోని, లేదా క్రియాపదాల్లోని ఒక పోలిక, ఎక్కువగా గమనించగలం. ఒక అంశాన్ని చెపితే, సాధారణంగా

పక్కనే సమానమైన అంశాన్ని నడకలోని సమానత్వం కూడిన విధంగా చెప్పడం తిలక్ లక్షణం. అక్షర సామ్యం ఉండవచ్చు, ఉండకపోవచ్చు. అంత్యప్రాసవంటిది పరుచుకుని ఉంటుంది ఆయనలో.

(i) అక్షర సామ్యంతో ఉన్నవి:

*యానాది పిల్ల ఆబకళ్ళు*

*పెళ్ళికాని పిల్ల కన్నీళ్ళు*

*అజ్ఞానపు కుళ్ళు*

*సృష్టి క్రూరపు ముళ్ళు*

*ఆప్యాయంగా మోసే ఆడదాని ఒళ్ళు*

(ii) నడకలోని సామ్యంతో ఉన్నవి:

*అది జీవిత పరమసత్యం*

*అది నాగరికత గమ్యస్థానం*

*అది చరిత్రల సారాంశం*

(iii) క్రియా పదాలు:

సాధారణంగా తిలక్ కవిత్వం నిండా లయ, క్రియా పదాల ముగింపుల్లో ఉంటుంది. శైలిలోని అందంలో దీనికి ప్రత్యేక స్థానం ఉంది.

*'గాలిలేని ప్రకృతి యోగిలాగ రోగిలాగ మూలుగుతోంది*

*కాలు విరిగిన ముసలి కుక్క దీనంగా వెలిగిస్తాడు*

*చారిత్రక దృక్పథం అతని శక్తి*

*సమ్యక్సిద్ధాంత రధ్యమీద రథాన్ని నడిపిస్తాడు'*

koumudi

(iv) ఏ రెండు పదాలూ ఏదో విధమైన లయ లేనిదే కనిపించవు తిలక్‌లో. అక్షర సంఖ్యలోని సమానత్వం కూడా లయకు దోహదం చేసేదే హల్లుల సామ్యమేగాక, అచ్చుల సామ్యం కూడా లయలోని భాగమే.

*'అంతర్గత సంగీతం, అనుపమ సుందరగీతం*

*నాలోపల వినబడుతూ, నన్నిలాగ నడిపిస్తూ*

*సృష్టిలోని అర్థం కోసం జన్మలోని సాఫల్యంకోసం*

*జనన మరణాతీతమైన సురభిళ రహస్యంకోసం*

అంతర్గత, అనుపమ, సంగీతం, సుందరగీతం, నాలోపల, నన్నిలాగ, వినబడుతూ, నడిపిస్తూ, సృష్టిలోని, జన్మలోని, అర్థంకోసం, సాఫల్యం కోసం ఇలా ఎన్ని విధాలుగానో లయ నిండి ఉంటుంది.

అయితే, ఈ లయకోసం ఆయన ఎక్కువగా వినియోగించుకున్నది సంస్కృత భాష, ఒక్కొక్కచోట క్లిష్టసమాసాల్నీ, సంక్లిష్ట పదాల్నీ కూడా ప్రయోగిస్తాడు. భాషా ప్రయోగంలో గ్రాంథికత కూడా ఎన్నో చోట్ల కనిపిస్తుంది.

*'ఉన్మదిష్ణువు సృష్టివేణువు'*

*ఆనంద శోకానుభూత్య విరళ*

*తటిచ్చకితవార్షుకవలాహకాలు*'

*అభ్యంగనావిష్కృత తద్వేయ వినీల శిరోజ తమస్సమ్ముదాలు*'

శ్రీశ్రీ కాలానికి సంస్కృత భాషా వినియోగపు అంగీకారం, తిలక్ కాలానికి బాగా సన్నగిల్లిపోయింది. పైగా వచన కవిత్వం ప్రజానుకూలమైందిగా స్థిరపడింది. ప్రయోగంలో ఉన్నవీ, అనివార్యమైనవీ, అర్థమయ్యేవీ ప్రయోగించడం అంగీకార్యమే కాని, కావాలని వాడే సంస్కృత వినియోగం, వచనకవితలో బాగా తగ్గిపోయింది. కాని, తిలక్‌ని సమకాలీన వాతావరణంలో అర్థంచేసుకోవచ్చు. అయినా, కొన్నిచోట్ల కనిపించే బరువైన, క్లిష్టమైన, కేటాయింపుగా కనిపించే సంస్కృత వినియోగం మాత్రం తిలక్ కవిత్వంలో లేకుంటేనే బాగుండేది.

తిలక్‌తో తెలుగు ఆధునిక కవిత్వం ఒక ముఖ్యమైన మలుపు తీసుకుంది. అంతకు ముందరి అభ్యుదయ, భావ కవిత్వ ధోరణులుగానీ, మరోటిగానీ, జీవితపు కొన్ని కొన్ని పార్శ్వాల్నే ప్రధానంగా గ్రహించాయి. అభ్యుదయ కవిత్వంది సామాజిక పార్శ్వం. భావకవిత్వంది సౌందర్యాత్మక భావనాపార్శ్వం. తిలక్ తన కవిత్వ నేపథ్యంగా మొత్తం 'జీవితం' అనే వస్తువుని తీసుకున్నాడు. అంతకుముందు లేనివీ కొన్నిటిని మేళవించాడు. ఎవరి ప్రభావమూ లేని ఒక కొత్త పంథాకు మార్గదర్శకుడైనాడు. ఇది తిల సాధించిన గొప్ప ఉపలబ్ధి.

తిలక్ కవిత్వంలో జీవితానికి సంబంధించిన మూడు పార్శ్వాలు ప్రధానంగా ఉన్నాయి.

(i) అనుభూతి, (ii) వేదన, (iii)సామాజికత

ఈ మూడింటిని గూర్చి ఆయన కవితారీతుల్ని పరిశీలించవలసి ఉంది.

***(i) అనుభూతి:***

koumudi

తిలక్ తన అభిప్రాయాన్ని ఒకచోట ఇలా చెప్పాడు.

"ఏమైనా జీవితాన్ని, సమగ్రంగా దర్శించడమూ, జీవిత వైవిధ్యాన్ని గూర్చి స్పందించడమూ, చాలా అవసరమేమో అనుకుంటాను. పాక్షికవాదులు జీవితంలో ఒకవైపే, ఒకభాగాన్నే చూసి, ఎంతో విశిష్టమైన అనుభూతి ఆవరణని మిస్ అయిపోయారేమో అనిపిస్తుంది' మరో సందర్భంలో ఇలా అన్నాడు...

'ఛందస్సూ, కవి సమయాలూ మొదలైన సంకెళ్ళ నుండి తప్పుకొనిన కవిత ఎలాగ అచ్చమైన రూపం సవరించుకుంటున్నదో, అలాగే కథా సంవిధానం అనే అనవసరపు తొడుగునీ విప్పుకుని, ప్రధాన అనుభూతుల ఆకృతితో దర్శనమిస్తోంది'

పై ఉటంకింపులలో అనుభూతి, అనుభూతి ఆవరణ అనేవి తిలక్ చెప్పినవే. ఈ పదాలకి, తిలక్ కవిత్వంతో అన్వయించేసి, కుందుర్తి ఇలా అంటారు.

'తిలక్ తాను ప్రధానంగా అనుభూతి వాదినని బల్లగుద్ది చెప్పుకున్నాడు. ఈ అనుభూతి వాదము ఇటీవలి కాలంలో భావకవితా యుగ సంబంధి. ఇది వ్యక్తి వాదానికి మరోపేరు. 'నా అనుభూతి నాది: దానిని నేను ఆవిష్కరిస్తాను' అనేన తత్వం - కవి పొందిన ప్రధాన అనుభూతుల ఆకృతిలో కవిత్వం దర్శనమిచ్చే ఏర్పాటు'

కుందుర్తి ఇక్కడ ఒక పార్శ్వం గురించి మాత్రమే చెప్పారు. కాని ఈ పదం ఇంకా లోతైన అర్థం కలదని నాకు అనిపించింది. దాన్ని వివరిస్తూ 'అనుభూతివాది తిలక్' అనే వ్యాసాన్ని 1966 సృజనలో ఒక విపులమైన వ్యాసం రాశాను.

అనుభూతి - అనే పదానికి రెండు అర్థాలు ప్రయోగంలో ఉన్నాయి. మొదటిది, ఏ భావాన్నైనా సరే, ఒక 'రసానుభూతి' లేక అలాంటిది కలిగేటట్లుగా చెప్పడం. ఇది సామాజిక కవిత్వానికి కూడా అన్వయిస్తుంది. శ్రీ శ్రీ 'భిక్షువర్షీయసి' మొదలైనవి ఇందుకు ఉదాహరణలు. రెండోది, అనుభూతి అనేది, దానంతటదే ఒక వస్తువు. లోకంలో 'నేనొక అనుభూతి పొందాను' అనే వాడుకలోని

'అనుభూతి' ప్రత్యేకమైనది. అంటే, సాధారణ జీవితానుభవాలన్నీ మనస్సు పై పొరల్ని తృప్తిపరుస్తున్నాయి. అవి ఎంత ఆనందమిచ్చినా, కాని అనుభూతి ప్రసరించే మనోరంగం, మనిషి లోలోపలి పొరల్ని కదిలిస్తుంది. ఇలాంటి కదలికతో జీవితం సార్థకమౌతుందనీ, దానికోసమే అన్వేషిస్తున్నామనీ, ఇది ఒకచోట ఆగేదిగాక జీవిత రహస్యాల్నిండా వ్యాపిస్తుందనీ, అనిపిస్తుంది. ప్రకృతిలో పంచేంద్రియాలు లీనమైనప్పుడు, గొప్ప సంగీతం విన్నప్పుడు, ప్రేమ వేదనాత్మకమైనప్పుడు - ఇలా ఎన్నెన్నో అరుదుగా దొరికే అనుభూతి రంగాలున్నాయి. తిలక్ కవిత్వంలో ఇలాంటి అనుభూతుల ఆవిష్కరణకి చాలా ప్రాధాన్యముంది. ఇదే అతను సరికొత్తగా సాధించింది. పైన విభజింపబడిన 'అనుభూతి, వేదన' అనే రెండంశాలూ పరస్పరం సంబంధం కలిగినవే. ముందుగా తిలక్ 'అనుభూతి' వైచిత్రిని పరిశీలించి, తర్వాత 'అనుభూతి ఆవరణ'లోకి వచ్చే 'వేదన'ను గూర్చి అనుశీలించవలసి ఉంది.

'రాత్రివేళ', 'నువ్వులేవు నీ పాట ఉంది' - అనే రెండు కవితలూ, అచ్చమైన అనుభూతి ప్రవాహాలు. అందుకే పాదాల విరుపులు గూడా మామూలుగా కాకుండా, ప్రవాహరూపాన్ని ధ్వనించడానికి, ఒక్కొక్క వాక్యం ఒక్కొక్క భాగంగా (పేరాగ్రాఫ్), భావప్రవాహంలో కొట్టుకుపోయే లక్షణాన్ని తీసుకువస్తాడు. 'రాత్రివేళ'లోని వస్తువు, ఏకాంతంగా రాత్రివేళ ఒక విషాద గానాన్ని విని, ఎక్కడెక్కడికో వెళ్ళిపోవడం. తిలక్ పంచేంద్రియానుభూతుల్ని, వాటి అగాధాల్లోకి అనుభవించే కవి. అందుకే అతను ఏ అనుభూతిని చెప్పినా తప్పనిసరిగా 'ప్రకృతిలీనత్వం' అంతర్గతంగా ఉంటుంది. అనుభూతులకి ఆకారం ఇవ్వడం చాలా కష్టం. అనేకమంది, అనుభూతివాద కవులు, అనుభూతిని వస్తువుగా చేసుకున్నా, ఆ అనుభూతి కేంద్రంలోకి తీసుకువెళ్ళి, ఆ నిశ్శబ్దాన్ని అద్భుతంగా అందిస్తుంది. భావచిత్రాలు (ఇమేజ్) ఎన్నెన్నో లోతుల్ని స్పృశిస్తూ కదులుతూ ఉంటాయి.

*'ఇంత రాత్రివేళ ఈ గానం ఎవరిదో*
*చీకటి కాగితం మీద ప్లాటినం తీగలాగ మెరుస్తోంది,*
*ఏదో విషాదాన్ని హాయిని భయాన్ని పంచి పెడుతూంది.*
*ప్రాణాలకు అడుగున ఉన్న సుతారపు తీగల్ని కదిలిస్తోంది,*
*ఏదో విధిదష్టమైన జీవితం కాబోలు పాపం*
*మొరపెడుతోంది జాలి జాలిగా,*
*సంకీర్ణమైన విశ్వరహస్యం*
*మరీ మరీ నిగూఢమై కదలే నల్లని నీడలతో కలిసిపోతోంది'*

*'.....ఒంటరిగా నాలో ఊహలలో అవ్యక్తంలాగ ఒదుగుతోంది,*
*అనంతమైన శూన్యాన్ని అలుముకుంటోంది.*
*ఏదో పాట మాత్రం ఏడుపేడుగా సన్నగా తియ్యగా గాలిలో ఊగుతోంది,*
*నీరవమైన ఏకాదశి నిశీధాన్ని రెండుగా చీలుస్తోంది'*

దాదాపు ప్రతి అనుభూతి ఆవిష్కరణలో వైరుధ్యంగల భావాలు అడుగడుగునా వ్యక్తపరుస్తూ పోతాడు తిలక్. ఈ కవితలో ఒకచోట 'నిశ్శబ్దం మెల్లగా నడుస్తూ అడుగులు వేస్తోంది' అని, పక్కనే 'ఆకాశం మీద ఒక్క చుక్క మరో నక్షత్రంతో మాట్లాడేమాట మాత్రం మనసుకి వినిపిస్తోంది' అంటాడు.

'విషాదాన్నీ, హాయినీ, భయాన్నీ పంచిపెడుతోంది' అంటాడు.

'ఏడుపేడుపుగా, సన్నగా, తియ్యగా గాలిలో ఊగుతోంది' అంటాడు.



koumudi

ఈ కవితలోనే కాదు. ద్వంద్వాల్ని పక్కపక్కన నిలబెట్టడం, ఆనందాన్నీ, విషాదాన్నీ మేళవించడం - మొదలైనవి తిలక్ కవిత్వంలో ఏ వస్తువును చెప్పినా, పదే పదే గమనించగలం. ఈ ధోరణి తప్పనిసరిగా సృష్టిమూలాల్లోకి దారితీస్తుంది. ఈ ఆవిష్కరణ కూడా ఆయన కవిత్వంలో ప్రధానధారగా ఉంటుంది. ఈ కవితలోనే....

'సంకీర్ణమైన విశ్వరహస్యం మరీ మరీ నిగూఢమై కదలే నల్లని నీడలలో కలిసిపోతోంది' అంటాడు.

'నువ్వు లేవు నీ పాట ఉంది' ప్రియురాలితో గడిపిన ఒక సందర్భం జ్ఞాపకం వచ్చి, కవి పడుతున్న ఆవేదన. వ్యక్తం నుంచి అవ్యక్తానికి, మూర్తం నుంచి అమూర్తానికి తీసుకువెళ్ళే అతని అనుభూతి వ్యక్తీకరణ ఇలా ఉంటుంది.

*'...పరువానికి వస్తున్న నా వయస్సులో*
*చటుక్కున పరిమళపు తుఫానుల్ని రేపి*
*మహారణ్యాల సౌందర్యాన్ని చూపి*
*సముద్రపు కెరటాల బలంతో*
*మధ్యగా మౌనంగా ఉన్న ద్వీపాల్ని ఊపి*
*ప్రపంచం యొక్క అవధుల్ని దూరంగా సాచి*
*నన్ను దిగంతాలకి విసిరేసిన వేళ'*

అనుభూతి భావచిత్రాల్లో, నేల నుండి నింగికి సాగిపోయే లక్షణం తిలక్‌లో విచిత్రంగా ఉంటుంది. ప్రకృతిలో తన అనుభూతితో సమ్మిళితమైపోయే స్పందన ఇలా ఉంటుంది.

*'నీ పాట... ఇంటి ముందు జాకామల్లె తీగల్లో అల్లుకుని*
*లాంతరు సన్నని వెలుతురులో క్రమ్ముకుని*
*నా గుండెల్లో చుట్టుకుని గాలిలో ఆకాశంలో నక్షత్రం చివరి మెరుపులో దాక్కుని*
*నీరవంగా నిజంగా ఉంది జాలిగా హాయిగా వినబడుతూ ఉంది*
*శిశిర వసంతాల మధ్య వచ్చే మార్పుని గుర్తుకు తెస్తోంది ఇన్నేళ్ళ తర్వాత'*

అతనిప్పుడున్న పరిస్థితికి, 'వసంత శిశిరాల మధ్య' అనాలి. ఆమెతో కలిసి ఉంటే వసంతం, దూరమైపోయినప్పుడు శిశిరం, కాని 'శిశిర వసంతాల మధ్య' అన్నాడు. అంటే అప్పటిదే శిశిరమైంది. ఇప్పటిది వసంతమైంది. అంటే జరిగిన విషయం మీద, జ్ఞాపకానికుండే ఆధిక్యాన్ని ఈ ప్రయోగం సూచిస్తోంది. ఇది ధ్వనిరూపంగా ఉంది. ధ్వని ప్రధానమైన రచనలో తిలక్ ఉన్నత స్థాయిలో ఉంటాడు.

***(ii) <u>వేదన:</u>***

ప్రతివ్యక్తీ నిత్యజీవితంలో వస్తువుల ద్వారా వచ్చే సౌకర్యాన్నీ, అనుబంధాల ద్వారా వచ్చే ఆనందాన్నీ పోగుచేసుకుంటూ పోతాడు. సుఖదుఃఖాలు, గెలుపోటములూ, మొదలైన ద్వంద్వాల మీదుగా నడుస్తుంటాడు. మొత్తం మీద ఒక అస్తిత్వాన్ని గూర్చిన నిరంతరధారగా జీవితం సాగుతూ ఉంటుంది. మేలుకున్న మనిషిలో ఇదొక వేదనగానే ఘనీభవిస్తుంది. ఇదంతా మనిషి ఒక సంపూర్ణత వైపు పరుగులు పెట్టడం, దాన్ని అందుకోలేకపోవడం, అనే విషయం మీద ఆధారపడి ఉంది. ఈ వేదనని ఆవిష్కరించడం, తిలక్‌లో ఏ సామాన్యుణ్ణైనా ఆకట్టుకునేంత 'నిషాదమోహనంగా' ఉంటుంది. అన్నీ మామూలు సంఘటనలే. వాటిల్లోంచి తిలక్ పిండే తాత్వికత ఎంతగానో ఆకర్షిస్తుంది. తన సుఖం కోసం, ఆనందం కోసం వెతుకులాటలో ప్రతి మనిషీ 'ఏకాంతపాంథుడే'. ఈ విషాదాన్ని ఇలా చెపుతాడు తిలక్.

koumudi

'ఒకడు కంగారుగా ఒకడు రహస్యంగా ఒకడు బెదురుగా
ఒకడు ధైర్యంగా విలాసంగా మరొకడు కింగ్గీగా
ఆవిడ తలవంచుకుని నిత్య పాతివ్రత్య భారావహనంతో
ఈవిడ ఓరగా చూస్తూ పైట సవరించుకుంటూ
లోపల్లోపల గతుక్కుమంటూ
రోజుల స్థంభాల చుట్టూ తిరుగుతూ
కాలం కారిడార్లలోకి మసక మసక చీకట్లో సిలౌటీలు కల్పిస్తూ
ఎవరికి వారే ఏకాంత పాంథులు
అదృశ్య శృంఖలాబద్ధ పాదాల నీడుస్తూ ఏడుస్తూ చప్పట్లు చరుస్తూ
కోలాహల హాలాహల నీలాచల గుహాంతరాలవైపు
కోష్ణకవోష్ణ స్వప్నరంభా పరీరంభపుకైపు కోసం పోతున్నారు
దిగులుగా తిరిగి విప్పి చూసుకుని
ఏమీ దొరక్క మరేమీ తెలియక
మళ్ళీ ఆడసు లేని ఆనంద ప్రియ బాంధవి కోసం
మరో మలుపు మరోదారి మరోవూరు వెళ్ళాలని
మంచు కప్పిన స్టేషన్ల దగ్గర విమానాశ్రయాల దగ్గర
పడిగాపులు పడి నుంచున్నారు.
ఎడ్వాన్సు బుకింగ్ లేదు ఎప్పుడు రైలొస్తుందో తెలియదు
సిగ్నలిచ్చేవాడు తన గదిలో చిత్తుగా తాగి పడుకున్నాడు'

మనిషి, తన చేతిలో లేని ఆనందం కోసం అన్వేషణలో అలిసిపోయే వేదనకి, ప్రత్యక్షర ధ్వనిరూపమైన భావచిత్రాల ఆవిష్కరణ ఈ పై పాదాలన్నీ.

అడుగడుగునా తెలుగు నలుపులు పెనవేసుకున్న ఈ జీవితంలో దొరికిన చిన్న చిన్న సంతోషాల్నే గుండెకి హత్తుకోవాలనే జీవన సత్యాన్ని చిరస్మరణీయమైన భావనతో ఇలా చెప్పాడు తిలక్.

'నలభై కోట్ల మనుషులు నిజమైన ప్రాణం ఉన్న
మనుష్యులతో నిండిన దేశం నాది
ఆకలి బాధలూ ఆందోళనలూ సమస్యలూ
విరివిగా ఉన్న విచిత్ర సౌధం మాది
కడుపు నిండుగా ఆహారం గుండె నిండుగా ఆశ్లేషం
కొంచెం పుణ్యం, కించిత్ పాపం
కాస్త కన్నీరు మరికాస్త సంతోషపు తేనీరూ
చాలు మాకు తండ్రీ!

*సరదాగా నిజాయితీగా జాలిజాలిగా*
*హాయి హాయిగా బ్రతుకుతాం.....*
*చావు పుట్టుకల మధ్య సందేహంలాంటి*
*జీవితంలో నలువైపులా అంధకారం*
*మంచిగంధంలాగ పరిమళించే మానవత్వం*
*మాకున్న ఒకే ఒక అలంకారం*
*మజిలీ మజిలీకి అలిసిపోతున్నాం.*
*మలుపు మలుపుకీ రాలిపోతున్నాం*
*ఆశల వెచ్చని పాన్పుమీద స్వప్నాల పుష్పాలు జల్లుకుని*
*ఆదమరచి కాసేపు విశ్రమించడానికి అనుమతించు తండ్రీ!*

జీవితాన్ని జీవితంగా చూసిన ఈ వేదనాత్మక రచనా తిలక్ కవిత్వానికి ఒక అంతర్నేత్రం.

*'లక్షలాది దేవుళ్ళ నుండి వారి పూజారుల నుండి*
*వారి వారి ప్రతినిధుల నుండి*
*సిద్ధాంతకేసరుల నుండి సిద్ధుల నుండి*
*శ్రీమన్మద్గురు పరంపరనుండి'*

అని ఫ్యూడల్ భావాల్ని నిర్ద్వంద్వంగా ఖండించే తిలక్, 'దేవుణ్ణి' తన కవిత్వంలో ఒక కవితాత్మక ప్రతీకగానే వాడుకున్నాడు. మరోచోట అంటాడు.

*'చినిగిన స్వప్నపు సంచిలో*
*చితికిన బాష్పం నిలవదు*
*అందుకే నేస్తం జీవితమే ఒక జూదం*
*భేదానికి మోదానికి లేదసలే భేదం'*

చివరి పంక్తిలో ఉన్నది వేదాంతభావన కాదు. జీవితపు జూదంలో రెంటిదీ ఒకే విధమైన స్థానమే అని చెప్పడమే ముఖ్యం.

***(iii) సామాజికత:***

'అమృతం కురిసిన రాత్రి'లో సామాజిక కవిత్వం ఏమాత్రం తక్కువగా లేదు. ఉన్నవన్నీ బలమైన భావాల్తో నిండి ఉన్నాయి. యుద్ధాల వెనక కుట్రల గురించి, పేదరికం గురించి, మధ్యతరగతి అసమర్థత గురించి, మరెన్నో సమస్యల గురించి, తిలక్ శక్తిమంతంగా రాశాడు. అంతేగాక, సామాజికతను ఎంత అనుభూతితో చెప్పగలమో నిరూపించాడు. అయితే, అతనిది పరిష్కార ప్రధానమైన ధోరణి కాదు. విస్తృతమైన ప్రగతిశీలతలో ఒక ముఖ్యమైన పార్శ్వం, విషాద వాస్తవికత అతని సామాజిక కవిత్వానికి నేపథ్యం.

కుందుర్తి తిలక్‌ను గూర్చి అంటారు...'తిలక్ తన కవితను గురించి తానే విధంగా నిర్వచించుకున్నప్పటికీ అతని ఊహలో అడుగడుగునా అభ్యుదయ భావావేశం తొంగి చూస్తూనే ఉంటుంది. అభ్యుదయ కవితాయుగం బాగా ప్రవర్తిల్లిన రోజుల్లో అనేకమంది కవులు శైలికీ, అక్షరరమ్యతకీ ప్రాధాన్యం ఇవ్వనందువల్ల అదొకలోపంగా పరిణమించింది. ఈ దోషాన్ని పరిహరించి తిలక్ అభ్యుదయాభావాలకు రమ్యమైన శైలిని సమకూర్చడంలో కృతకృత్యుడయ్యాడు'

koumudi

శైలి, అక్షరరమ్యత - మాత్రమే కాదు. ఒక భావాన్ని నగ్నంగా కాక, ఏ దుస్తులు వేస్తే గొప్ప అనుభూతి కలిగించవచ్చునో తిలక్ కి తెలుసు. ఈ నాటి దాకా మంచి సామాజిక కవులందరూ ప్రేమించే ఈ భావానుభూతిని ప్రారంభించిన కవి తిలక్కే. తర్వాతి కవిత్వంలోని ఈ శక్తి తిలక్ ప్రభావం కాదు గానీ, పరిణమిస్తున్న ఒక మార్గంలో మొదటనిలబడ్డవాడు ఆయనే. సామాజిక కవిత్వంలోని అనుభూతికి ఉన్న భావచ్ఛాయ ఇంతకు ముందు వివరించబడింది. భావచిత్ర బహుళంగా రాయబడుతున్న సామాజిక కవిత్వం తిలక్‌తోనే ఒక మలుపు తిరిగింది.

సామాజిక భావాల్ని అనుభూతి ముద్రవేసేటట్లు చెప్పడంలో తిలక్‌కి ఎన్నో రకాల శిల్పాలు తోడ్పడినాయి.

***(i)* ఆర్త గీతం:**

ఆర్తగీతం - కవిత బాగా భావచిత్రాలున్న కవిత కాదు. ఎక్కువగా తాను చూసిన దృశ్యాల్ని ఒకదానివెంట ఒకటి చెప్పడమే. అయినా దీనిలో రసానుభూతి నింపాడు తిలక్. అది కరుణరస ప్రధానమైన దృశ్యాల పరంపరని చెప్పడం. 'నేను చూశాను నిజంగా' అనే బలమైన అంశాన్ని పునరుక్తం చెయ్యడం, వాస్తవికత లోతుగా చెప్పడం. ఇవన్నీ ఈ కవితని ఒక గొప్ప ఊపుతో నింపాయి. ఇందులో శైలీవేగం చాలా ముఖ్యమైన అంశం.

వాచ్యతకి ఎంత బలం కలిగించవచ్చునో, ఎలా వచనత్వం కాకుండా చెయ్య వచ్చునో ఇందులో గమనించగలం.

*'నేను చూశాను నిజంగా నీరంధ్ర వర్షానవంతెన కింద*
*నిండు చూలాలు ప్రసవించి మూర్ఛిల్లిన దృశ్యాన్ని*
*నేను చూశాను నిజంగా తల్లిలేక తండ్రిలేక*
*తిండిలేక ఏడుస్తూ ఏడుస్తూ*
*ముంజేతుల కన్నులు తుడుచుకుంటూ*
*మురికి కాల్వ పక్కనే నిద్రించిన మూడేళ్ళ పసిబాలుణ్ణి..... '*

ఇలా సాగిపోతుంది. ఈ కవిత ముగింపు కూడా కరుణ రసానికి సహకరించేదే ఏదైనా పరిష్కారంతో ముగిస్తే , బలమైన ధారగా వస్తున్న కరుణానుభూతి స్రవంతికి ఆటంకమేర్పడుతుంది. వాస్తవిక సంఘటనలకి రసానుభూతి శైలినిచ్చింది ఈ కవిత.

(ii) నీడలు:

మధ్య తరగతి వాళ్ళ దుర్గుణాలన్నీ చాలా సరళంగా వర్ణిస్తూ వచ్చి ముగింపులో ఒక అద్భుతమైన భావచిత్రాన్నివ్వడం.

*'చిన్నమ్మా*
*నేను వెళ్ళొస్తాను*
*చీకటి పడుతోంది*
*చిటారు కొమ్మలో నక్షత్రం చిక్కుకుంది*
*శిథిల సంధ్యాగగనం రుధిరాన్ని కక్కుకుంది*
*దారంతో గోతులు ఇల్లేమో దూరం*
*చేతిలో దీపం లేదు, ధైర్యమే ఒక కవచం '*

ఈ భావ చిత్రాలన్నీ మధ్య తరగతి బాధలకే ధ్వని రూపాలు. ఒక Chain of Events లేదా Images వల్ల ఒక ఆవేశం ధ్వనించడం ఇలియట్ చెప్పిన Objective Correlative శిల్పం ఔతుంది. చీకటిపడడం, చిటారు కొమ్మలో నక్షత్రం చిక్కుకోడం, శిథిల సంధ్యాగగనం - ఇవన్నీ వివిధమైన ఆవేదనల్లోనే పర్యవసిస్తాయి.


koumudi

***(iii) గొంగళీ పురుగులు:***

ఇందులో మధ్య తరగతి అసమర్థులైన వీరేశ్వరరావు, నీరేశ్వరరావు, జోగేశ్వరరావు మొదలైన వాళ్ళంతా గొంగళీ పురుగులనే ఒక గొప్ప ఉపమానంలో చెప్పాడు తిలక్. ఇది చురుగ్గా ఉండదు. ఎప్పుడూ కలల మత్తులోకి వెళ్ళిపోతుంది. ఏమీ చేతగానితనం, చెయ్యలేనితనం ఈ వర్ణనలో ఉంది. దీన్నే కవిత నిండా కొన్నిసార్లు వేరు వేరు ఛాయల్తో పునరుక్తం చేస్తాడు.

*'విని కూడా కదలకుండా గొంగళీపురుగు*
*సగం సగం తిన్న కలల్ని నెమరేస్తూ నిద్రపోయింది'*

*'చాటుగుండా చూసుకుని, నవ్వుకుని, మీసం మెలేసుకుని*
*మాట్లాడకుండా జెంటిల్మన్‌లా మత్తుగా పడుకుంది గొంగళీ పురుగు'*

*'ముడుచుకుపోయిన గొంగళీ పురుగు*
*తన్ని తనే తీసుకుని గోడ అవతలకి*
*తన్నితనే గిరవాటేసుకుంది'*

కొన్ని కొన్ని సందర్భాల్ని కథనాత్మకంగా చెపుతూ, పైవిధమైన ముగింపునిస్తూ, మళ్ళీ చివరికి

*'తిరిగి తన జీవితాన్ని బల్లపరుపుగా పరుచుకుని*
*దానిమీద నిద్రపోయింది గొంగళి పురుగు*
*సగం సగం తిన్న కలల్ని నెమరేస్తూ*
*సగం సగం చచ్చిన ప్రాణాల్ని జోకొడుతూ'*

ఇలాటి మంచి ఉపమానం స్ఫురిస్తే, దాన్ని అనేక కోణాల్లో కొనసాగించి, గొప్ప శిల్పాన్ని చూపవచ్చు కవి.

సామాజిక భావాల్ని, సంఘటనల్ని చెపుతున్నప్పుడు, అతి సరళమైన తెలుగు పదాలూ, నుడికారము, భాషా మాత్రమే తీసుకుంటాడు తిలక్. అనేకమైన అభివ్యక్తి వైవిధ్యాలతో వాటిని కవితాత్మకం చేస్తాడు. పైన ఉదహరించినవే గాక, ఎన్నో ఎన్నో రీతులు తిలక్‌లో గమనించవచ్చు.

ఒక కవి, తనకాలంలో తాను నమ్మిన భావాలు మరోనాటికి ప్రమాదకరమయ్యే అవకాశం కూడా ఉంది. తిలక్ ఖచ్చితంగా ఫ్యూడల్ భావాల్ని వ్యతిరేకించినవాడు. అవహేళన చేసినవాడు కూడా. 'మన సంస్కృతి' అనే కవితలో ఇలా అంటాడు.

*'మన సంస్కృతి నశించిపోతుందన్న*
*మన పెద్దల విచారానికి*
*మనవాడూ పిలకమాని క్రాఫింగ్ పెట్టుకున్నాడనేది ఆధారం....*
*యుగయుగానికీ స్వభావం మారుతుంది*
*అగుపించని ప్రభావాలకి లొంగుతుంది...!'*

నిజమే. సంస్కృతి మారుతుంది. కాని, ఇందులో తిలక్ చెప్పిన మరొక భావన్ని నేను అంగీకరించలేను. సమకాలీనంగా చూసినా, ఆయన ఇలా చెప్పి ఉండవలసింది కాదని పిస్తుంది. సంస్కృతి విషయంలో అత్యంత ఉదార వాదుల కోవలోనే చెప్పాడు తిలక్. ఆ పంక్తులు ఇవి:



koumudi

*'మనం వేషం, మన భాషా, మన సంస్కృతీ*
*ఆది నుండి ద్రవిడ బర్బర యవన తురుష్క హూణుల నుండి*
*ఇచ్చినదీ పుచ్చుకున్నదీ ఎంతైనా ఉన్నదనీ*
*అయిదు ఖండాల మానవసంస్కృతీ*
*అఖండ వసుధైక రూపాన్ని ధరిస్తోందనీ*
*భవిష్యత్ సింహద్వారం తెరుస్తోందనీ*
*గ్రహించలేరు పాపం వీళ్ళు*
*ఆలోచించలేని మంచివాళ్ళు*
*ఏదేశ సంస్కృతి అయినా ఏనాడూ కాదొక స్థిరబిందువు*
*నైలు నదీనదాలు అదృశ్యంగా కలిసిన అంతస్సింధువు'*

తిలక్ ఈనాటి వరకు ఉండి ఉంటే ఈ మాట అన్నందుకు బాధపడేవాడు. ఫ్యూడల్ సంప్రదాయాన్ని ఖండించడం వేరు: పూర్తిగా ఇతర సంస్కృతికి లొంగిపోవడం వేరు. అఖండ వసుధైక రూపం,' 'భవిష్యత్ సింహద్వారం' ఏదో మనం ఇప్పుడు చూస్తున్నాం! ఏ సంస్కృతీ స్థిరబిందువు కాదన్నది నిజమే. కాని మౌలికమైన సంస్కృతినీ, తన అస్తిత్వాన్నీ నిలుపుకోలేని దేశాన్ని, మరో బలమైన దేశం కబళించివేస్తుంది. అప్పుడు వేషం, భాష, సంస్కృతులలో 'ఇవ్వడం, పుచ్చుకోడం' ఏమీ ఉండదు. దోపిడి చేసే దేశం, మననుండి ఏమీ పుచ్చుకోదు. ఇవ్వడమే జరుగుతుంది. సంస్కృతిని 'స్థిరబిందువు' కాదంటున్నాడు తిలక్. కాని, మన బిందువే కొట్టుకుపోయేంత సాంస్కృతిక దోపిడీని సమర్థించడం సామ్యవాది, దేశప్రేమికుడు చెయ్యలేడు. ఫ్యూడలిజమ్‌కీ, ఆధునికతకీ మధ్యలో 'మౌలిక సంస్కృతి' అనేది ఒకటి ఉంది. దాని అవగాహన ఈనాడు అత్యవసరం.

తిలక్‌నే ఫ్యూడల్ అవశేషాలున్నాయని ఒక కవితపై విమర్శ కొందరు చేశారు. ఈ కవిత 'ప్రవహ్లిక'. ఇందులో స్త్రీ పట్ల తన భావాల్ని వ్యక్తీకరిచాడు తిలక్. తెల్లని హృదయం గలదాన్నిగా, సృష్టి ముందరి చీకట్లోంచి ఏరుకున్న సౌందర్యాన్ని కళ్ళలో నింపుకున్న దానిగా తనను చుట్టుకున్న పరమార్థంగా, నిగూఢ రహస్యాలు దాచుకున్న కన్నులు గలదానిగా, శృంగారావధిగా చెపుతూ ముగింపులో ఇలా అంటాడు.

*'నాకు తల్లివి, నెచ్చెలివి, చెలివి*
*నన్ను కౌగిలించుకున్న పెద్దపులివి'*

చివరి పంక్తిపై కొందరు వ్యతిరేక విమర్శ చేశారు. అయితే, ఎక్కడా స్త్రీ పట్ల ఫ్యూడల్ భావాల్ని చెప్పని తిలక్ ఇలా అన్నప్పుడు, వేరే కోణంలోంచి చూడవలసిన అవసరం ఉంది. పెద్దపులిని ఇక్కడ క్రూరత్వానికి ప్రతీకగా చూడనక్కర్లేదు. పెద్దపులి పట్టు చాలా గాఢమైంది. తల్లిగాని, నెచ్చెలిగాని, చెలిగాని మగవాణ్ణి తీవ్రమైన బంధంలోకి తీసుకుంటారు. పై పంక్తితో పోసుగుదలకు కూడా 'గాఢబంధం' అనే భావాన్నే ఆ ఉపమానంలోంచి తీసుకోవాలి గాని, వేరే లక్షణాల్ని సమాన ధర్మంలోకి తేవలసిన సందర్భం లేదు.

పునర్మూల్యాంకనమంటే ఈ కాలానికి సంబంధించిన వస్తుశిల్పాలు ఆనాటి కవిలో లేవు కాబట్టి పూర్తిగా ఆ కవి పనికిరాడని చెప్పడం కాదు. ఆ కవి, తనకాలంనాటి ప్రగతి శీలతని వ్యతిరేకిస్తే, అది దోషమౌతుంది. తన కాలం నాటి పరిస్థితుల్లో ఎంత బలంగా, ఎంత వినూతనంగా చెప్పగలిగినాడన్నది అంచనా వెయ్యాలి. ఈవిధంగా చూసినప్పుడు, తిలక్‌లోని అతి స్వల్పమైన భాషా భారమూ, ప్రణయ కవిత్వాన్ని కేవలం శైలీ సౌందర్యం మీద మాత్రమే ఆధారపడి చెప్పిన పద్ధతీ, మరికొద్ది చిన్న అంశాలు తప్పితే, ఆయన



koumudi

కవితలోని దీర్ఘకాలిక, శాశ్వత విలువలు అత్యంత ప్రశంసనీయం. ఒక అనుభూతి సమగ్రతను కవితలో గాఢంగా నింపేవిధానం ఆయనతోనే ప్రారంభమైంది. దీనికి ఆయన శైలిలోని పోకడలు, ముఖ్యంగా భావచిత్ర, ప్రతీకాది నిర్మాణంలోని కొత్తదనమూ, బాగా సహకరించినాయి. అందుకే ఆయన్ని నూతన మార్గనిర్మాత (Innovator) అనవచ్చు. తర్వాతి కాలంలో వస్తువులో శైలిలో ఎన్ని పరిణామాలు వచ్చినా, తిలక్ ఎప్పటికీ గొప్ప కవితానుభూతి కలిగించే, గొప్ప కవిగా ప్రకాశిస్తూనే ఉంటాడు.



## 'ఆత్మకథ'ల కథ

గొల్లపూడి మారుతీరావు

'**ఆత్మకథ**' మనిషి సాయంకాలాన్న నిలబడి వెనక్కి తిరిగి చూసుకునే ఘట్టం. చెప్పదగినవీ, చెప్పుకోదగినవీ, విప్పదగినవీ, కప్పుకోదగినవీ - ఓ తాత్వికదృష్టితోనో, పరోక్షభావనతోనో - తనని ఎరిగిన పాఠకలోకానికి - తన మనస్సుని విప్పిచెప్పుకునే ప్రకటన - ఆత్మకథ. అది ఆ మనిషిని బట్టి, అతను దాటి వచ్చిన దశలను బట్టి, అతను ప్రయాణించిన సామాజిక చరిత్రను బట్టి, చెప్పే విషయాన్ని బట్టి, తీరుని బట్టి ప్రాముఖ్యాన్ని సంతరించుకుంటుంది. వ్యవస్థ మీద కోపాన్ని ఉగ్గబట్టి, పదవిని వదిలాక విరుచుకుబడ్డ పెద్ద ఉద్యోగుల ఆక్రోశపు కథలు ఈ మధ్య చదివాం. ఆయా సంఘటనలు జరిగిననాడు చెప్పలేని వివరాలను - ఆలశ్యంగా విని ఆశ్చర్యపోయిన, నిట్టూర్చిన, అర్థం చేసుకున్న సందర్భాలు బోలెడు. కొందరికి ఆత్మకథ సంజాయిషీ, కొందరికి పునర్విమర్శ, కొందరికి పునరుజ్జీవనం. 'సంజాయిషీ' ఆత్మకథని ఈ మధ్య ప్రపంచమంతా చదివి కితకితలు పెట్టినట్టు ఆనందించిన సందర్భం ఒకటుంది. అది పాకిస్థాన్ అధ్యక్షులు ముష్రాఫ్ గారిది.

అసలు ఆత్మకథ రాయకపోతేనేం? చాలామంది ఈ మాట అనడం నాకు తెలుసు. మనిషి జీవితంలో ఏ ప్రక్రియకూ లొంగని కొన్ని అనుభవాలూ, అనుభూతులూ, స్పందనలు, వివరణలు చెప్పుకునే వేదిక కావాలి. మనిషి పోయాక తను ఆశించినట్టు ఈ ప్రపంచం తనని గుర్తుంచుకోవాలన్నది మానవ ప్రలోభం. ఇది 'రేపు'కి దూరంగా నడిచే ఏ వ్యక్తయినా పడే తాపత్రయం. ప్రతిష్టకి నోచుకోకపోయినా ప్రతి శిల్పీ తనకి తాను రూపు తీర్చే శిలావిగ్రహం - ఆత్మకథ. ఈ మాట చాలా మందికి కష్టాన్ని కలిగించవచ్చు. క్రూరంగా అనిపించవచ్చు. కానీ జీవిత సాయంకాలంలో అతను చెప్పే కథకి ఇంతకన్నా కారణం కనిపించదు. పోతే, 'నీ గురించి నువ్వు చెప్పుకో' అని పదిమందిని నిలబెట్టి మాట్లాడమనండి. అయిదుగురు తెల్లమొహం వేస్తారు. ఇద్దరు అబద్ధాలు చెపుతారు. ఒకరికి ఏం చెప్పాలో తెలియదు. ఒకడు లేని 'వినయాన్ని' నెత్తిన వేసుకుంటాడు. ఒకడు - ఒక్కడు - జీవితాన్ని వెదుకుతాడు. అదిగో, అతని నుంచే సజావయిన ఆత్మకథ వస్తుంది. వెదికి, ఏరి, తనని తనమంచీ దూరంగా నిలుపుకుని - చెప్పగలిగే విచక్షణ ఆ కథకి గాంభీర్యాన్నీ, నిజాయితీని సంతరిస్తుంది. గాంధీగారి గొప్పతనమంతా పక్కన పెట్టగా - ఆయన వయస్సులో పెళ్ళాం మీద విసుక్కుని చాచి చెంపదెబ్బ కొట్టడం - అతన్ని మనమధ్య నిలబెడుతుంది. ఆ తర్వాత మన కంటే ఎత్తు ఎదిగిన వ్యక్తిత్వాన్ని ఆ వాస్తవం అలంకరిస్తుంది.

ప్లూటార్క్ అనే రచయిత ఓ మాట అన్నాడు:The biography displays the reward of duty performed, reveals the traps of ambition, reflects the fall of arrogance.

నాకు ఆత్మకథ వ్రాయాలనే ఉద్దేశం వచ్చినప్పటినుంచీ కొన్ని వందల ఆత్మకథలు చదివి ఉంటాను. ఇంకా చదువుతున్నాను. ఆవిష్కరించే ప్రతీ జీవితంలోనూ ఒక 'దారి' కనిపిస్తుంది. ఒక వేదన కనిపిస్తుంది. ఒక పోరాటం కనిపిస్తుంది. పసితనంలో

అభూతకల్పనలూ, వయస్సులో కలల కథలు, మధ్య వయస్సులో వాస్తవాల స్థాయిని దాటాక, వయస్సు మలుపు తిరిగిన మెలికలో చరిత్రలూ, ఆత్మకథలూ ఆసక్తిని పెంచుతాయి.

పక్కవాడి జీవితంలోకి తొంగిచూడడం - ప్రతివాడికీ ప్రాథమికమయిన 'దురద' peeping tom మంచి వాడుక పదం. ఆ వ్యక్తి పరపతి పెరిగిన కొద్దీ, ఆ వ్యక్తి కీర్తో, అపకీర్తో పత్రికల్లో వెలువడిన కొద్దీ - ఆ కథ 'రుచి'ని మరుగుతుంది. ఎప్పుడో 45 సంవత్సరాల క్రితం ఆనాటి ప్రముఖ నటీమణి హెడ్డీ లామర్ తన సౌందర్యంతో ఆనాడు ఎందరో నిద్రల్ని పాడుచేసింది. ఆమె ఒక్కరినే ఆనాడు హిట్లర్ మోకాళ్ళ మీద నిలుచుని పలకరించాడని చెప్పుకుంటారు. ప్రముఖ దర్శకులు సిసిల్ బి.డి మిల్లో ఆమెని తనతో ఒక సంవత్సరం పాటు తిప్పుకుని, ఆమె సౌందర్యాన్ని ఆకళించుకుని తర్వాత "శాంసన్ అండ్ డెలైలా"లో హీరోయిన్ వేషం వేయించాడు. ఆవిడ తన స్వీయ కథని రాసింది. Ectasy and me ఆ పుస్తకం పేరు. హెడ్డీ లామర్ ఐదు సార్లు పెళ్ళి చేసుకుంది. ఒకానొక సంపన్నమయిన భర్త బందిఖానా నుంచీ తప్పించుకోడానికి ఎలా 'సెక్స్' ప్రదర్శనశాలలోకి మాయమయిందో రాసింది. నా జీవితంలో అంత బట్టబయలుగా రాసిన ఆత్మకథని ఏనాడూ చదవలేదు. ఆవిడ ఒక రచయితతో సరదాగా గడపాలనుకొందట. శని ఆది వారాల్లో అతన్ని ఆహ్వానించింది. నేను నీ భర్తని కానని తిరస్కరించాడు ఆ రచయిత. అతన్ని కారులోకి లాగి ఆ రోజే పెళ్ళి చేసుకుని, శని ఆదివారాలు అతనితో గడిపి సోమవారం అతనికి విడాకులిచ్చింది. ఈ పుస్తకాన్ని సంపాదించి మళ్ళీచదవాలని గత 45 ఏళ్ళుగా ప్రయత్నించినా ఎక్కడా దొరకలేదు. (ఇటీవలే టెక్సాస్ వెళ్ళినప్పుడు సత్యభామ పప్పు ఈ పుస్తకాన్ని నాకోసం ప్రత్యేకంగా సంపాదించి పెట్టారు) ఇంగ్రిడ్ బెర్గ్‌మన్, షిర్లీ మాక్లయిన్, ఎలిజిబెత్ టేలర్ (హూ ఈజ్ ఎఫ్రైడ్ ఆఫ్ లిజ్ టేలర్?)లాంటివి ఎన్నో వచ్చాయి. టెన్ కమాండ్ మెంట్స్, బెన్‌హర్‌ల తర్వాత హాలీవుడ్ నటుడు చార్ల్‌టన్ హెస్టన్ "ది క్రానికల్స్" రాశాడు. డేవిడ్ నివెన్ "ది మూన్ ఈజె బెలూన్" అని స్వీయకథ రాశాడు. ట్వెంటీ సెంచరీ ఫాక్స్ అధినేత డెరిల్ జానక్ మీద "ది లాస్ట్ మొఘల్" (?) అని జీవిత చరిత్ర వచ్చింది. హాలీవుడ్ నటుల చరిత్రలూ, ఆత్మకథలూ రసవత్తరంగా, సినిమాల్లాగే వింత పోకడలతో, ఆసక్తికరంగా ఉండడమే వాటి రుచి. అంతకన్నా ఇంకేం మిగలదు.



సినిమాల స్థాయిని మించి - పేదరికాన్ని, దయనీయతనీ ఎదుర్కొని జీవితాన్ని ఓ ఛాలెంజిగా, జీవనాన్ని ఓ ఆదర్శం చేసిన అపూర్వమయిన స్ఫూర్తికుడు చార్లీచాప్లిన్. ఆయన ఆత్మకథ నాకు ప్రియమ్మైయిన పుస్తకాలలో ఒకటి. ఎన్నిసార్లు చదివానో చెప్పలేను. ఒక వ్యక్తి విజయానికి, ఆత్మవిశ్వాసానికీ, అనూహ్యమయిన కలల సాఫల్యానికి ఆ రచన ప్రతీక. ఆ చిన్ననాటి అనుభవాలు ఎవరూ కోరుకోనివీ, ఆయన విజయాలు అందరూ కలలు కనేవీను. "నేను చదువుకున్నాను. చదువు రావాలని కాదు. చదువులేని వారిపట్ల ప్రజల ఏహ్యత నుంచీ నన్ను నేను కాపాడుకోడానికి చదువుకున్నాను" - అంటాడు చాప్లిన్ ఒక చోట. కేవలం కులం కారణంగా ప్రజల ఏహ్యత నుంచీ తనను తాను కాపాడుకోవాలని పోరాటం సాగించిన అంబేద్కర్ గుర్తుకు వస్తాడు నాకు.

ఇక డయానా యువరాణి ప్రేమ వ్యవహారాల కథ, దోడీ ఫయాద్‌తో ఆమె చివరిక్షణాల వరకూ సాగిన కథనాలు - సాధారణంగా ఈ గొప్పవారి వంటవాళ్ళో, నౌఖర్లో వీధిన పడి రాస్తారు. పక్కవాడి బలహీనతల్ని తెలుసుకోవడంలాంటి సరదా - ఈ పుస్తకాలు మిగిల్చేది. వీటివల్ల పుణ్యం పురుషార్థం లేదు. 'దురద'ని గోక్కొని సుఖపడడం లాంటి వికారం తప్ప.

'ఆత్మకథ' అద్భుతమయిన స్థాయిలో ఆయా వ్యక్తుల పరిణితినీ, జీవితాన్నీ, జీవితాదర్శాన్నీ, కృషినీ, ఆనాటి జాతి చైతన్యాన్నీ, చరిత్రనీ - ఇన్నిటిని ఆపోశన పడుతుంది. మార్టిన్ లూథర్ కింగ్, నెల్సన్ మండేలా వంటి వారి నుంచీ ఎన్నో లక్షల మందిని ప్రభావితం చేసిన, కొన్ని తరాలకు మార్గదర్శకమయిన ఆత్మకథ మహాత్మాగాంధీది. "మై ఎక్స్పరిమెంట్ ఇన్ ట్రూత్" ఇప్పటికి ఎన్నిసార్లు పునర్ముద్రితమయిందో! ఓ వ్యక్తి వికాసాన్నీ, అపూర్వమయిన లక్ష్యసాధనకు తన జీవితాన్ని ఎలా ఆయుత్తం చేసుకున్నదీ, ఆ ప్రయత్నంలో

koumudi

తన లోటుపాటులను ఎరిగి ఎలా తనని తానే సంస్కరించుకున్నదీ - ఇది ఎందరో మహానుభావులకు భగవద్గీత. గొప్ప జీవితం కన్నా గొప్ప పాఠం ఉండదు. చిత్త శుద్ధితో, నిజాయితీతో తన జీవితాన్ని తానే ఆవిష్కరించడం కన్నా గొప్ప చరిత్ర ఉండదు. అలాగే నెహ్రూ 'డిస్కవరీ ఆఫ్ ఇండియా'' ఓ జిజ్ఞాసి అయిన దేశభక్తుని కథనం.

గొప్ప ఆత్మకథ చరిత్రని ఉటంకిస్తూ కూర్చోదు. ఆ జీవితం చరిత్రలో ఎలా భాగమయిందో చెపుతుంది. అదే చరిత్ర. ఈ మధ్య విడుదలయిన జస్వంత్‌సింగ్ ఆత్మకథ 'ఎ కాల్ టు ఆనర్' ఈ దేశ రాజకీయాల్ని విశ్లేషిస్తూ - తన జీవితాన్ని పడుగు పేకలుగా అల్లారు. ఆయన స్వతహాగా రాజకీయ నాయకుడు. ఆ నేపథ్య ఆయన రచనకి ప్రాణం. అయితే దీన్ని రెండో స్థానంలో ఉంచుతాను నేను. ఆయన లక్ష్యం తన జీవితంతో పాటు తను ఆకళించుకున్న రాజకీయ నేపథ్యాన్ని తన దృక్పథంతో విశ్లేషించడమే ఆయన లక్ష్యం. ఇక్కడ జీవిత కథ కేవలం శయ్య. ఇది ఆయా వర్గాలవారికీ, ఆయా రాజకీయ పార్టీలకీ, దేశాలవారికీ (ఆయన విదేశాంగ మంత్రిగా పనిచేశారు కనుక), అంతర్జాతీయ వర్గాల అవగాహనకు ఉపయోగిస్తుంది.




పి.వి.నరసింహారావుగారి 'ఇన్‌సైడర్' అన్ని దేశాలవారూ - అక్షరాల్ని కూడా విశ్లేషించి చదివారు. కొన్ని వేల కాపీలు అమ్ముడుపోయాయి. ఈ దేశ ప్రతిపక్ష నాయకులు ఎల్.కె.అద్వానీ ఈ మధ్యనే ప్రచురించిన ''మై కంట్రీ - మై లైఫ్'' అచ్చులో ఉండగానే 50 వేల కాపీలు అమ్ముడుపోయాయి. అబ్దుల్ కలాంగారు భారత రత్న అయాక రాసిన 'అన్ ది వింగ్స్ ఆఫ్ ఫైర్' అలాగే చెల్లుబాటయింది. రామేశ్వరంలో ఓ జాలరి కుటుంబానికి చెందిన వ్యక్తి ఈ దేశం గర్వించే భారత రత్న కావడం ఎవరికయినా ఆసక్తినీ, అందరికీ ఆదర్శంగా నిలిచే కథ.

koumudi

నేను కావాలనే జీవిత కథకీ, ఆత్మకథకీ ఉన్న పల్చని తెర చెరిపివేస్తున్నాను. కారణం - చాలా కథలు రాసే ప్రతిభ ఉన్న వారి కలం ద్వారా పలికినవి. కొన్ని ఆయా రచయితల అనుమతితో జీవిత చరిత్రలైనవి కనుక. వీటిని ఆథరైజ్డ్ బయోగ్రఫీలంటారు..

కళ్ళూ, నోరూ, చెవులూ లేని ఒకావిడ కేవలం ఆత్మబలంతో, దృఢమైన గుండె ధైర్యంతో తన జీవితాన్ని జీవన యోగ్యం చేసుకుని, తరతరాలకు ఎలా మార్గదర్శకమయిందో - హెలెన్ కెల్లర్ కథ చెపుతుంది, ఇవి జీవుని వేదనను ఆవిష్కరించే గొప్ప రచనలు.

ఇరాన్‌లో రాచరికపు దౌష్ట్యాన్ని గడిచి, అంతకంటే ఘోరమయిన ఛాందసపు శక్తులతో పోరాటంలో జైలు కెళ్ళి చివరకు నోబెల్ శాంతి బహుమతిని అందుకున్న ఇరాన్ మానవ హక్కుల సంఘ ప్రతినిధి షిరీన్ ఎబాడీ ఆత్మకథ 'ఇరాన్ ఎవేకనింగ్' అత్యంత ఆసక్తికరం. అలాగే పాకిస్థాన్ ముస్లిం లీగ్ సభ్యురాలు, మహిళా ఎంటర్ ప్రునార్స్ సమాఖ్య మొదటి అధ్యక్షురాలు సల్మా అహ్మద్ 'కటింగ్ ఫ్రీ' అనే ఆత్మకథ మరొక గొప్ప రచన. ఇందిరాగాంధీ నుంచీ ఆసిఫ్ జర్దారీ దాకా, భారత్ పాకిస్థాన్‌ల వేర్పాటు నుంచీ చేటి దాకా జరిగిన చరిత్రతో పెనవేసుకున్న ఓ మహిళ కథ అత్యంత ఉత్సాహభరితం.

పాకిస్తాన్‌లో ఒకానొక మారుమూల గ్రామంలో ఒక స్త్రీ మీద జరిగిన సామూహిక అత్యాచారం మిలటరీ ఆంక్షలను దాటి బయటికి వచ్చి ప్రపంచాన్ని దిగ్భ్రాంతం చేసింది. ఆ వ్యక్తి ముఖ్తార్ మాయ్ కథ(ఆత్మకథ) అన్ని దేశాలలోనూ ప్రాచుర్యాన్ని పొందింది. అలాగే వైట్ హౌస్ (అమెరికా)లో జరిగిన అవినీతి - మోనికా లెవిన్స్కీని ప్రపంచ ప్రఖ్యాత అవినీతిపరురాలిని చేసింది. ఒకే సన్నివేశం కారణంగా సిద్ధమైన ఈ కథలు (ఆత్మకథ)లయాయి. ఒకటి వ్యవస్థ అవినీతి. ఒకటి వ్యక్తి అవినీతి.

పక్కవాడి ఇంటి కిటికీలోంచి చూడడం ప్రతివాడినీ ఉత్సాహపరిచే 'దురద'. అయితే - తన గురించి తాను చెప్పుకోవడం ఇంకా గొప్ప 'దురద;'. తన గురించి గొప్పలు చెప్పుకోవడం, గొప్పగా చెప్పుకోవడం, గొప్పతనాన్నే చెప్పుకోవడం - ఇవన్నీ వ్యసనాలు. ఉదాత్తత,

పరిణితి ఉన్న వ్యక్తుల కథలు ఈ ప్రలోభాలకు లొంగవు. ఎమ్.సి.చాగ్లా 'ది రోజెస్ ఇన్ డిసెంబర్', ఫాలీ నారిమన్ ఆత్మకథలు ఆ ఉదాత్తతను సంతరించుకున్నవి. ప్రపంచ ప్రఖ్యాత రచయిత ఆర్.కె.నారాయణ్ 'మై డేస్', అలాగే ఆర్.కె.లక్ష్మణ్ స్వీయకథ 'అయ్యో, ఇంత చిన్న కథేనా?' అని చదివించే కథలు. పి.జి.వోడ్‌హౌస్ మీద రాబర్ట్ మెక్రమ్ అనే ఆయన దాదాపు 450 పేజీల గ్రంథాన్ని రచించాడు. రాజ్‌మోహన్ గాంధీ 'రాజాజీ, ఎ లైఫ్', ఎమ్మెస్ సుబ్బులక్ష్మి గురించి టి.జె.ఎస్. జార్జ్ రాసిన 'ఎ లైఫ్ ఇన్ మ్యూజిక్', ప్రముఖ పాత్రికేయుడు బి.జె వర్గీస్ రామ్‌నాథ్ గొయెంకా మీద రాసిన 'వారియర్ ఆఫ్ ది ఫోర్త్ ఎస్టేట్' హృద్యమయిన రచనలు.




ఓ పాతికేళ్ళ కిందట ఓ మిత్రుడు నాకు పరమహంస యోగానంద ఆత్మకథని ఇచ్చాడు. ఇంత చిన్న వయసులో యోగుల గొడవెందుకులే అని దాన్ని అలమరలో వదిలేశాను. దాదాపు రెండున్నర దశాబ్దాల తర్వాత వామ పక్ష భావాలకు ప్రతినిధిగా నిలిచే సుప్రీం కోర్టు న్యాయమూర్తి వి.ఆర్.కృష్ణయ్యర్ ఒక సందర్భంలో - గొప్ప ఆత్మకథల్లో ఒకటిగా పరమహంస యోగానంద 'ఆటోబయోగ్రఫీ ఆఫ్ ఎ యోగి'ని పేర్కొనడం ఆశ్చర్యాన్ని కలిగించింది. వెంటనే పుస్తకాన్ని వెదకబుచ్చుకుని చదివాను. లేదు. పుస్తకం ఈడ్చుకుపోయింది నన్ను. అంత అద్భుతమయిన అనుభవాల సంకలనం. పండిత్ తికాయత్ రాసిన వారి జీవిత చరిత్ర 'ది ఎలెవెంత్ అవర్' గొప్ప జీవితాన్ని ఆవిష్కరించే గొప్ప రచన.

ఇక తెలుగులో తొలి ఆత్మకథ ని రాసినది వీరేశలింగం పంతులుగారని చెపుతారు. ఆయనకి ప్రెస్సు ఉండడం వల్ల ముందుగా అచ్చయింది కానీ, ముందు రాసిన ఆత్మకథ ఆదిభట్ల నారాయణ దాసుగారి 'నా ఎరుక'. ఆ మాటని దాసుగారే రాశారు. దాసుగారు తన ఆత్మకథని 30 ఏళ్ళ వరకే చెప్పారు. ఎందుకని? కారణం ఆయనే చెప్పారు: "ఎవ్వని చరిత్రయైనను ముప్పదు యేండ్ల వరకే లోక మెరుగవలయును. ఆ పైని అనవసరము. ముప్పది యేండ్ల వరకే సుగుణముండును. ఆ పైన పేరాసయు అసంతుష్టియు పెచ్చు రేగిపోవును. దైవత్వము నశించును. దేవతలనందుకే త్రిదశులన్నారు. ముప్పది యేండ్లు దాటిన మీదట నందరు రాక్షసులే".




తెలుగు సాహిత్యంలో నన్ను ఊపి ఉర్రూతలూగించిన గ్రంథాలు శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రిగారి 'అనుభవాలు - జ్ఞాపకాలు' (మూడు సంపుటాలు). మరీ హృద్యమయిన కథలు ఆచంట జానకిరామ్‌గారి 'సాగుతున్న యాత్ర', 'నా స్మృతిపథంలో'. గురజాడ డైరీలు ఆయన ఆత్మకథని వ్రాయని కొరతని చాలామటుకు తీరుస్తాయి. నన్నురేడియో వేపు లాగిన ఏకైక వ్యక్తి ఆచంట జానకిరామ్‌గారయితే, ఏకైక రచన వారి సాగుతున్న యాత్రే.

దేవులపల్లి కృష్ణశాస్త్రిగారితో కలిసి పనిచేసిన అదృష్టవంతులలో నేనొకణ్ణి. ఆయన్ని ఆత్మకథ వ్రాయమని శత పోరేవాడిని. ఆయన బద్ధకాన్ని అందంగా అలంకరించుకున కవి. గొంతు మూగపోయినపుడు ఆయన వ్రాసినచిత్తు పుస్తకాలు ప్రచురించినా ఆయన ఆత్మకథకి ప్రత్యామ్నాయం కాగలదు. మిత్రులు బుజ్జాయిగారితో ఈ మాట పదే పదే అంటుంటాను.

koumudi

తెలుగు సాహిత్యానికి తీరని నష్టం - దాదాపు 80 పేజీలతో ఆగిపోయిన విశ్వనాథ సత్యనారాయణ గారి ఆత్మకథ. నేను ఎన్నిసార్లు చదివి, చదివిన ప్రతిసారీ ఎంతగా క్రుంగిపోతానో! ఒకసారి చదివాక విశ్వనాథ పావనిశాస్త్రికి ఫోన్ చేశాను. "నాన్నగారి మిగతా కథ వారి నోటి వెంటే విని రాసిపెట్టాను. అన్నీ కలిపి పుస్తకంగా ప్రచురిస్తాను" అన్నారు. కాని ఆ పని జరగకుండానే ఆయనా వెళ్ళిపోయారు.

చిత్తూరు నాగయ్యగారి ఆత్మకథ గొప్ప కనువిప్పు. మొదటి ముద్రణ ఇంటూరి వెంకటేశ్వరరావుగారు చేశారు. ఆపుస్తకం మీద




మొదటి పేజీలోనే నాగయ్యగారి మాటల్ని ముద్రించారు: "నా స్వీయ చరిత్ర ఇచ్చే సందేశం, నీతి ఏమిటంటే తనకు మాలిన ధర్మం కూడదని. సంపాదించిన దాంట్లో వెనక వేసుకోకుండా ఏ దానమూ, ఏ సహాయమూ ఎవరికీ చెయ్యకండి". తన జీవితంలో అవధులు మించిన వితరన ఎలా తనని వీధిన పడేసిందో చెప్పారు. తెలుగు దేశానికి మొదటి పద్మశ్రీ దక్షిణాదికంతటికీ అలనాటి సూపర్ స్టార్ ఇచ్చిన ఈ సందేశం కన్నా ఒక ఆత్మకథ చెయ్యగల ఉపకారం వేరే ఉండదు. ఒక మనిషి ఒకేసారి ఒకే జీవితాన్ని గడుపుతాడు. కానీ ఎన్నో జీవితాల సమాహారం ఆయా ఆత్మకథలు మనకు చేసే ఉపకారం.

ఓ నల్లకుర్రవాడు తెల్లవారి క్రూరత్వం, హేళన, దౌర్జన్యం నుంచీ తనని తాను కాపాడుకోడానికి (గమనించండి - చాప్లిన్ చదువుకీ, ఈ కుర్రాడి జీవికకీ పోలికలు) - కేవలం ఆత్మ రక్షణకి - ఎదురు తిరగడం, పోరాడడం నేర్చుకున్నాడు. ఆ కుర్రాడు మహమ్మదాలీ! ప్రపంచం గర్వపడే వస్తాదయ్యాడు. అతని ఆత్మకథ ఒక వ్యక్తి జీవించడానికి - కేవలం జీవించడానికి - చేసిన కృషికి పరాకాష్ట!

koumudi

మానవుడు సంఘజీవి. తన గురించి నిజాయితీ చెప్పే కథలో తనచుట్టూ ఉన్న సమాజపు కథా పరోక్షంగా ప్రతిఫలిసుంది. అందుకని ఆత్మకథ కేవలం చరిత్రకానక్కరలేదు. చరిత్రకు ఎలాగూ సాక్ష్యమవుతుంది కనుక.

పద్మభూషణ్ శ్రీపాద పినాకపాణిగారు ఆత్మకథ రాయడానికి నేను కారణమయినందుకు గర్వపడతాను. అపురూపమయిన మనోధర్మ సంగీతానికి ఆద్యులయి, తనదయిన బాణీని మరో తరానికి పంచిన వారి సంగీత ప్రస్థానంలో ఆనాటి స్ఫూర్తి ఆసక్తిదాయకం, సంగీత కళాభిషులకు కనువిప్పు.




మరికొన్ని గుర్తించుకోవలసినజీవిత కథలు. ఇవి ఆయా వ్యక్తుల ఆత్మల్ని అతి సునిశితంగా బేరీజు వెయ్యగలిగినవారు వ్రాసినవి. పుపుల్‌జయకర్ 'ఇందిరాగాంధీ', సర్వేపల్లి రాధాకృష్ణగారి మీద వారబ్బాయి సర్వేపల్లి గోపాల్ రాసిన పుస్తకం, 'రాజాజి: ఎ లైఫ్' రాజ్‌మోహన్ గాంధీ చక్కని జీవిత చిత్రణ. నర్గీస్ దత్, సునీల్ దత్‌ల కథ వాళ్ళమ్మాయిలు రాశారు. కడుపున పుట్టిన ఆడపిల్లలు అమ్మా నాన్నా గురించి చెప్పుకునే అందమైన మెలోడ్రామా. ఇంకా శ్రీశ్రీ 'అనంతం', కాళోజీ 'నాగొడవ' రాశిలో చిన్నవయినా వాసిలో గొప్పవి. గుమ్మడిగారు 'తీపి గురుతులు - చేదు అనుభవాలు' ఆయన జీవితంలో ఏరిన పూలు. కొన్ని ఆత్మకథలు 'ఏం చెప్పనక్కరలేదో' చెపుతాయి. ప్రముఖనటుడు దేవానంద్ తన ఆత్మకథని చాలా చోట్ల,చాలా మంది చేత ఆవిష్కరింపచేసారు. ఆయన 'ముద్దుల' ప్రహసనాలు - ఆయన రొమాన్స్ జీవితాన్నీ, ఆయన అందానికి ముగ్దులయిన అమ్మాయిలతో సరదాలనీ, సరసాలనీ చెప్పుకున్నాడు, అయితే ఆయననుంచీ ఆయన అభిమానులు అవే ఆశిస్తారేమో! వై.యస్.శాస్త్రిగారు పొట్టి శ్రీరాములు గురించీ, వారి ఆమరణ నిరాహార దీక్ష గురించీ, అలనాటి రాజకీయ కుతంత్రాల గురించీ - ఆ ఘట్టాలను అతి దగ్గరగా చూసినవాడిగా రాశారు. ఇది చరిత్రలో ప్రామాణికంగా నిలవగలిగిన గ్రంథం.

'ఆత్మకథ'లో వివాదాలు సహజం. అసందర్భమూ కాదు - కారణం రచయిత తన దృష్టి పరంగా చెపుతున్నాడు కనుక. విలువిద్యలో గురువుగారు లక్ష్యాన్ని చూడమన్నాడు. శిష్యుడు చెట్టుని చూస్తున్నాడు. చూపులో తేడా అది. ఆయా వ్యక్తుల అభిప్రాయ భేధాలే ఆయా వ్యక్తుల వ్యక్తిత్వాన్నీ, అవగాహననీ, ఆలోచననీ, సామరస్యాన్నీ వెలువరిస్తాయి. అదే ఆత్మకథ లక్ష్యం. లేకపోతే 'అతను' వ్రాయడం ఎందుకు? పీవీ గడుసు రచయిత. తన 'ఇన్‌సైడర్' కి చక్కని 'పాత్ర' ముసుగు తొడిగి 'వివాదం' నుంచీ తప్పించుకున్నారు. జస్వంత్‌సింగ్ సూటిగా చెప్పి వీధిన పడ్డారు. కొండొకచో పుస్తకాల అమ్మకానికి ఇది దగ్గర తోవ అని పెద్దలంటారు.

చాలామంది ఆత్మకథలు they are selling lives మరి కొన్ని telling lies నిజానికి అన్నీ - they should tell lives.

చెప్పే విషయంలో వైవిధ్యమూ, వైరుధ్యమూ పరోక్షంగా ఆ వ్యక్తి వ్యక్తిత్వానికే అద్దం పడతాయన్న విషయం గుర్తుంచుకుంటే - వంకర సమీక్షలూ రచయిత వ్యక్తిత్వాన్ని వెలువరిస్తాయి. లేకపోతే - చంద్రుడిని వర్ణిస్తూ అన్నమయ్య చెప్పినట్టు, ఆత్రేయ చెప్పినట్టు, అప్పలకొండ చెప్పినట్టు - అంటూ చెప్పుకోవడానికి ఆత్మకథ ఎందుకు?

చివరగా - నా ఆత్మకథ "అమ్మ కడుపు చల్లగా" గురించి. ఏ కారణాన మొదలెట్టానో 56 సంవత్సరాల క్రితం నుంచీ డైరీలు రాస్తున్నాను. ఒక్కసారి వెనక్కు తిరిగి చూసుకున్నప్పుడు రెండు మూడు తరాల మహానుభావులు, పెద్దలు, మిత్రుల సాంగత్యంలో విచిత్రమైన, విభిన్నమైన అనుభవాలు - నన్నూ, నా వ్యక్తిత్వాన్నీ మలిచినవీ, మెరుగుపరచిన సంఘటనలు - కోకొల్లలుగా కనిపించాయి. జీవితం ఎన్నో (లేదా అన్ని) మాధ్యమాల ద్వార ప్రయాణం చేసే అదృష్టవంతమైన మార్గాన్ని నిర్దేశించింది. రచయితగా, రేడియో ప్రసార కర్తగా, టీవీ యాంకర్‌గా, సినీ రచయితగా, నటుడిగా, వక్తగా, కాలమిస్టుగా, నవలా రచయితగా - 68 సంవత్సరాల సంఘటనల, అనుభవాల సమాహారం నా ఆత్మకథ - అమ్మ కడుపు చల్లగా. ముందు చెప్పినట్టు ఓ వ్యక్తి గొప్పదనం ఓ ఆత్మకథకి ఊతం అవుతుంది. ఒక్కొక్కప్పుడు ఆ వ్యక్తి విజయం కారణమవుతుంది. ఆ వ్యక్తి అనుభవాలు, అనుభూతులు - కేవలం ఆ ప్రస్థానమే ఆసక్తికరమయిన 'కథ' అవుతుంది. అది నాది. ఇందులో నా విజయం ఉంది. నా ఎదురు దెబ్బలున్నాయి. నా గుణ పాఠాలున్నాయి. నా మిత్రులున్నారు. ఈ తరం మహానుభావులున్నారు. వారి మధ్య - వారితో నేనూ ఉన్నాను. అహంకారంతో కాక అనుభవాల, సంఘటనల సమాహారంగా చెప్పిన నా కథ "అమ్మ కడుపు చల్లగా". పుస్తకం చదివి పక్కన పెట్టాక ఓ జీవిత కాలం ప్రయాణం చేస్తున్న ఓ జిజ్ఞాస, కళాకారుడు, పరిణామ శీలుడూ మీకు కనిపిస్తే - అది నేను.






koumudi






## మారుతికో నూలుపోగు

**- భువనచంద్ర (ప్రముఖ సినీ గీత రచయిత)**

హిమాలయాన్ని అద్దంలో చూపినట్టుగా 'జీవితాన్ని' 'అమ్మకడుపు చల్లగా' అనే ఆత్మకథలో చూపించే ప్రయత్నం చేశారు గొల్లపూడి మారుతిరావుగారు. 'ప్రయత్నం' అని ఎందుకన్నానంటే - అప్పుడే పుట్టిన ఓ 'పిల్ల'కాలువ అనేకానేక కాలువల్నీ నదుల్నీ తనలో కలుపుకుని ఓ మహాసాగరమై... మిగతా సముద్రాల్ని కూడా తనలో కలుపుకునే ప్రయత్నంలో ముందుకు సాగుతుంటే - ఆ దృశ్యాన్ని వర్ణించడం ఎవరి తరం?

ఆయన రచనల్ని చదివా. ఓ మహాపర్వతాన్ని చూసినట్లయింది. ఆయన ఆత్మకథ చదివా. అంత పెద్ద మహాపర్వతమూ ఓ చిన్న బొమ్మలో ఇమిడినట్లనిపించింది! 'అల్లాఉద్దీన్' భూతం... 'దీపం'లోకి దిగినట్టు! 'ఏడుపదులు' దాటిన జీవితాని ఓ బుల్లి మల్లెపందిరిగా మలచి మనని సేద తీరమంటున్నారు మారుతీరావుగారు. వల్లకాదే!

koumudi

'ఎందరెందరో మహానుభావుల్తో' పరిచయాలు మాత్రమే కాక ప్రగాఢ స్నేహాన్ని అనంతమైన జ్ఞానాన్నీ తను పొందుతూ, తను పొందిన స్వరాన్నీ సగర్వంగా ఇతరులకు 'అందిస్తూ' సాగిపోతున్న జీవితం మారుతీరావుగారిది.

జీవితం గనుక ఓ పుస్తకమైతే - ఆయన జీవితమనే పుస్తకంలో ప్రతి పేజీలోనూ అసంఖ్యాకమైన లబ్ధప్రతిష్ఠులున్నారు. ఓ పేజీలో రాష్ట్రపతులుంటే మరో పేజీలో ప్రధాన మంత్రులూ, ముఖ్యమంత్రులూ గవర్నర్లూ! ఓ పేజీలో ఎవరెస్టంత ఎత్తు ఎదిగిన నటులూ నటీమణులూ ఉంటే, ఇంకో పేజీలో ధ్రువతారల్లాంటి దిగ్దర్శకులూ కవులూ రచయితలూ గాయకులూ ఉన్నారు. ఓ పేజీలో విమర్శకులూ విశ్లేషకులూ ఉంటే మరో పేజీలో వీరాభిమానులూ, సామాన్యులూ ఉనారు. అధికార అనధికార గణాలూ, చిరునవ్వుల తొడుగులు తొడుకున్న తాచుపాములూ, లాలనతో దారితప్పే 'మనసు'ని సరైన దారిలోకి మళ్ళించిన హితులూ, స్నేహితులూ 'అమ్మకడుపు చల్లగా' ప్రతి పేజీలోనూ కనిపిస్తుంటారు.

కళ్ళని కటిపడేసే మోడ్రన్ పెయింటింగ్‌లా ఉంటుందీ ఆత్మకథ. 'అర్థం చేసుకుంటే లభించేది అనంతమైన ఆత్మానందం. ఇంతమంది జీవితాల్ని తనలో కలుపుకుని - తనలో ఇముడ్చుకుని సాగిపోతున్న మారుతీరావు అసలు సిసలు జీవితం అర్థంకావాలంటే, ఈ పుస్తకంలో వచ్చే ప్రతి వ్యక్తి జీవితమూ 'కాచి' వడపోయక తప్పదు. అప్పుడే మారుతీరావుగారి అసలైన 'వ్యక్తిత్వం' 'దీపం'లోంచి బయటపడ్డ భూతంలా ఇంతెత్తున ఎదిగి దేవత్తై 'నీకేంకావాలి?' అని మనని అడుగుతుంది. సరే! నేను అల్లా ఉద్దీన్‌ని కాను కదా? మరో మార్గమేదైనా ఉందా, అంటే - ఉంది.

1. ఆత్మకథ చదివే ముందు ఆయన రచనలన్నింటినీ శ్రద్ధగా చదవడం.

2. ఆయన రచనలన్నీ చదివాక ఆయన ఆత్మకథ చదవడం.

"అదంత అవసరమా?" అని మీరడిగితే 'నూటికి నూరుపాళ్ళూ' అవసరమేనంటా. ఎందుకంటే -

మహాత్మాగాంధీ ఆత్మకథ చదివితే ఆయన జీవితమూ, సత్యంతో ఆయన చేసిన ప్రయోగాలూ ఆనాటి దేశకాల రాజకీయ పరిస్థితులూ తెలుస్తాయి.

అబ్దుల్ కలాంగారి 'వింగ్స్ ఆఫ్ ఫైర్' చదివితే. రామేశ్వరంలో ఓ చిన్న ఇంట్లో జన్మించి నిరంతర పరిశ్రమతో ఆకాశంలోకి దూసుకెళ్ళిన ఓ సైంటిస్టు జీవితం కళ్ళముందు ఆవిష్కారమవుతుంది.

కానీ - 'అమ్మకడుపు చల్లగా' చదివితే, "ఊహూ.. ఈయన గురించి తెలుసుకోవాల్సింది చాలా చాలా ఉంది" అనిపిస్తుంది.

ఎందుకంటే - 'అమ్మకడుపు చల్లగా' అనే ఆత్మకథ కేవలం ఒక గొల్లపూడి మారుతీరావుది కాదు. ఒక నటుడు, ఒక ప్రయోక్త, ఓ కవి, ఓ రచయిత, ఓ భూవసుడు, ఓ ఉన్నతాధికారి, ఓ అహంభావిలాగా కనిపించే సింపుల్ మేన్, ఓ సింపుల్ మేన్‌లాగా కనిపించే అపరిమిత ప్రజ్ఞాశాలి, ఓ నిరంతర యాత్రికుడు, ఓ నిరంతరాన్వేషి, ఓ కాలమిస్టు, ఓ దర్శకుడు - అన్నిటినీ మించి - తనని తనే విమర్శించుకునే అసామాన్యుడు, ఓ స్వాప్నికుడు, ఓ స్నేహితుడు, సంపూర్ణ జీవితాన్ని 'సుఖం'గా అనుభవించిన అదృష్టవంతుడు - ఇందరు మారుతీరావుల సంగమమే ఈ 'అమ్మకడుపు చల్లగా'. "ఇందులో ఏముంది? చదివితే ఏం లాభం?" అంటారా? చాలా చాలా లాభం ఉంది.

ఓ సామాన్య బ్రాహ్మణ బాలుడి జీవితం ఎలా మొదలైందో ఎలా ఉంటుందో ఇది చదివి మీ మనసులో చిత్రించుకోవచ్చు! ఓ నిస్సహాయురాలైన అమ్మ తన ఒడుగుని ఎంత గుట్టుగా, ఎంత పొదుపుగా ఎంత హృద్యంగా నెరవేర్చిందో తెలుసుకుని కళ్ళారా ఆనందాశ్రువుల్ని రాల్చుకోవచ్చు!

ఓ బాలుడు చిన్నతనంలోనే పద్యాల్ని ఎలా 'అల్ల'గలిగాడో -

పసితనంలోనే తన ఊహాశక్తిని ఎలా పెంచుకోగలిగాడో -

కంటిముందు కనిపించే వాస్తవాల్ని ఎంత ప్రజ్ఞతో కథలుగా నాటికలుగా నాటకాలుగా ఎలా మలిచాడో -

'మహా'నటుల 'నటన'కి అక్షరతూణీరాల్ని అందించడమే కాక తనలో ప్రజ్వరిల్లే 'జ్వాల'ని ఎన్ని వైపులకి విస్తరింపజేసాడో -

వామనుడిలా పుట్టీ సాహితీ గగనాన్ని ఎలా ఆక్రమించగలిగాడో -

అన్నిటినీ - అంతటినీ - మనో దృష్టితో చూసి ఆయన అనుభవసారాన్ని ఆస్వాదించవచ్చు. ఆనందించవచ్చు. బ్రహ్మానందం కంటే పదివేల రెట్లు గొప్పదయిన 'పరమానందా'న్ని దాటి - అంతకంటే కోటి రెట్లు ఎక్కువైన 'రసా'నందాన్ని దోసిళ్ళతో మనసారా గ్రోలవచ్చు.

ఇందాక అన్నట్లు - గొల్లపూడి వారి అసలు సిసలు జీవితాన్నీ వ్యక్తిత్వాన్నీ తెలుసుకోవాలంటే ఆయన రచనల్ని సంపూర్ణంగా చదవక తప్పదు! అవన్నీ చదివి ఆయన ఆత్మకథని చదివితే ఆయన్ని 'చూడటమే' ఓ మహాభాగ్యమవుతుంది.

'ఆత్మకథ' చదివాక ఆయన రచనలన్నింటినీ చదివితే - ఆయన జీవితమే మనదౌతుంది. మనల్ని ముందుకు నడిపిస్తుంది. మన జీవితాన్ని మన ఇష్టం వచ్చినట్టు 'నిర్భయంగా' మలుచుకోవడానికి వలసిన 'స్ఫూర్తి'నీ 'ధైర్యాన్నీ'నిస్సందేహంగా ఇస్తుంది. ఇదో గంగా ప్రవాహం. ప్రకృతిని సృష్టించే ముందు పరమేశ్వరుడు చేసిన 'ప్రణయ తాండవం.'

చదువరీ --ఇది సత్యం

ఈ 'అమ్మ కడుపు చల్లగా' చదివినందుకు థాంక్స్ చెప్పాల్సింది మనుషులకి కాదు.. సాహిత్య సంగీత సరస్వతికి! ముమ్మాటికీ ఇది నిజం ..!

koumudi

ప్రత్యేకంగా

నేను కంటితో చూడని 'వాసూ'కి -

ఈ ఉత్తరం నీకు అందాలంటే నేను పైకి రావాలి..! లేదా నువ్వే మా మధ్యకి మళ్ళీ రావాలి.

నాయనా... 'చెట్టంత' కొడుకు 'సముద్రం' పాలయితే.. ఎన్ని కన్నీటి సముద్రాలింకిపోయాయో వారి కళ్ళల్లో!

ఆఖరికి 'బెంజి' కూడా 'బెంగ' పెట్టుకుని నీకోసం ఏడ్చి ఏడ్చి నీవెళ్ళిన దారిలోనే తనూ పయనించిందంటే -

ఎంత ప్రేమని లోకానికి పంచావయ్యా నువ్వు!

అక్కడితో ఆగలేదే!

'బిడ్డకి' తలకొరివి పెట్టే అనంత 'దుఃఖ' సామ్రాజ్యానికి మీ తండ్రిని 'చక్రవర్తి'ని చేశావు కదయ్యా!

పుణ్యం చేసి ఉంటావు...! అందుకే పుడమి రుణం తీర్చుకుని 'పురుషోత్తముడిని' వెతుక్కుంటూ వెళ్ళిపోయావు.

కానీ బాబూ -

మీ నాన్న ఉన్నాడే ఆయన మహా దుర్మార్గుడు!

ఆత్మకథలో ' నీకోసమే ఓ పేజీ' రాసి తను మౌనంగా ఏడుస్తూ అందరినీ 'బావుర'మని ఏడిపించాడు!

"అయ్యో. ఆ వాసూని ఒక్కసారైనా కలవలేకపోయామే" అనే దుఃఖం ప్రతి పాఠకుడికీ కలిగించాడు! అంతేకాదు. షాజహాన్ 'తాజ్‌మహల్' కట్టి ముతాజ్‌ని 'అమరం'గావించినట్లుగా శ్రీనివాస్ అవార్డుని ఏర్పరచి నిన్ను చిరంజీవిని చేశాడు.

'చిరంజీవీ! నువ్వు అందరి గుండెల్లోనూ చిరస్థాయిగా ఉంటావు--సినీ పరిశ్రమ ఉన్నంతకాలం! ఇది నిజం..!

ఆశీశ్శులతో, అశ్రువులతో - భువనచంద్ర.

koumudi

ఏప్రిల్ 2008 లో ఇండియాలో విడదలైన శ్రీ గొల్లపూడి మారుతి రావు గారి ఆత్మకథ 'అమ్మకడుపు చల్లగా' అమెరికాలోని అనేక ప్రధాన నగరాల్లో ఆవిష్కరించబడుతోంది. జూన్ 29 , ఆదివారం అట్లాంటా నగరంలో ఆవిష్కరించబడింది. న్యూజెర్సీ లో జరగనున్న ఆటా మహా సభల్లో జులై 4 వ తేదీన ఆవిష్కరించబడుతోంది. జూలై 12న డల్లస్ లోనూ, జూలై 19న సిలికాన్ వేలీలోనూ, జూలై 26న లాస్ ఏంజల్స్‌లోనూ ఈ పుస్తకావిష్కరణ సభలు జరగబోతున్నాయి. సభా వేదిక, సమయం వగైరా వివరాలు 'కౌముది' వెబ్ సైట్లో ఎప్పటికప్పుడు అప్‌డేట్ చెయ్యబడతాయి. ఈ పుస్తకం కాపీలు ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని ప్రధాన పుస్తక విక్రయకేంద్రాలలోనూ లభిస్తున్నాయి. లేదా క్రింది చిరునామాని సంప్రదించవచ్చు.

**కళాతపస్వి క్రియేషన్స్, 'లలితా మహల్', 10 / 7 ఎ, అన్నై సత్యనగర్, మెయిన్ రోడ్, రామాపురం, చెన్నై - 600 089, ఫోన్: 044-2249 1939 లేదా క్రియేటివ్ లింక్స్, 1-8-725 / ఎ / 1, 103 సి, బాలాజీ భాగ్యనగర్ ఎపార్ట్‌మెంట్స్, నల్లకుంట, హైదరాబాద్ - 500 044, ఫోన్స్: 98480 65658, 98485 06964**

పుస్తకం పేజీలు: 500 మరియూ వందలాది ఫోటోల పేజీలు అదనం, వెల: రూ. 400

అమెరికాలో ఈ పుస్తకం ప్రతులకోసం మాకు వ్రాయండి edior@koumudi.net వెల: $35 (పోస్టేజీ అదనం)

ఈ పుస్తకం నుంచీ ఒక అధ్యాయాన్ని 'కౌముది' పాఠకులకోసం రచయిత ప్రత్యేక అనుమతితో క్రింద ప్రచురిస్తున్నాం

# సాయంకాలమైంది

## 'అమ్మకడుపు' చల్లగా లో ఒక అధ్యాయం



**విశాఖపట్నంలో** మా ఇంటికి దగ్గర్లోనే ఒకాయన ఉండేవారు. ఈయన పేరు విష్ణుభట్ల నరసింహశాస్త్రి. పోస్టుమాస్టరుగా పనిచేసి రిటైరయారు. ఆయన వయస్సు అప్పటికి 80. నిండు కుండ. క్లుప్తంగా మాట్లాడేవారు. ఏ అనుభూతికీ లొంగక, ఏ కష్టానికీ వొంగక - ప్రతిసారీ చిన్న చిరునవ్వుతో సమాధానం చెప్పేవారు. మనిషి గంభీరం, ఆయనకి ఒకే ఒక్క కూతురు. నేను చదువుకునే రోజుల్లో - యూనివర్సిటీలో 'మేథమెటికల్ ఫిజిక్స్' డిపార్ట్‌మెంటులో నా కన్న ఒక సంవత్సరం జూనియర్. ఆ రోజుల్లో ఆ విషయాన్ని చదివిన వాళ్ళే తక్కువ. ఆ అమ్మాయి చాలా తెలివయినదయి ఉండాలి. తరువాత ఆనర్స్ పట్టా పుచ్చుకుని, ఎమ్మెస్సీ చదివి - మరేవో పట్టాలు పుచ్చుకుని - అమెరికాలో ఉద్యోగం సంపాదించుకుంది. పెళ్ళయింది. ఇద్దరు మగపిల్లలు. దాదాపు పాతికేళ్ళ తరువాత - నేను న్యూయార్కులో నాటక ప్రదర్శన ఇచ్చినప్పుడు ఆవిడా, భర్తా వచ్చారు. మరునాడు న్యూయార్కు అంతా తిప్పి చూపిస్తామన్నారు. మరెవరో ఆ పని చెయ్యడం వల్ల ఆమెనక్కడ మళ్ళీ కలుసుకోలేదు. ఆమె పేరు శ్యామల.

శాస్త్రిగారికి శ్యామల ఒకే ఒక్క కూతురు. భార్య వీణ వాయిస్తారు - రేడియో ఆర్టిస్ట్ ఒకప్పుడు. (మల్లాది సచ్చిదానంద మూర్తిగారికి పిల్లనిచ్చిన మామగారికి స్వయాన అక్క) ఇప్పుడు అనారోగ్యంతో మంచమెక్కారు. ఏ మూడు నాలుగేళ్ళకో అమ్మాయి అమెరికా నుంచి వస్తుంది. రెండు మూడు వారాలుంటుంది. తల్లితండ్రులకు అక్కరలేని బహుమతులు తెస్తుంది. మూడేళ్ళ ఎడబాటులో నష్టపోయిన ప్రేమంతా మూడు వారాలకు కుదించాలని ప్రయత్నిస్తుంది. తర్వాత ఎయిర్‌పోర్ట్‌లో వెళ్ళలేక భోరుమని ఏడుస్తుంది. అయినా వెళ్ళిపోతుంది.

koumudi

అమ్మాయితో మాట్లాడాలని ఆయన ప్రతీ ఆదివారం మా ఇంటికి వచ్చేవాడు. మా ఇంట్లో ఫోన్ ఉంది. ఇక్కడికి ఫోన్ వచ్చేది. భార్య రాలేదు. కనక తల్లితో ఆమెకి మాట్లాడే ఆస్కారం లేదు. గంట సేపు కూర్చుని - అరగంట మాట్లాడి వెళ్ళేవారు. ఏం మాటలు? నీ ఆరోగ్యం ఎలా ఉంది? అమ్మ ఎలా ఉంది? ఫాన్ బాగుచేయించావా? చంటాడికి పరీక్షల్లో మంచి మార్కులొచ్చాయి. పాత టయోటా అమ్మేశాం - ఇవన్నీ ఎదురుగా ఉంటే అక్కరలేని, అర్థంలేని 'సొల్లు' కబుర్లు. ఎదురుగా ఇంట్లో ఉన్న తండ్రితో "ఫాన్ బాగుచేయించావా?" అంటామా?

ఒక్కోవారం ఫోన్ కాల్ వచ్చేది కాదు. "బిజీగా ఉందేమో?" అని నవ్వుకుని వెళ్ళిపోయేవారు. చిన్నగా అడుగులు వేసుకుంటూ - బజారుకి వెళ్ళి కూర కొనుక్కొచ్చేవారు. ఏవో సామాన్లు తెచ్చేవారు. సాధ్యమైతే భార్య వంట చేసేది. లేకపోతే తను చేసేవాడు. పేదవాడు కాదు. ఏమయినా పేదరికం ఆర్థికంగా కాదు - మానసికంగా. ఎట్టకేలకు వారిని అమెరికా రప్పించాలని ఆమె ప్రయత్నించింది. మా కాలనీలో అతి చక్కని ఇంటిని అమ్మేశారు. తీరా ఆ వయస్సులో 'వీసా' ఇవ్వమన్నారు. అమెరికా వెళ్ళడం ఆగిపోయింది. ఇప్పుడు ఇల్లు లేదు. ఏదో ఇంట్లో అద్దెకున్నారు. అమెరికా మనవలకి తెలుగురాదు. "ఏమిటో మాట్లాడతారు. నాకర్థం కాదు" అంటారాయన.

"మీ అమ్మాయి మీద కోపం రాదా?"

"ఎందుకు? ఆమె ఏం తప్పు చేసింది? ఆమె బతుకు ఆమె బతుకుతోంది"

"జీవితం మీద విరక్తి రాదా?"

"ఎందుకూ? బాగానే ఉందిగా!"

"ఏమిటీ బ్రతుకు అనిపించదా?"

"ఎవరి బ్రతుకు ఎవరు నిర్ణయిస్తారు?" నవ్వుతారాయన. ఆ నవ్వు అన్నిటికీ అద్భుతమయిన సమాధానం. నిర్మలమయిన, నిష్కల్మషమైన నవ్వు. ఈ నిర్వేదం, ఎవరినీ ప్రశ్నించని నిరామయత - అన్నిటికీ చిన్న 'చిరునవ్వు' - అపూర్వం. ఆయన జిడ్డు కృష్ణమూర్తి వేదాంతాన్ని వంటబట్టించుకున్నారు. వివేకానంద, రామకృష్ణ పరమహంస, శారదా దేవి భక్తులు. శారదాదేవి స్తుతిని సంస్కృతంలో రాశారు.

భార్య అనారోగ్యంతోనే కన్ను మూసింది. కూతురు పరామర్శకు వచ్చింది. తర్వాత ఆయన కాలు విరిగింది. ఆదుకునేవారు లేక వృద్ధాశ్రమంలో చేరారు. దరమిలాను - శ్యామల భర్త పోయాడు.

శాస్త్రిగారు తన భార్య పేరిట - ఏటా ఒక సంగీత కచేరీ జరిపిస్తారు. ఆ కచేరీలో నా పక్కన కూర్చుంటే - మాటల్లో ఆయన కళ్ళు చెమ్మగిల్లడం - ఒక్కసారే చూశాను. కచేరీ ప్రారంభమయింది. అంతలో మాయమయారు.

జీవితంలో ఏ దురదృష్టానికీ - ఎవరినీ ప్రశ్నించక, ఎవరినీ తప్పుపట్టక, క్రుంగిపోక, బుద్ధిమంతుడయిన విశ్వాసపాత్రుడయిన 'నౌకరు'లాగ జీవితాన్ని, భయభక్తులతో నడుపుకొస్తున్న పథికుడు. ఇప్పుడు నడకలో వేగం తగ్గింది. కాలు విరిగాక మంచం దిగే అవకాశం తగ్గింది. అయినా ఆయన ముఖంలో చిరునవ్వు పోలేదు. శాస్త్రిగారిని చూస్తే భగవద్గీతలో "స్థితప్రజ్ఞుడు" జ్ఞాపకం వస్తాడు.

(శాస్త్రిగారు తన 92 వపేట వృద్ధాశ్రమంలోనే కన్నుమూశారు. అంతిమకాలంలో వారం రోజులు పక్షవాతం వచ్చింది. కూతురు పక్కనే ఉంది.)

శాస్త్రిగారి స్ఫూర్తితోనే - ఓ నవల ప్రారంభించాను. నా "సాయంకాలమయింది" నవలలో సుభద్రాచార్యులు శాస్త్రిగారే. నేను నవల బాగా రాశానని చాలామంది మెచ్చుకున్నారు. చాలా కితాబులు వచ్చాయి. కానీ చాలా గొప్ప జీవితం గురించి రాశాను - ఆ జీవితాన్ని అవగాహన చేసుకుంటే - వ్రాయడం కష్టం కాదు. ఆయన జీవితంలో విలన్లు లేరు - ఎవరినీ నిందించాల్సిన పనిలేదు. ఆయన భార్య? ఆమె నాకు ఎక్కువగ తెలియదు. నా నవలలో ఆ పాత్ర నాది - వరదమ్మ. ఆ పాత్ర వైభవానికి సామంజస్యానికి ఆనందం అంతా నాదే.

koumudi

ఈ దశలో ఇద్దర్ని మాత్రం ఉటంకిస్తాను - నా నవల చదివి - మిత్రులు జగ్గయ్యగారు సుదీర్ఘమైన ఉత్తరం రాశారు. (మద్రాసులోనే)

"సంప్రదాయంలో ఉదాత్తకు ప్రతిరూపం సుభద్రాచార్యులవారు - వరదమ్మలో మా అమ్మ కనిపించింది..."

మిత్రులు, రచయిత ఎమ్.రామకోటిగారు - నవల చదివి కిందపెడుతూనే ఆవేశంగా ఫోన్ చేశారు. "అలాంటి నవల రాసినందుకు greatful thanks – it is a great poem.... మా అమ్మ ఉంటే ఈ నవల చదివి మీకు సన్మానం చేసేది"

హృదయంలో ఆర్తిని స్పృశించే క్షణాలివి - ఆయా పాఠకుల్ని. ఈ దశలో నా మరో సాధన - నవల "సాయంకాలమైంది".

ఆంధ్రప్రభ వారపత్రిక ఎడిటర్ వల్లూరి రాఘవరావుగారు మరో నవల వ్రాయమన్నప్పుడు - 'సాయంకాలమయింది' మనస్సులో క్రమంగా రూపుదిద్దుకుంది. నవల సొంతం రాసి ప్రచురణకి పంపే ఓపికా, తీరుబాటూ పోయింది. కాగా వ్రాసి సంపాదకుల అనుమతిని ఆశించే అలవాటు పోయింది. ఆ రోజుల్లోనే యువ విశ్వనాథ రెడ్డిగారూ, జ్యోతి రాఘవయ్యగారూ, ఆంధ్రజ్యోతి పురాణంగారూ - అడిగి రాయించిన సందర్భాలే ఎక్కువ. మనస్సులో ఏ ప్రక్రియకయినా ఆలోచనకి రూపం ఇవ్వడం అవసరం తోసుకొచ్చినప్పుడే

వల్లూరి రాఘవగారు ఒక విధంగా నాకు భక్తుడు. నా మొదటి అధ్యాయాన్ని హైదరాబాదులో నా ఫ్లాట్‌లో చదివి వినిపించి చేతికిస్తే - ఆనందంతో పొంగిపోయి, పాదాభివందనం చేసి తీసుకెళ్ళారు. ప్రచురణ ప్రారంభించాక - 2001 సంక్రాంతి తర్వాత రాఘవరావు ఫోన్ చేశారు. "మా పాఠకులకు అద్భుతమైన నూతన సంవత్సరం, సంక్రాంతి కానుక ఇచ్చారు. మా జన్మ ధన్యమయింది. వెబ్‌సైట్‌లో రీడర్‌షిప్ కొన్ని వేలు పెరిగింది" అని మురిసిపోయాడు. అదొక స్ఫూర్తి. పాఠకులు మనతోనే నడుస్తున్నారంటే - కలం -

ఎదురుగ్గా కూర్చున్న ప్రేక్షకుడిని ఉద్దేశించినట్టు గళం విప్పుతుంది. ఇది వేరుగా కూర్చుని రాసే రచనలో నష్టపోయే rapport. ఇది అందరికీ కుదిరేది కాదేమో. పత్రికలో పని చేసినవాడిగా నాకు అనువయిన అవకాశం.

"సాయంకాలమైంది" నవలకి నేను ఊహించని వ్యక్తుల నుంచీ, నేను ఊహించనంత స్పందన వచ్చింది. ఇక వారం, వారం పాఠకుల 'ఆనందం' సరేసరి. కొందరు మహానుభావుల స్పందన కేవల ఆ రచన మంచి చెడ్డలకే కాక ఆ వ్యక్తుల సంస్కారాన్నీ, సాహిత్యపు పరిధిల్నీ - చెప్పక చెపుతుంది. నా నవల గురించి గొప్పలు చెప్పడం ఉద్దేశం కాదు కాని - కొన్నయినా ఇక్కడ ఉటంకించకపోతే - నా కథ - నా కథకి సంబంధించిన కథా అసంపూర్ణమవుతుంది.



ముగ్గురు సాహితీపరులు - విచిత్రంగా ఈ నవలని చదువుతూ విశ్వనాథ "వేయిపడగలు" గుర్తుచేసుకున్నారు. "తొందరపడి ముగించారు కానీ మరికాస్త సమగ్రంగా నడిస్తే - మరో 'వేయిపడగలు' అయేది" అన్నారు ఓ పాఠకుడు. - హైదరాబాదు చిక్కడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో తారసపడి. ఆయన పేరు తెలియదు.

"In the entire gamut of Telugu Literature. Only two novels made me sit and read with out caring for food or sleep.. without a wink… and at a strech…one is "Veyipadagalu" of Kavisamrat Viswanatha and the other is "Sayamkalamaindi" of Sri Gollapudi Maruthi Rao…" అని రాశారు డాక్టర్ పప్పు వేణుగోపాలరావు.

నా నవల చదివాక - మనిషిని పంపించి నా ఫోన్ నెంబరు వ్రాయించుకు తీసుకువెళ్ళి - ఫోన్‌లో పదిహేను నిముషాలు మాట్లాడారు మిత్రులు. పద్మశ్రీ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్‌గారు. "చిన్నప్పుడు పిచ్చెక్కినట్టు విశ్వనాథ "వేయిపడగలు" చదివేవాడిని - చుట్టుపక్కల ప్రపంచాన్ని పట్టించుకోకుండా. మళ్ళీ మీ నవల అలా చదివాను" అన్నారు. "మా ఆవిడ చేతా చదివించాను. మా అబ్బాయి అమెరికాలో ఉన్నాడు కదా!" అన్నారు.

అలాగే ఈ 'ఆత్మకథ' వ్రాయాలనుకున్నాను. కానీ ఎంత నిడివి సాగుతుందో, ఎన్ని వారాలు ప్రచురించాలో నేను చెప్పలేని కారణంగా కొందరు ప్రచురించలేకపోయారు. ప్రచురించలేకపోయినందుకు - క్షమాపణలతో కంటతడి పెట్టుకున్న ఆర్ద్రమయిన, అభిమాని అయిన "సంపాదకురాలు" ఒకరున్నారు. పేరు అనవసరం. కాగా, ధారావాహికంగా ప్రచురణ అవుతుండగా 'ఆత్మకథ' వ్రాయడమూ మంచిది కాదనిపించింది. చదవరుల స్పందన జీవితాన్ని ఆవిష్కరించే రచనని ప్రభావితం చెయ్యరాదు. ఆత్మకథ రచయిత కూడా - తన జీవితంలోంచి బయటికి వచ్చి చెప్పగలగాలి - లేకపోతే రచన "స్వగతం" అవుతుంది. స్వగతాన్ని వ్యక్తి ఆవేశం ఎంతో కొంత 'మలిన' పరుస్తుంది అన్నాడొక రచయిత "Talking Lives" అనే పుస్తకంలో.

అనుకోని, ఊహించని ఉత్తరం పత్రికాధిపతి, సాహితీవేత్త, కృష్ణాపత్రికని మళ్ళీ బ్రతికించిన వ్యక్తి శ్రీ పిరాట్ల వెంకటేశ్వర్లు గారి దగ్గర్నుంచి. "సాయంకాలమైంది అన్న మీ నవలకు వరంగల్ 'సహృదయ' సంస్థ వారు బహుమతినీయడానికి ప్రేరకుడైన "ద్విశతావధాని" కవితాప్రసాద్ నన్ను కూడా చదవమని చెప్పారు. నేను పుస్తకం కొని చదవడం ప్రారంభించినప్పటి నుంచీ పూర్తయ్యేంతవరకూ నా మనస్సులో గల ఆర్ద్రత నన్ను ఆగనీయలేదు. కళ్ళు నా మాట వినలేదు. గంగా, కావేరీ నదులను ప్రవహింపజేసాయి. నేను నా ఈ జీవితంలో అనేక పుస్తకాలను చదివాను. వేయిపడగలను నా చిన్నప్పుడు కంఠస్తం చేయడానికి ప్రయత్నించాను. కానీ మీ నవల నన్ను పులికితుడిని చేసింది. ధన్యుడిని చేసింది. ఇంతటి రచయితకు సమకాలీకుడవడం నా పూర్వ పుణ్యమని భావిస్తున్నాను."

koumudi

అయితే "వేయిపడగలు" విశ్వనాథవారి తొలి రచనలలో ఒకటి. కల్పవృక్షం నాటికి వారు మేరు శృంగమంత ఎత్తయిన సాహితీ మూర్తి. నా నవల "వేయిపడగలు"ని గుర్తు చెయ్యడమే నా అదృష్టం.

వి.ఎ.కె.రంగారావుగారు నవల చదివి ఉత్తరం రాశారు. "శ్రీ మల్లాది రామకృష్ణ శాస్త్రిగారి రచనలు - కథ, పెద్ద కథ. నవలిక, గల్పిక, పాట, యక్షగానం, కావ్యోపోద్ఘాతం - నాకు చిన్నప్పట్నుంచీ, చదివినప్పటి నుంచీ కొలమానాలు... నా మల్లాది కొలమానాలు గొల్లపూడి మారుతిరావు వ్రాసిన 'సాయంకాలమైంది' నవలను కొలవరావు, కొలవలేవు. ఆ కొలబద్దలను మించిన వాటితో నేను చదివిన మొదటి నవల. కాలం గమనాన్ని (ఎవరూ) ఆపలేడు, మార్చలేడు, పిసరయినా దిద్దలేడు ఎవడూ! సర్దుబాటు ధోరణిలో సరిపెట్టుకోవడం తప్ప... ఒక్క విచిత్రం. ఆ కలాన్ని, ఆ నిరంకుశ, నిరంతర, నిశ్చయ ప్రవాహాన్ని ఈ "సాయంకాలమైంది"తో గొల్లపూడి మారుతీరావు జయించాడు. "

పెద్దలు శాస్త్రిగారి స్ఫురణ నా నవల చేసుకున్న పుణ్యం.

సాయంకాలమైంది నవలకు "సహృదయ" అనే వరంగల్ సంస్థ ఒద్దిరాజు కవుల పేరిట ఇచ్చిన పురస్కారం దక్కింది. ఆ రోజు ప్రొఫెసర్ మొదలి నాగభూషణ శర్మ ప్రధాన వక్త. "ఇది ఈ దశాబ్దపు నవల. టీచర్‌గా సాధారణంగా ఏదో లోపం వెదకడం అలవాటు. కానీ ఈ నవలని 14 సార్లు చదివాను. ఒక్కటీ కనిపించలేదు. సీరియల్ చదువుతూ మా ఆవిడ ఓ రాత్రి ఏడుస్తోంది. నేనెన్నిసార్లు చదివినా నా కళ్ళు చెమ్మగిల్లి ఎవరయినా చూస్తున్నారేమో అని చుట్టూ చూస్తాను. ఇవాళ రైల్లోనూ అదే జరిగింది"అన్నారు.

మిత్రుడు, నిర్మాత మురారి - మనిషి మొరటు, మనస్సు ఆర్ద్రం. ఎదుటి వ్యక్తిని నొప్పించకుండా నాలుగు వాక్యాలు మాట్లాడలేడు. కానీ గొప్ప సాహితీస్ఫూర్తి ఉన్న 'విద్యార్థి' ఇప్పటికీ. నవల చదివి అతనో ఉత్తరం రాడాడు. అంతా ఎందుకు? "...........ఎన్నాళ్ళకు ఎంత మంచి పుస్తకం చదువుతున్నాను .... మారుతున్న కాలంలో మంచి నీటి చెలమలాగుంది... ఇక చివరి మాట... మొదట్లో గెడ్డ పెరుగు పెట్టి మీగడ అందించి, చివర్లో యోగర్టు అందించారు."



ఈ నవలకి తెలుగు విశ్వవిద్యాలయం ఉత్తమ నవల బహుమతినిచ్చింది. యూనివర్శిటీ రిజిస్ట్రార్ వై.చెన్నయ్యగారు తరువాత ఈ నవల చదివి పెద్ద ఉత్తరం రాడారు. "... తెలుగు నవలా చరిత్రలో క్లాసిక్స్ కోవకు చెందుతుంది. ఏమి నవల అది! విశ్వనాథ వారి "వేయిపడగలు", అడివి బాపిరాజుగారి 'నారాయణరావు' చదివిన దృష్టితో విశ్లేషించుకుంటే ఇన్నాళ్ళకు మళ్ళీ అంత నవల ఇది అని తోస్తుంది... నాకు బాగా నచ్చిన పాత్ర వెంకటాచలం. దీన్ని సినిమాగా తీస్తే ఆ వెంకటాచలం పాత్రకు మీరు చక్కగా సరిపోతారు. తెలుగు నవల స్తబ్దతతో కొట్టుమిట్టాడుతున్న తరుణంలో గొప్ప ఆశ... మీ 'సాయంకాలమైంది'. సంప్రదాయానికి సాయంకాలమవుతున్న నవలకు శుభోదయమే ఇది..."

మల్లాది రామకృష్ణశాస్త్రిగారిని గుర్తుచేసుకున్న మరొక సాహితీ మిత్రులున్నారు.. శ్రీ జగ్గయ్యగారు. "నేను పాతతరంతోనూ, కొత్త తరంతోనూ అనుభవం ఉన్న నడిమితరం వాణ్ణి కావడం చేతనోమో, అక్కడక్కడా కన్నీరు కూడా కార్పించింది. I was really overwhelmed! శ్రీ వైష్ణవ సంప్రదాయ నేపథ్యం కథకెంతో నిండుదనం చేకూర్చింది. మల్లాది రామకృష్ణశాస్త్రిగారి రచనల్లో వైష్ణవం రుచి చూచిన వాణ్ణి నేను. మీ చేతిలో అది మరింత పరిమళించింది - పవిత్రత పంచింది. A thousand compliments to you on your accomplishment" అంటూ ఈ నవలకి అనుబంధంగా - ఈ నవలను basic structure గా తీసుకుని - ఇంకా విపులంగా, విడిగా మూడు తరాళ కథలను Trilogy గా ఎందుకు రాయకూడదు? అన్నారు.


koumudi

మాజీ ప్రధాని, సాహితీ వేత్త పి.వి నరసింహారావు గారు నవల చదివి చక్కటి ఉత్తరం రాశారు. "మీరు సృష్టించిన పాత్రలన్నీ సజీవంగానూ, ఔచిత్యపూరితంగానూ ఉన్నాయి... అయితే అట్టి పాత్ర నిర్మాణం ఏ ఉత్తమ రచయిత నుంచైనా ఆపేక్షించడం జరుగుతుంది. కానీ ఎవ్వరూ సాధారణంగా ఊహించలేనిదీ, ఆపేక్షించనిదీ, వాస్తవంలో ముఖ్యకథలో అంత ప్రాసంగికం కానిది, అసాధారణ కౌశలం గల రచయిత మాత్రమే నిర్మించగలిగింది ఒక పాత్ర ఈ నవలలో కొద్దిపుటలలోనే మెరుపు తీగలాగ వచ్చి మాయమైంది. అన్నిపాత్రల్లోనూ ఇదొక అపూర్వమైన పాత్రగా నాకు తోచింది. వాస్తవంలో భారతీయ పరిపక్వ మనస్తత్వానికీ, సహజ జ్ఞానాకీ, ప్రాతినిధ్యం వహించే అర్హత నా దృష్టిలో ఈ పాత్రకే దక్కాలనిపిస్తోంది. ఇది నా ప్రథమ ప్రతిస్పందన. అది 'బత్తిన రేచకుడి' పాత్ర. ఈ పాత్ర నిర్మాణం సాహిత్యంలో అరుదైనదిగా నాకనిపించింది. ఈ పాత్రకు ఎన్నో పార్శ్వాలు ఉన్నట్టనిపించింది నాకు. ప్రతీదీ అమూల్యమైనది. చెప్పక చెప్పే సందేశాలతో నిండి ఉంది. ఈ ఒక్క పాత్రలోని ఉత్తమ శిల్పం కొరకైనా ఈ నవల చదువవదగిందనుకుంటాను. మీకు మరొక మారు అభినందనలు సమర్పిస్తూ, సెలవు. మీ మిత్రుడు". ఇది 2002 అక్టోబరు 25 న రాశారు.



koumudi

"సాయంకాలమైంది" నవల మీద మద్రాసు విశ్వవిద్యాలయంలో తెలుగు విభాగం విద్యార్థిని కల్పన - తన ఎం.ఫిల్ పరిశోధనా వ్యాసం వ్రాసింది. ఈ నవల అంటే ప్రాణంగా భావించే కొందరు మేధావి వర్గం పాత్రికేయులు మురళీకృష్ణ, రంగరాజన్(హిందూ) - విజయవాడలో కేవలం 'సాయంకాలమయింది అసోసియేషన్'ను ఏర్పరచుకున్నారు. 2005 మహతి ఉత్సవాలకు (తిరుపతి) నేను హాజరయినప్పుడు - నేను కూడా ఊహించలేనంత సునిశితంగా నవల గురించి విశ్లేషించారు.

హైదరాబాదు చర్లపల్లి సెంట్రల్ జైల్లో జైలు శిక్షను అనుభవిస్తున్న ఓ ఖైదీ (జె.శ్రీనివాసరెడ్డి, ఖైదీ నంబరు 405, మహానది బ్లాక్) రెండు పేజీల ఉత్తరం రాశారు. ఉత్తరం జైలు అధికారులు సెన్సారయి వచ్చింది.

"విప్లవం అంటే గతంలో ఆయుధాలతో అడవుల్లో తిరిగేవారు చేసే పని - అని ఒక అభిప్రాయం ఉండేది నాకు. మీరు మీమీ ఆయుధాలతో సమాజాన్ని కొంతగానయినా చక్కని బాటలో నడిపిస్తున్నారు. అందుకు - గురువుగారైన మీకు - మీ అనుమతి లేకుండానే - మీ శిష్యుడుగా ప్రకటించుకుంటున్నందుకు..." అని వ్రాశారు.

రచన నేరస్థుడి మనస్సుని మార్చలేదని ఎవరనగలరు? "సాయంకాలమయింది" నవలకి చర్లపల్లి ఖైదీ నుంచి వచ్చిన స్పందన - సమాజంలో ఆచరణ స్థాయిలో - నా ఆలోచన చేతులు సాచిందన్న గొప్ప తృప్తినిచ్చింది.

సీరియల్‌గా వచ్చినప్పుడు సంభవించిన అక్షరదోషాలు సరిచేసి బాపూగారి నుండీ విశ్లేషణాత్మకమైన ముఖచిత్రాన్ని రప్పించి గ్రంథరూపంలో అచ్చు వేయించిన భరాగో గారి నిబద్ధత నాకు దొరికిన ఇంకొక కితాబు. ఈ పుస్తకంలో అచ్చు తప్పులు లేవని ఒక వృత్తివంటి తృప్తి. ✡✡✡

# ప్రవాస ప్రయాసల్లో మారిషస్ ఆంధ్రులు దాటిన మైలు రాళ్ళు

## - వింజమూరి రాగసుధ, లండన్

**(లండన్ తెలుగు సంస్థ వారు ప్రచురించిన ఉగాది ప్రత్యేక సంచిక 'మనతెలుగు' సౌజన్యంతో..)**

చందమామ రావే, జాబిల్లి రావే, కొండెక్కి రావే - దాదాపు ప్రతి తెలుగింట చిన్నారుల కోసం పాడే పాట, చంద్రుడు భూమికి ఉపగ్రహం అని ప్రతి విద్యార్థికీ బడిలో చెప్పబడే మాట, రెండూ మనకి విదితమే. మన విశ్వంలో అగణనీయమైన గ్రహశకలాలు, తోక చుక్కలు, నక్షత్రాలు, నక్షత్ర సముదాయాలు, గ్రహాలు, ఉపగ్రహాలు, లఘుగ్రహాలు కొన్ని తెలిసినవి మరెన్నో తెలుసుకోవలసినవి ఉన్నాయి. మరి భువిపై ఉన్న తారల మాటేమిటి?


శ్రీ సోమనగారు

ఒక దశాబ్దం క్రిందట సౌర కుటుంబంలో సోమన అనే లఘు గ్రహం కనుగొనబడింది. అంతర్జాతీయ ఖగోళ సంఘంచే డా.రాధాకృష్ణ సోమన అనే భౌతిక శాస్త్రవేత్త గౌరవార్థం ఆ పేరు పెట్టబడింది. ఆయన సారథ్యంలో వారి పరిశోధనా బృందం 2004 లో నాసా పురస్కారం కూడా అందుకుంది. శ్రీ సోమనగారు ప్రస్తుతం మారిషస్ విశ్వవిద్యాలయంలో నక్షత్ర శాస్త్రం, భౌతిక శాస్త్రం బోధిస్తున్నారు. సోమన గ్రహం 1996 లో కనుగొనబడి సంఖ్యాక్రమం 19318గా చలామణిలో ఉంది.

2006 లో జర్మనీ లోని బెర్లిన్ నగరంలో జరిగిన ప్రపంచ కప్పు ఫుట్‌బాల్ అంతిమ పోటీ సందర్భంగా ఫ్రెంచి జట్టు నాయకుడు జినడిన్ జిడాన్ ఇటలీకి చెందిన ఆటగాడు మార్కో మాటరాజ్జీని బలంగా తలతో మోదిన సంఘటన ప్రపంచ వ్యాప్తంగా ఎంతోమందిని చకితులని చేసింది. అయితే అదే ఆటలో ఆడిన ఫ్రెంచి టీం ఎనిమిదో అంకెగల మిడ్‌ఫీల్డర్ ఆటగాడు వికాస్ దొరాసు పూర్వోత్తరాలు ఎంతో మందికి తెలియక పోవచ్చు.

గురువుగా, శాస్త్రవేత్తగా పేరు గడించిన సోమనగారు, ఫుట్‌బాల్ క్రీడారంగంలో సత్తా చూపించిన వికాస్ దొరాసు.. కోస్తా ఆంధ్రా నుండీ మారిషస్ ద్వీపానికి వలస వెళ్ళిన కుటుంబాలకి చెందినవారవడం ఇక్కడ గమనించ దగ్గ అంశం.

భారతావనికి పశ్చిమాన మూడు వేల మైళ్ళ దూరంలో హిందూ మహాసముద్రంలో ఉన్న మారిషస్ దీవిలో యాభైవేలకు మించి తెలుగువారు నివసిస్తున్నారు. అంటే 70శాతం ప్రవాస భారతీయులు నివసించే ఆ దేశ జనాభాలో తెలుగువారు 5 శాతం అన్నమాట.

కీ.శ. 1500 ప్రాంతంలో దాదాపు నిర్మానుష్యంగా ఉండి, అరబు ఓడంగుల పుటలలో దినా అరోబి అని అరుదుగా వ్రాయబడ్డ ఈ ద్వీపం ఈనాడు ఒక శక్తివంతమైన తెలుగు ప్రజానీకానికి నెలవయింది. 1598 లో డచ్ దేశస్థులు యువరాజు మారిస్ పేరు మీద ఈ ద్వీపాన్ని మారిషస్‌గా వాడుకలోకి తీసుకుని వచ్చారు. తరచుగా తుఫానులకు గురవుతున్న ఈ ప్రదేశం ఆర్థికంగా అక్కరకు రాదని వారు వదిలి వెళ్ళిన అపర పక్షంలో 1710 ప్రాంతంలో ఫ్రెంచి వారు వచ్చి చక్కెర ఉత్పత్తిని బాగా అభివృద్ధి చేసారు. రమారమి 300 చక్కెర కర్మాగారాలలో చెరకు తోటల్లో పనిచెయ్యడానికి చుట్టుపక్కల దేశాల నుంచీ పనివారిని రప్పించారు. 1833 లో బానిసత్వ నిర్మూలన చట్టం అమలులోకి వచ్చిన నేపథ్యంలో బ్రిటిష్ వారు, డచ్ వారు తమకు సేవచేసే వారికోసం తూర్పు దేశాలవైపు దృష్టిసారించారు. వాళ్ళ అవసరాలకోసమని మూడేళ్ళ నుంచీ ఐదేళ్ళ ఒప్పందపు కూలీపైన భారతదేశం నుంచీ కూలీల్ని దిగుమతి చేసుకునే ప్రహసనానికి నాంది పలికారు. అలా మొట్టమొదటి ప్రవాసులు 1834 లో గంగ అనే ఓడలో ప్రయాణించి మారిషస్‌లో అడుగుపెట్టారు. వలస వెళ్ళిన ఆంధ్రులలో ఎక్కువ మంది ఉత్తర కోస్తా ప్రాంతం, తుని, ఒంగోలు, కడప, చిత్తూరు, విజయనగరం, బందరు, శ్రీకాకుళంకి చెందినవారు. ఈనాటి కాకినాడ దగ్గర ఆనాటి కోరంగి రేవునుండీ ఓడ ఎక్కి రావటం వలన వారందరూ తరాలుగా కోరంగులని సంబోధింపబడ్డారు.

ఎందరో ఘనులు, పండితులని కన్న మన పుణ్యభూమి నుండీ వలస వెళ్ళి బహుమత, బహు భాషా, సంఘంలో ఉమ్మడిగా ఉంటూనే తమకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని స్థాపించి తమ ఉనికిని ప్రపంచానికి చాటి చెపుతున్న తెలుగు సోదరులకి జోహార్లు అర్పించాలి.. మన సంస్కృతిని పెంపొందించే అభిమతం, మాతృభాషని, ఆచారవ్యవహారాలని తరువాతి తరాలకి అందించాలనే వారి తపన ఎంతో శ్లాఘనీయం.

ఒక శతాబ్దం క్రిందట కనీస అవసరాలు కూడా సరిగ్గా లేని పరిస్థితులలో కాయకష్టం చేసిన మారిషస్ తెలుగువారు, కాలక్రమేణా తరాలవారీగా అంచెలంచెలుగా పైకి వచ్చారు. అక్షరాస్యత, ఆర్థికస్తోమత మెరుగుపడటం వలన క్రమేపీ వైద్యులుగా, ప్లీడర్లుగా, వ్యాపారస్తులుగా ఆర్థిక శాస్త్రవేత్తలుగా, మంత్రులుగా అనేక రంగాలలో రాణించారు. ఉన్నత విద్యావకాశాలు, ఉద్యోగాభివృద్ధి కోసం మతం మార్చుకోవటం అనే కార్యక్రమంఒక ప్రక్క వ్యాపిస్తుండగా, పేదరికానికి గానీ, ఫ్రెంచి బ్రిటిషువారి ఒత్తిడికి గానీ లోనుకాకుండా, క్రియోల్ భాష, ఫ్రెంచి భాష ప్రచారంలో ఉన్న దేశంలో కూడా, తెలుగు భాషా వికాసానికి వారు అహోరాత్రులు పాటుపడటం ప్రశంసనీయమైన మైన విషయం. మారిషస్‌లో ఉగాది, దీపావళి, సంక్రాంతి జాతీయ సెలవు దినాలుగా ప్రకటించబడ్డాయంటే ఆ దేశంలో భారతీయులు, అందునా తెలుగువారు ఎంత ప్రాధాన్యత వహిస్తున్నారో తెలుస్తోంది.

1958లో ప్రభుత్వ పరంగా తెలుగుభాషా బోధన అమలులోకి వచ్చింది. ప్రస్తుతం నూరు ప్రాథమిక పాఠశాలల్లో, పది ఉన్నత పాఠశాలల్లో, డిగ్రీ స్థాయిలో కూడా తెలుగు భాష బోధించబడుతోంది. మారిషస్ తెలుగు హైందవులు వైష్ణవ సాంప్రదాయాన్ని పాటిస్తారు. అందువలన విష్ణుమూర్తిని, వెంకటేశ్వరస్వామిని, నరసింహస్వామిని, కృష్ణుడుని, రాముడిని కొలుస్తారు. త్యాగరాజు జయంతి, గోవిందమాల, ఉగాది, సంక్రాంతి, ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవం మొదలుగున్నవి ఎంతో ఆనందోత్సాహాలతో భక్తి శ్రద్ధలతో జరుపుకుంటారు. కేంద్రస్థాయిలో కూడా విరివిగా రామభజనలు నిర్వహిస్తారు. నియమానుసారంగా ఆంధ్రదేశం నుండీ వివిధ కళాకారులని పిలిపించి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉంటారు.

మారిషస్ దూరదర్శన్‌లో ప్రతిరోజు తెలుగు సీరియల్, నెలకి మూడు తెలుగు సినిమాలు, తెలుగు వార్తలు దూరదర్శన్ హైదరాబాదు నుండీ ప్రసారం అవుతాయి. మారిషస్ జాతీయ ఆకాశవాణిలో కూడా ప్రతిరోజూ తెలుగు కార్యక్రమాలు ప్రసారం అవుతాయి. తెలుగు భాష అభివృద్ధికి, సాంస్కృతిక కార్యకలాపాలకి ప్రభుత్వ నిధులు కేటాయించబడ్డాయి. గత రెండు దశాబ్దాలుగా తెలుగు వార్షిక నాటకోత్సవాలు జయప్రదంగా నిర్వహించబడుతున్నాయి.

koumudi

తమకంటూ ఎన్నో గుర్తింపులు పొంది, విఖ్యాతిగాంచిన ముఖ్యమైన తెలుగువారు - మొట్టమొదటి తెలుగు మంత్రులు శ్రీ సింహాద్రి వీరాసామి, మొదటి తెలుగు మేయరు శ్రీకృష్ణ బాలిగాడు, మారిషస్ దేశ పూర్వ ఉప ప్రధాని, ఆర్థిక మంత్రి సీతన్న లచ్చిమి నారాయుడుగారు, ప్రముఖరాజకీయ వేత్తలు బాల లింగయ్య, లచ్చనగార్లు, ఆర్థిక శాస్త్రవేత్త శ్రీ వీరాసామి, హృదయ వైద్య నిపుణులు డా.సూర్యనారాయణ బాలిగాడు, మొట్టమొదటి మహిళా న్యాయమూర్తి విద్యారమణ మొదలుగువారు.

పరమార్ధ జీవనం రచించిన పండిట్ గున్నయ్య ఓటో, కీ.శే రామ్మూర్తిగారు, కీ.శే.పాండా బాప్నాయుడుగారు తెలుగు సంస్కృతిని విస్తరించటానికి అవిశ్రాంత ప్రయత్నం చేసిన సంఘుసంస్కర్తలు. పాండా బాప్నాయుడుగారి తండ్రి అప్పట్లో రామభజనల్లో వయోలిన్ వాయించే ఏకైక వ్యక్తిగా ఖ్యాతి గడించారు. తాత,ముత్తాతల అడుగుజాడల్లో నడుస్తూ తెలుగు నేర్చుకునేవారికి సహాయకంగా ఉండే ఎన్నో పుస్తకాలు రచించారు శ్రీ సోకప్పాడు రామానాయుడుగారు. గత 20 ఏళ్ళుగా ఆర్థిక మంత్రిత్వశాఖలో పనిచేస్తూ ప్రస్తుతం




ఉపనిర్దేశకులుగా పదవీ బాధ్యతలు నిర్వహిస్తున్న శ్రీ రామానాయుడుగారు లండన్‌లో కూడా కొంతకాలం పనిచేసారు. మహాత్మా గాంధీ నేషనల్ కాలేజీలో తెలుగు విభాగాధిపతిగా పనిచేస్తూ, మారిషస్ ఆకాశవాణి నిలయం మరియు దూరదర్శన్‌లో ప్రసారకుడిగా ఉన్న శ్రీ సంజీవ అప్పడు తన సంభాషణలో ఒక్క ఆంగ్ల పదం కూడా ఉపయోగించకపోవడం ఒక విశేషం. 'ప్రవాసాంధ్ర వైతాళికుడు' అని బిరుదు పొందిన శ్రీ సంజీవ గారు ఆంధ్ర లలిత కళా సమితికి అధ్యక్షుడిగా, ఉంటూ రావి ఆకులమీద బొమ్మలు గియ్యటంలో ప్రసిద్ధి చెందారు. అర్చకత్వంలో శిక్షణ పొంది తిరుపతి దేవస్థానం వారి పట్టా పొందిన సంజీవగారు దేశవ్యాప్తంగా జిల్లాల వారీగా ప్రవచనాలు, భజనలు, వేదపారాయణ శిక్షణ మొదలైన కార్యక్రమాలని పదిహేను సంవత్సరాలుగా నిర్వహిస్తున్నారు. మాతృభాషని ప్రాణప్రదంగా ప్రేమించే సంజీవ, తెలుగు నాటకోత్సవాల కోసం ఎన్నో రచనలు చేస్తూ మారిషస్ తెలుగువారి కోసం ప్రత్యేకమైన పతాకం కూడా రూపొందించారు. 1982 నుండీ తెలుగు సంస్కృతికి ప్రతీకగా చెలామణి అవుతున్న ఈ జండాలో సూర్యుడి కిరణాల మధ్య ఓం అనే పదం లిఖించబడి ఉంటుంది. అలాగే ఆనందెవో పైడుతల్లి కూడా మారిషస్‌లో తెలుగు భాషా బోధనలో కృషిచేస్తున్నారు.

umudi


లింగయ్య

పాతికేళ్ళ నుంచీ రచనావ్యాసంగంలో ఉన్న డాక్టర్‌శామ్ లింగయ్య(శీరామ్) అనేక పుస్తకాలు రచించారు. వాటిలో స్ట్రగుల్స్ అండ్ ఎఛీవ్ మెంట్స్ అనేది ప్రధానంగా పేర్కొనదగిన పుస్తకం. ఆయన స్వయంగా బాలకార్మికుడిగా జీవితాన్ని ప్రారంభించారు. 18 సంవత్సరాల వయసులోనే బ్రిటిష్ సైన్యంలో చేరి మిడిల్ ఈస్ట్ లో పనిచేసారు. చదువుకోవాలనే తపనతో భారతదేశం వెళ్ళి, సరైన అవకాశాలు దొరక్క గాంధీగారి - ఆశ్రమంలో కొంతకాలం గడిపారు. తరువాత కొంతమందితో కలిసి పడవలో ఇంగ్లాండు చేరుకున్నారు. పొట్టకూటికోసం కాయకష్టం చేస్తూ క్రమేపీ పట్టభద్రులై ఎమ్మే పూర్తిచేసి డాక్టరేట్ కూడా చేసారు. ఒక ప్రవాసాంధ్రుడు దాస్యశృంఖలాలనుంచీ విముక్తికోసం చేసిన ప్రయత్నాలనీ అందులో ఎదురైన కష్టాలనీ, బాధలనీ కళ్ళకి కట్టినట్లు చూపించే పుస్తకం స్ట్రగుల్స్ అండ్ ఎఛీవ్ మెంట్స్ అనేది. ఇది ప్రతి ప్రవాస భారతీయుడూ చదవాల్సిన పుస్తకం.

1979లో మారిషస్ దేశంలో మొట్టమొదటి తెలుగు ముద్రణా సంస్థ ప్రారంభించి 'జగపతి' అనే వారపత్రికని వెలువర్చిన సంపాదకులు శ్రీవనపిల్లి సింహాద్రి అప్పన్నగారు, ప్రస్తుతం ఇంగ్లాండులోని సర్రేలో యు.కె తెలుగు ఇన్‌స్టిట్యూట్‌ని నడుపుతూ సాహిత్య, సాంఘిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మారిషస్‌లో ఉండగా పోతనామాత్యులు రాసిన భజనలు ప్రచారంలోకి తీసుకుని వచ్చిన శ్రీ అప్పన్నగారు ఎన్నో పుస్తకాలు కూడా రచించారు. 1958 నుంచీ తెలుగుభాషని బోధిస్తున్న శ్రీ సోమయ్య సోమనగారు ఒక విలువైన అధ్యాపకుల తరాన్ని మారిషస్ తెలుగువారికి అందించిన అనుభవజ్ఞుడు. స్కాట్‌లాండ్‌లో నివసిస్తూ గత నలభై వసంతాల నిడివిలో వృత్తిపరమైన కారణాల వలన తెలుగుకి దూరంగా ఉండవలసి వచ్చిన డా.డేవిడ్ లింగయ్యగారు మాతృభాషపై మమకారం వదులుకోలేక రిటైర్ అయిన తరువాత అరవై ఏళ్ళ పసిడి వయస్సులో తెలుగు చదవటం వ్రాయటం మొదలుపెట్టడ మనేది ప్రశంసించవలసిన విషయం. జీవితంలో ఉన్నత స్థితికి చేరుకోవటానికీ, విదేశాలలో వెలుగొందటానికి ఇంగ్లీషు ఉంటే చాలని మాతృభాషని నిర్లక్ష్యం చేసేవారికి ఇది కనువిప్పు కదూ..!.

మనం గమనించాల్సిన ఇంకో విశేషం - మారిషస్ లో మొత్తం 60 దేవాలయాలు ఉన్నాయి. మొట్టమొదటి దేవాలయం "విష్ణు ఆలయం " 1923 లో సెయింట్ పియ్రో లో నిర్మించబడింది. దీనిని స్థాపించిన వారు మొట్టమొదటి తెలుగు సంఘం "ఆంధ్ర జనానంద సంఘం" వారు. తరువాత 1946లో పోర్ట్ లూయిస్ లో ఆంధ్రమహాసభ ప్రారంభించబడింది. ప్రస్తుతం ఉన్న అన్ని తెలుగు సంఘాలలోకీ ఇదే అతి పెద్దది.

ఆంధ్రులకి ప్రత్యేక రాష్ట్రం కావాలని, తెలుగువారికి గుర్తింపు రావాలని, 66 ఏళ్ళ క్రిందట పొట్టి శ్రీరాములుగారు ప్రాణత్యాగం చేసి మరీ సాధించిన మైలు రాయికి ప్రపంచంలో నలుదిక్కులా ఉన్న ఈ తరం ప్రవాసాంధ్రులు కొంత మంది అంతగా ప్రాధాన్యత ఇవ్వని నేపథ్యంలో - సమాజానికి ఉపయోగపడేలా, మన సంస్కృతిని నిలబెట్టేలా, మన కట్టుబాట్లు మాతృభాష భావితరాలకి అందించాలని యధాశక్తి పరిశ్రమించిన మహోన్నతుల ఔన్నత్యాన్ని అనుసరిస్తూ నేడు కూడా అదే తపన పడుతూ తలమానికంగా నిలుస్తున్న ఎంతో మంది మారిషస్ తెలుగు మహానుభావులకి హృదయపూర్వకమైన నీరాజనాలు. ఆవకాయ నుంచీ అంతరిక్షం దాకా అన్నిరంగాలలోనూ ముందుకి ఉరుకుతున్న మారిషస్ ప్రవాస తెలుగు సోదరులకి అభివందనాలు.



వృత్తిరీత్యా అంతర్జాతీయ ట్రావెల్ కన్సల్టెంట్ ఐన వింజమూరి రాగసుధ గారు యు.కె.లో ట్రావెల్ అండ్ టూరిజం మేనేజ్ మెంట్ ట్రైనింగ్‌లో అనేక మందికి శిక్షణ నిస్తున్నారు. ప్రవృత్తిరీత్యా ప్రసిద్ధ నృత్యకళాకారిణి. డాక్టర్ ఉమారామారావు గారి శిష్యురాలైన సుధ గారు ప్రపంచవ్యాప్తంగా 50 కి పైగా నృత్యప్రదర్శనలిచ్చారు. బహుముఖ ప్రజ్ఞాశాలి ఐన రాగసుధ గారిని కౌముది పాఠకులకి పరిచయం చేయడానికి ఆనందిస్తున్నాం.

koumudi



# తెలుగు సినీసాహిత్యం - నాటకరంగ ప్రభావం

జనవరి 2008 చివరివారంలో మద్రాసు యూనివర్సిటీలో జరిగిన ఒక సదస్సులో చదివిన ప్రసంగ వ్యాసం

- గొల్లపూడి మారుతీరావు

**న్యాయానికి** సినీమాలో సాహిత్యం నేతిబీరకాయలో నెయ్యిలాంటిది. అయితే దశాబ్దాల నాటకరంగ వారసత్వం బీరకాయకి నెయ్యి అందించింది. ఇది బీరకాయకి అవసరంకాదు. కోరుకునేదీకాదు. కాని సాంగత్యం వల్ల అబ్బిన గుణం. నిజానికి సినిమాల్లో సాహిత్యం - కొన్ని దశాబ్దాల పాటు మహా రచయితలు - సినిమా ప్రక్రియకి సంబంధం లేని - గొప్ప లక్షణాన్ని పోషిస్తూ వచ్చారు. సంబంధం ఎందుకులేదు? ఈ ప్రశ్నకి సమాధానంలోనే నాటకరంగ ప్రభావం అనే అంశం యిమిడిఉంది.

Thanks to theatre, literature gate crashed into cinema, by default.

koumudi

వెంటనే ఓ సవరణ చెప్పి నాలుక కరుచుకోవాలి. సినీమాలో సాహిత్యం ప్రమేయం వుండనక్కరలేదు కాని, తెలుగు సినీమాకి సాహిత్యంతో అద్భుతమైన, విడదీయలేని అనుబంధం వుంది. కెమేరాముందు కవిత్వం చెప్పడం సినీమా కానేరదు. కాని కెమేరా చెప్పగలిగే భావనలను కళ్ళముందు రూపం కనిపించేంత సునిశితంగా మాటల్లో రూపు దిద్దిన సాహితీపరుల చరిత్ర సినీమాతో ముడిపడి వుంది. - ప్రపంచమంతటా తొలిరోజుల్లో, మనదేశంలో యిప్పటికీ -

గొప్ప రచన - మాటల్లో, పదాల్లో, పద్యాల్లో మనస్సులో ఒక చిత్రాన్ని నిర్మిస్తుంది. 'పుత్తడి బొమ్మ'నీ, ఆమె దయనీయ గాథనీ, అందులో ఆర్ద్రతనీ గురజాడ కవితలో మన మనస్సుల్లో ప్రతిష్ఠించాడు. అలాంటి పనే కళ్ళముందు స్పష్టంగా, నిర్దుష్టంగా చేస్తుంది సినీమా. సాహిత్యమూ, చలన చిత్రమూ - రెండు బొమ్మల్నే తీర్చిదిద్దుతాయి. ఉత్తమ సాహిత్యం లక్ష్యం మనోనేత్రాన్ని తెరవడం. ఉత్తమ చిత్రం లక్ష్యం మన నేత్రాల ముందు ఉత్తమ భావాన్ని విష్కరించడం. The distintictive quality of good writing, as also of a good film – is essentially visual. ఇదీ సాహిత్యానికీ, చిత్రానికీ ఉన్న దగ్గర బంధుత్వం.

అమెరికా విమర్శకుడు రాబర్ట్ రిచర్డ్సన్ ఈ మాట అన్నాడు..

If one is willing to shift the focus a little, and to describe literature as being, in the main, a narrative art, intent upon creating images and sounds in the reader's mind , then the film will appear much more obviously literary itself.

అయితే నేను నేతిబీరకాయలో నేతిని వెదకడం లేదు. మొదట చెప్పిన 'అనర్థాన్ని' సమర్థించబోవడమూ లేదు. సాహిత్యం చేసే పని సినీమా చేయడం గొప్పదే కాని - సాహిత్యమే సినీమాలో పీట వేసుక్కూచోవడం, అందునా నాటకం ద్వారా యథాతథంగా దిగుమతి కావడం - చెప్పాల్సిన విషయం.

నిజం ఒప్పుకోవాలంటే మానవ నేత్రం ముందు మనోనేత్రానికి అందే ప్లేన్‌లో చిత్రాలు తెలుగులో యింకా , యిప్పటికీ రాలేదు. అక్కడక్కడా ఛాయలు ఉన్నవని ఆనందిద్దాం. ఇప్పుడిక సినీమా ప్రక్రియలోకి - నాటకం ద్వారా- అపక్రమంలో తోసుకువచ్చిన సాహిత్యం - మన కళ్ళముందున్న చరిత్ర.

ఇది తప్పా, అది తప్పా అని మనం జుత్తు పీక్కోనక్కరలేదు. పాశ్చాత్య చిత్రాలలోకీ - తొలిరోజుల్లో యిలాగే షేక్స్పియర్, షా, డికెన్స్, అలెగ్జాండర్ డ్యుమాస్ - యిత్యాదులు తొంగిచూశారు. ఉదాహరణకి ఒక్క డి.డబ్ల్యూ గ్రిఫిత్ చాలు. కనుక మనం సవినయంగా వెర్బల్ లిటరసీని పక్కన బెట్టి విజుయల్ లిటరసీ గురించి మాట్లాడుకుందాం.

సాహిత్యానికీ, సినిమాకీ ఉండగల బంధుత్వాన్ని చాలా విచిత్రంగా వివరించాడు మోరిస్ బేజా అనే విమర్శకుడు. ప్రాచీన కాలం నాటి గ్రీసు దేశంలో సినీమాలు ఉండి వుంటే యివాళ వాటిని సాహితీ రూపాలుగా పఠిస్తూ ఉండేవాళ్ళం - అని.

వెంటనే నాకు మనభాషలో చెప్పాలనే వ్యామోహం లాగుతోంది. వేదవ్యాసుడికీ, పోతనకీ అలనాడు స్క్రీన్‌ప్లే వ్రాయడం తెలిసుంటే - యివాళ మనం వాటిని చూసి మహా భారతం, భాగవతం వ్రాసుకునేవారమేమో! సాహిత్యానికీ, మనోనేత్రాన్ని ఆవిష్కరించే అపూర్వమయిన స్థాయిలో చిత్రానికీ అభేధాన్ని చెప్పడానికి ఇది ఉదాహరణ మాత్రమే.

నిజానికి

*అడిగెదనని కడువడి జను*
*నడిగిన దను మగుడ నుడవడని నడయుడుగున్*
*వెడవెడ సిడిముడి తడబడ*
*నడుగిడు నడుగిడదు జడిమ నడిగిడునెడలన్*

ఇంత గొప దృశ్యాన్ని - స్క్రీన్‌ప్లేని - యింతకంటే గొప్పగా ఎవరూ వ్రాయలేరని నాకనిపిస్తుంది. ఈ పని పోతన ఏనాడో చేశాడు.

నాటకం చేసే, చెయ్యగల అన్ని పనులూ నాటకం కంటే బాగా సినీమా చెయ్యగలదు కానీ - ఒక ముఖ్యమయిన విషయంలో నాటకానిదే పై చెయ్యి. ఎంత గొప్ప బొమ్మని తెరమీద చూపగలిగినా - కొన్ని నైరూప్య (ఆబ్‌స్ట్రాక్ట్) భావనలు దృశ్యానికి లొంగవు. ఉదాహరణకి - బిడ్డనీ, స్త్రీనీ చూపవచ్చునేమో కాని 'మాతృత్వానికి' దృశ్యం లేదు. అలాగే కావిలింతని చూపవచ్చునేమో కానీ 'ప్రేమ' ని చూపలేం. ముద్దుని చూపవచ్చును గాని, సెక్స్‌నీ, రక్తాన్నీ చూపవచ్చును గాని, 'హింస'నీ, కోపాన్నీ చూపవచ్చునుగానీ 'ద్వేషన్ని' చూపడంలో దృశ్యం వీగిపోతుంది. ఈ సందర్భంలో 'మాట' కొంగుబంగారం. "నువ్వంటే నాకు ప్రాణం" అన్న భావన చూపడానికి పది ఫ్రేములో లేదా ఎంత క్లుప్తంగానయినా నాలుగు సన్నివేశాలో కావాలేమో కానీ ఒక్క మాట కథకు తోడవుతుంది. నిజానికి ఈ పనిని యింకా పకడ్బందీగా చేసే మరో లక్షణం కూడా నాటకం ద్వారానే దిగుమతి అయింది. అది సంగీతం, పాట. భారతీయ సంగీతంలో అనుభూతి ప్రధానమయిన విభజన లేదు. అయితే ఆనవాయితీగా ఆయా రాగాల్ని ఆయా సందర్భాలకో, భావనలకో అనువుగా వాడడం రివాజుగా వస్తున్న ఆచారం. ఉదాహరణకి శృంగారానికి సారంగ, భాగేశ్రీ ఖమాచ్, అధికారానికి అఠాణ, కరుణకి శహన, శాంతికి సామ, భక్తికి మోహన, హాస్యానికి హుస్సేనీ, ఆనందభైరవి, దుఃఖానికి ముఖారి, అలాగే ఋతువులకి - వర్షాకాలానికి మల్హార్, అమృతవర్షిణి, వసంతకాలానికి రక్తి రాగాలన్నీ - కానడ, బేగడ వంటివి  వాడడం చారం. ఇవి అన్వయం వల్ల నిలిచినవే.

ప్రపంచ ప్రఖ్యాత దర్శకుడు ఇంగ్మార్ బెర్గ్‌మెన్ ఓ మాట అన్నాడు .. the reason film has more in common with music than with literature is that both film and music affect our emotions directly, not via intellect.

ఈ అభిప్రాయానికి సాక్ష్యం మన సినీరంగ చరిత్రనంతా (యివాల్టిదాకా) ఉదహరించవచ్చు.

పాట లేదా పద్యం - వాస్తవాన్ని వీలయినంత అవాస్తవం చేస్తూనే - మరొక పక్క 'అవాస్తవాన్ని' అంగీకరించాలనే ప్రలోభంలో పడేస్తుంది. - అది వాస్తవం కాదని ఒక పక్క మనస్సు చెబుతున్నా, నాటకం నుంచీ పరకాయ ప్రవేశం చేసిన అలనాటి ప్రేక్షకుడు కదిలే బొమ్మని తెరమీద చూస్తూనే, అలవాటయిన నాటకాన్నే చూసి ఆనందించాడు. కొత్త ప్రక్రియ బతకడానికి నాడు నిర్మాతకీ, ప్రేక్షకుడికీ ఏర్పడిన సయోధ్య యిది. క్రమంగా పాట 'అవాస్తవం' అనే స్పృహని మరిచిపోయి 'అలవాటు' చేసుకున్నాడు ప్రేక్షకుడు. కన్నతల్లి పిలుపులో బిడ్డకి ఆప్యాయత తెలుస్తూంటుంది కాని ఆమె కీచుగొంతు తెలీదు. బయట వినే వాళ్ళకి? ఆమె గొంతులో ఎబ్బెట్టుదనం మాత్రమే తెలుస్తుంది. - ఆ కమిట్‌మెంట్ వారికి లేదు కనుక. దశాబ్దాల భారతీయ ప్రేక్షకులకి అది అలవాటయిన మాతృమూర్తి స్వరమాధుర్యం, మిగతావారికి 'కీచుగొంతు' మాత్రమే. అందులో అవాస్తవం ఉంది, అసందర్భం వుంది, మళ్ళీ మాట్లాడితే విపర్యయం వుంది.

ఓ హీరోయిన్ చెట్టుకింద కూర్చుని - కళ్ళనీళ్ళు పెట్టుకుంటూ మేఘంతో అంటోంది: ఏమయ్యా మేఘంగారూ! వెళ్ళి మా బావకి నేను తననింకా మరిచిపోలేదని చెప్పి వస్తావా? అని. ఇలా మాట్లాడే పిల్లని ఎవరయినా చూస్తే వెంటనే కిల్పాక్ కి తీసుకెళ్ళాలి. కానీ కృష్ణశాస్త్రి గారి హృదయంతో, రాజేశ్వరరావు గారి స్వరమాధుర్యంతో ఆ సందర్భాన్ని యిన్ని సంవత్సరాలు గుండెల్లో దాచుకున్నాం. ఎవరికీ కిల్పాక్ అవసరం గుర్తురాలేదు.

కళ్ళుపోయిన హీరోగారు 'కనుపాప కరువైన కనులెందుకు? తనవారె పరులైన బతికెందుకు?'' అని అంటే మల్లాది రామకృష్ణశాస్త్రి గారి కవితాహృదయం మనల్ని పులకింపజేసింది. హీరోగారి గుడ్డి తనం మీద జాలి కలిగింది.

మొన్నటికి మొన్న జాతీయ స్థాయిలో బహుమతినందుకున్న ఓ పాటలో - ఓ పాపులర్ చిత్రంలో - ప్రధాన పాత్రధారి ''ధిక్కరీంద్ర జిత హిమగిరీంద్రసిత కందరా నీలకందరా, క్షుద్రులెరుగని రుద్రవీణ నిర్నిద్రగానమిది అవధరించరా - విని తరించరా '' అని దేవుడికి మొరబెట్టుకున్నాడు. సినీమాపేరు మీకు గుర్తుకొచ్చే ఉండాలి ఈ పాటికి - శంకరాభరణం. ఈ రెండు లైన్లూ రాసుకోడానికి నేను 8 సార్లు పాటని విని వేగంలో రాసుకోలేక - ఈ పాటని తరచూపాడే గాయకునికి ఫోన్ చేశాను - సాహిత్యాన్ని చెబుతారా రాసుకుంటాను - అని. ఆయనా నవ్వుకుని అరగంట తర్వాత ఫోన్ చేస్తానన్నాడు. పాడుకుని, తనే రాసుకుని నాకు ఫోన్ చేశాడు. ఈ పాట సెకనుకి 24 ఫ్రేములు వేగంతో కదిలే సినీమాలో భాగం. దాదాపు అన్ని ప్రాంతాల వారినీ అలరించిన సినీమా యిది. అందరూ విన్నా ఎవరూ అర్థంకోసం తాపత్రయపడనిది. నాకూ - చేతికొచ్చాక కూడా చాలా మాటలు అర్థం కాలేదు. దేవుడితో 'విని తరించరా' అంటాడేమిటి? దేవుడు కదా ఆ మాట అనాల్సింది? అని అర్థమైన ఒక్క మాట గురించీ లజ్జుగుజ్జులు పడ్డాను. దీనికేదో అర్థాన్ని కవి నిర్దేశించే వుంటాడు. అయితే పాడిన పాటకుడి నుంచి విన్న ప్రేక్షకుడి దాకా అందరూ అర్థంకాని మాటల్ని విని సరిపెట్టుకున్నవారే.

పాట ఒక stylization. ఒక మత్తు. మత్తుకి తలవొంచే ప్రేక్షకుడు - కొన్ని మాటలతో, కొన్ని అర్థాలతో, సన్నివేశాలతో - వెరసి పాటతో రాజీ పడతాడు. సందర్భం అతన్ని ఆకర్షించింది. సన్నివేశం అతనికి అర్థమయింది. నచ్చింది. పాట ఆర్ద్రత అతన్ని అలరించింది. మధ్యలో ఎక్కడో మాటల, భావాల అమరిక అతని మేధస్సుకి అందలేదు. అయినా అనుభూతికి అతను లొంగిపోయాడు. ఆ పాటలో ఒక్క లోపం అతన్ని మత్తునుంచీ బయటికి లాగలేదు. నాలుగున్నర నిముషాల రాజీ అది. - తనకి తెలీకుండానే .

ఒకాయన అన్నాడు కదా - verse communicates the meaning more rapidly because it is rhythemic – th erythm is an emphatic force producing emotion in us rapidly – but because the world relationships are free of logical restraint.



koumudi

అయ్యా, ప్రేక్షకుడికి ఈ రాజీ తరతరాల వారసత్వం. చాలా దశాబ్దాల ముందునుంచే - అర్ధంకాని చాలా విషయాలను - అర్ధమయే సన్నివేశ స్ఫృహతో సరిపెట్టుకోవడం నాటకం నేర్పింది..

అలనాటి ఉదాహరణ. ఈ ప్రేక్షకుడి ముత్తాతగారి ముత్తాతగారు ఏ పందలపఱ్ఱులోనో పాండవోద్యోగవిజయాలు నాటకం చూస్తున్నారు. కురుక్షేత్ర సంగ్రామానికి ముందు శ్రీకృష్ణుడి సహాయాన్ని అర్థించడానికి దుర్యోధనుడూ, అర్జునుడూ ఒక్కసారే వచ్చారు. 'పడక సీను' ప్రేక్షకుడికి కొట్టిన పిండి. అందులో 'అదిగో ద్వారక' పద్యం 115 సంవత్సరాల అలవాటు.
అర్జునుడు ద్వారకని సమీపిస్తూ ' ఆ కనిపించేదే ద్వారక పట్టణం. అక్కడ తిరుగుతున్నవి ఆలమందలు. ఆ పక్కన రథాలు, అగడ్తలు. కొంచెం దూరంలో శ్రీకృష్ణుడి భవనం-" అంటూ పొంగిపోతాడు. ఇలా చెప్తూంటే నటుడు బొత్తిగా టీవీ యాంకర్ లాగ కనిపించేవాడు. అక్కడో పద్యం రాశాడు రచయిత;

*అదిగో ద్వారక ఆలమందలవిగో అందందు గోరాడు య*
*య్యదియే కోట యది యగడ్త అవి రథ్యల్ వారలే యాదవుల్*
*యదుసింహుడు వసించు మేడ యదిగో-*

ఇక్కడ కవి విజృంభించాడు:

*అలాన దంత వలా*
*భ్యుదయంబై వర మందురాంతర తురంగోచ్చండమై పర్వెడున్*

ఈ పద్యాన్ని రాసుకోలేక నేను నానా తంటలూ పడ్డాను. వి.ఏ.కె. రంగారావు గారి దగ్గరనుంచీ యిద్దరు ముగ్గురికి ఫోన్లుచేసి ఆఖరికి నాటకం వేసే ఓ నటుడిని విశాఖపట్నంలో పట్టుకున్నాను. అనుమానం వద్దు, బుకాయించవద్దు - అప్పటికీ, యిప్పటికీ పులిపాటి వెంకటేశ్వర్లు గారి దగ్గరనుంచీ ఆ నాటి ప్రేక్షకులదాకా ఈ పాదం అర్థమై ఉండదు ప్రతిపదార్థం చెప్పించుకుంటే తప్ప. కాని ప్రేక్షకుడికి భారతం తెలుసు. ఉద్యోగవిజయం తెలుసు. పడక సీను తెలుసు. పులిపాటి నటనా వైదుష్యం తెలుసు. మధ్యమావతి, శ్రీరాగాల రుచి తెలుసు - బస్..అగడ్తలతో, తురంగోచ్చండాలతో పనిలేదు. పద్యం ప్రేక్షకులలోకి దూసుకుపోయింది. తరాలపాటు విజ్ఞత కళ్ళుమూసుకుని 'అనుభూతి' కి పట్టం కట్టింది.

పదిమంది మధ్య పసివాడికి కన్నతల్లి స్పర్శ లాంటిదది. పసివాడు చర్మ వైద్యుడు కాడు. మాతృత్వం మీద రిసెర్చి చెయ్యలేదు. అక్కరలేదు. అమె చెయ్యి అతనికి ఇన్స్టింక్ట్-

ప్రేక్షకుడికి అదిగో ద్వారక పద్యం లాగే! అతని అనుభవంలోకి దూసుకుపోయిన ఆనందమది. తరతరాల ఇతివృత్తం అవగాహన, నాటకం అలవాటు, రాగంలో సుఖం- ఇవన్నీ కలిసి ప్రేక్షకుడిలో చాలా ప్రశ్నలను జోకొట్టాయి.

Instinct stylises the situation and allows the compromise of the conventional wisdom.

ఈ రాజీ పందలపఱ్ఱు నాటకంనుంచీ శంకరాభరణం పాట దాకా తరతరాలుగా సాగుతోంది.

ఈ మాట చెప్తున్నప్పుడు నేను సాహిత్యాన్ని విమర్శించడంలేదు. ప్రక్రియ లిమిటేషన్స్‌కి ఒదిగి, లేదా ఎదిరించి - సాహిత్యం తనదైన గాంభీర్యాన్ని నిలబెట్టుకుంటూ - యింతకాలం బతికి బట్టకడుతున్నదని. కొవ్వూరు వోటరుకి మన్మోహన్ సింగ్ గారి పరిపాలనా దక్షత ఉండదు. అయినా ఈ వోటరు నాయకత్వపు పాలనకు వాటాదారుడే This is a chemistry, a built-in democracy of the medium.

'స్వాతి ముత్యం' రజతోత్సవ సభలో రాజ్‌కపూర్, కమల్ హాసన్ మిగతానటులంతా ఉన్నారు. అలనాటి ముఖ్యమంత్రి ఎన్టీ.రామారావు ముఖ్య అతిథి. ఉపన్యాసంలోనే ఆవేశంతో 'మయసభ' సీను నటించేశారు. ప్రేక్షకులు ఆనందంగా విన్నారు. సభ

చప్పట్లతో దద్దరిల్లి పోయింది. ఎన్ని దశాబ్దాలుగా ఈ 'మయసభ'ని ప్రేక్షకులు చూసి, విని ఆనందిస్తున్నారు! ఏ ఒక్కరికైనా, కొంతయినా అర్థమౌతోందా? వారికానాడు అర్థమయింది ఎన్టీఆర్ దుర్యోధనుడు. 'మయసభ' ఓ రారాజు ఆభిజాత్యాన్ని, అవమాన భారాన్నీ చాటి చెప్పే ఘట్టం. అది వారికి తెలుసు. ఆ అనుభూతి తెలుసు. మకుటం లేని చక్రవర్తి ఎలా మాట్లాడుతాడు? బహుశా యిలాగేనేమో. తెలియకపోయినా ఫరవాలేదు. ఇలాగ మాట్లాడడం, ఎన్టీఆర్ వంటి మహానటులు మాట్లాడ్డం బాగుంది. సబబుగా ఉంది. Individual discretion accommodates the collective ignorance of the verbal – and eventually radiates a "mood" acceptable to the audience.

ఇప్పుడు కాస్సేపు ఆగి సినీమా చరిత్రని నెమరు వేసుకోవడం న్యాయం.

భారతదేశంలో - సినీమా రూపు దిద్దుకున్న తొలిరోజుల్లో నిస్సందేహంగా, నిర్దుష్టంగా నాటకాలే కెమేరా ముందు నిలిచాయి - ఏ భాషలోనైనా. భక్తపుండరీక, రాజా హరిశ్చంద్ర (దాదా సాహెబ్ ఫాల్కే) ఉదాహరణలు. తెలుగులో కూడా 1931 లో కెమేరా ముందు 'భక్తప్రహ్లాద' నాటకం నిలిచింది.

వెనకటికి ఒక జడ్జిగారు హత్య జరిగిందా లేదా అన్న విషయం తేలక జుత్తుపీక్కుంటున్నారట. ఉత్సాహవంతుడైన డిఫెన్స్ లాయరు లేచి "ఇంకా తమకి అనుమానంగా వున్నట్టుంది. ఈ హత్య జరిగిందనడానికి, నేను చచ్చిన ఫలానా సింహాచలాన్నే సాక్షిగా నిలబెడుతున్నాను" అన్నాడట..!

నేను కూడా సినీరంగం మీద నాటకం ప్రభావాన్ని తెలపడానికి నాటకాల జాబితాని ఇక్కడ ఉటంకిస్తే చాలును. భారతీయ జనజీవనంలో భాగమైన పౌరాణికేతివృత్తాలు, నాటి నాటకాల మూసలలో సూత్రధారుడు, కంచుకి, బృందగానం, కందార్థాలు, ద్విపదలు, స్రగ్ధరలు - అన్నింటితో రాజమార్గంలో తెరముందుకు వచ్చేశాయి. కొన్ని పేర్లు : లవకుశ, సీతాకళ్యాణం(1935), ద్రౌపదీ వస్త్రాపహరణం, శ్రీ వెంకటేశ్వర మహాత్మ్యం, బాలనాగమ్మ, భక్తరామదాసు, పాదుకా పట్టాభిషేకం, శకుంతల, మాయాబజార్(1936), శ్రీకృష్ణలీలలు, సతీ సక్కుబాయి. గయోపాఖ్యానం, ధృవ, అనసూయ ( ఈ రెండింటికీ సి.పుల్లయ్య దర్శకులు. 1936లో బేడ - అంటే రెండణాలకి ఈ రెండు సినిమాలూ చూపించారట), దశావతారాలు, శ్రీ సత్యనారాయణ వ్రతం, మోహినీ భస్మాసుర, జరాసంధ, భోజకాళిదాసు, భీష్మ, దక్షయజ్ఞం, మదాలస, బ్రహ్మరథం, సుమతి, హరిశ్చంద్ర, మైరావణ, పార్వతీ కళ్యాణం, చెంచులక్ష్మి, గరుడగర్వభంగం, సీతారామ జననం, భూకైలాస్, నారద నారది, చిత్రనళినీయం, సారంగధర , తారాశశాంకం వగైరా.

ఇక సాంఘికాలు: చింతామణి, వరవిక్రయం, రంగూన్ రౌడీ, కన్యాశుల్కం, రైతుబిడ్డ, వందేమాతరం, బారిష్టరు పార్వతీశం, గాంధీరాజ్యం వగైరాలు.

ఈ ఇతివృత్తాలు జనపథం ప్రోదు చేసిన నిధులు. క్రమంగా రచయిత, దర్శకుడు తెలివి మీరి జనబాహుళ్యం అభిమానాన్ని చూరగొన్న యితివృత్తాల్ని పరకాయ ప్రవేశం చేయించారు. 'లవకుశ' లేతమనసులు అయింది. (హాలీవుడ్ చిత్ర 'పేరెంట్ ట్రాప్' మరొక మూలం), మరిక చిత్రం 'ముత్యల ముగ్గు'. అలాగే 'సారంగధర' 'తూర్పు పడమర' అయింది (హాలీవుడ్ చిత్రం '28 కారెట్స్' మరొక మూలం). రూపాలు మారినా అవే విలువల్ని, అదే మెలోడ్రామాని ఆధారం చేసుకుని - సినీ రంగంలో వ్యాపారి, దర్శకుడూ సహజీవనం చేశారు. ప్రేక్షకులు ఆదరించే కాక్ టైల్ వుండగా, సినీమా ప్రక్రియకోసం వేరే పరుగులు ఎందుకు? ఇలాగే హాలీవుడ్‌లోకి కొన్ని వందల బ్రాడ్వే నాటకాలు రాజమార్గాన ప్రవేశించి ప్రేక్షకుల ఆదరణని చూరగొన్నాయి. జిజ్ఞాసి కొత్త పుంతలకోసం వెదుకుతాడు. వ్యాపారి నమ్మకమయిన, అందరినీ అలరించే పాతదారుల్ని కాపాడుకుంటాడు. ప్రక్రియ మీద ఎవరికీ ప్రభుత్వంలేని, నిజానికి అవసరంలేని దశలో నాటకాన్ని తెరమీదికి దిగుమతి చేశారు. నాటకం చిత్ర విజయానికి మినిమం గ్యారంటీ. పౌరాణికం ప్రేక్షకులను అలరించే

koumudi

మూస. పాట, పద్యం వారికి వంటబట్టే మృష్టాన్నభోజనం. ఎవరూ ఇందుకు భిన్నంగా నిర్మాణం జరిపే ప్రయత్నం చెయ్యలేదు. ఈ సినీమాలు చూసి నాటి ప్రేక్షకులు "నాటకం సినిమాలురోయ్" అని బుగ్గలు నొక్కుకునేవారట.

నేను 30 సంవత్సరాలుగా అంతర్జాతీయ చలన చిత్రోత్సవాలకు హాజరవుతున్నాను. సంగీత రూపకాలు వినా మరే దేశపు సినిమాలలోనూ పాటలు కనిపించవు. విదేశీ ప్రేక్షకుడు మన సినీమాల్ని చూసి ఆశ్చర్యపోవడం నాకు తెలుసు. అదేమిటయ్యా, పిల్లకి దూరమైన తల్లి ఏడవాలి కానీ రాగయుక్తంగా పాటపాడుతుందేమిటీ? "దేవుడా నేనేం పాపం చేశాను? నీకు దయలేదా? మా వాడెక్కడున్నాడో చూపించవయ్యా, నీ కొండకి వస్తాను.." ఇలాగ. కాని మనం ఆశ్చర్యపోము. కారణం 78 సంవత్సరాల అలవాటు ఇది. ఇంకా పాటరాదేమిటీ అని ఎదురు చూస్తాం. హీరో హీరోయిను ప్రేమించుకున్నారు. "నువ్వంటే నాకు భలేమోజు, అలా రాసిస్తానే దస్తావేజు" అని పాడాలి. వ్యక్తి నష్టపోయాడు. వెంటనే సమాజాన్ని నిలదీస్తాడు. ఇదొక మత్తు మందు "గాంధీ పుట్టిన దేశమా ఇది? నెహ్రూ కోరిన సంఘమా ఇది?" అని ఆక్రోశిస్తాడు. ఇది మధ్య తరగతికి, పీడితప్రజానీకానికీ రుచించే టానిక్. ఎన్ని సంవత్సరాలుగా ఎన్నికోట్లు సంపాదించిపెట్టిందో ఈ ఎస్కేపిస్ట్ ఎంటర్టైయిన్మెంట్!

ఇది ప్రేక్షడికి తరతరాల అలవాటు. నిర్మాతకి బాక్సాఫీసు సూత్రం. మధ్యలో సాహిత్యం సొమ్ము చేసుకుంది.

ఎంత సాహిత్యం! ఎన్ని గొప్పపాటలు! ఎన్ని పద్యాలు! అర్థాలు, అవసరాల ప్రమేయం లేకుండా వెండి తెరమీద కళ్ళు మిరుమిట్లు గొలిపాయి. నాటకరంగం భారతదేశపు సినిమాకి ఇప్పటికీ మిగిల్చిన అలంకరణ - పాట.

Sound of music, My Fair Lady, Irma La Douche, Phantom of the opera వంటి సంగీత రూపకాలు మనకి లేవు. అయితే మన సంగీతం సర్వాంతర్యామి. అలనాటి త్యాగయ్యలో 30 పైగా పాటలున్నాయి. ఎమ్మెస్ సుబ్బులక్ష్మి నటించిన 'పవళక్కొడి' అనే సినిమాలో 50 పాటలున్నాయి. ఇది భారతదేశంలో రికార్డ్. అప్పటి మీరా, అవ్వయార్ వంటి చిత్రాలను కేవలం పాటల దృష్టిలో పెట్టుకునే నిర్మించారు.

koumudi

సాహిత్యానికీ, సినిమాకీ బేధాన్ని అమెరికా విమర్శకుడు విలియం జింక్స్ చాలా చక్కగా నిర్వచించాడు. Film is a multi-sensory communal experience emphasizing immecdiacy , where as literature is a mono-sensory private experience that is more conductive to reflection.

ఈ రెంటినీ సాంగత్యం కారణంగా మేళవించిన ఘనత ఒక్క భారతీయ చిత్రానికే దక్కుతుంది.

మరొక ముఖ్యమైన పరిణామాన్ని మనం మరిచిపోకూడదు. 78 సంవత్సరాల వారసత్వాన్ని నాటకం సినిమాకి ఇస్తే - నాటకానికి కనీసం 200 సంవత్సరాల వారసత్వాన్ని సాహిత్యం ఇచ్చింది. ఆ కారణంగా అలవాటుగా సాహిత్యం నాటకంలో బతికింది. అదే అలవాటు సినిమాలకీ పాకింది. ఈ విధంగా సాహిత్యంతో సినీమా బంధుత్వం రెండో తరానిది. అయ్యా, మనుషులకే ఏడు తరాల జీన్స్ వారసత్వంగా వస్తాయని మన జన్యు శాస్త్రజ్ఞులు చెప్తూండగా రెండు ప్రక్రియల మూడో తరంలో అవి నిలదొక్కుకోవడంలో - ఆశ్చర్యమేముందీ?!

ఎందుకయ్యా పాటలు? ఏమయినా వాస్తవంగా ఉన్నాయా? అని దర్శకులని అడగండి. కె.ఆసిఫ్, కె.వి.రెడ్డి, శాంతారామ్, కె.విశ్వనాథ్ ప్రభృతులు ఏం చెప్తారో? మొన్నటి తమిళ వాగ్గేయకారుల్ని ఎవరో అడిగారట: ఏమయ్యా, మీరు కీర్తనలు తెలుగులో ఎందుకు చేస్తున్నారు? అని. వారు చేతులు జోడించి "ఏమో, మా గురువులు తెలుగులో రాశారు. మేమూ రాస్తున్నాం" అన్నారట. ఈ మాట ప్రముఖ గాయకులు టి.ఆర్. సుబ్రహ్మణ్యం ఒక సభలో చెప్పారు. బహుశా ఈ దర్శకులూ మాటే చెబుతారేమో.!

Tradition not only blindfold you but gives you a sanction for a 'distortion' also.

ఇది distortion అంటే నన్ను తిట్టేవాళ్ళుండవచ్చు. అయితే పళ్ళడాక్టరు అక్కరలేని అదనపు పన్ను చూపించే ప్రయత్నం లాంటిది నాది. ప్రక్రియ వైచిత్రిని చర్చించే నేపథ్యంలో ఈ మాట.

*బిడియపడి భీష్మించి పెళ్ళికొడుకైనట్టి*
*జగమేలు తండ్రికి జయమంగళం*
*విరులచే వరునిచే కరము చేకొనజేయు*
*జగమేలు తల్లికి జయమంగళం*

అన్న మల్లాది రామకృష్ణశాస్త్రి గారి యక్షగానాన్ని(రహస్యం) పరవశంతో జుర్రిన వారిలో నేనూ ఉన్నాను. అయితే భగవద్గీతని పట్టుకు ప్రమాణం చేస్తాను - అలనాడు సినీమా చూస్తున్నప్పుడు ఆ మాటలకి అర్థం నాకు బోధపడలేదు. అలా అనడం బాగుంది. అర్థం కాకపోయినా ఘంటశాల అలా పాడడం బాగుంది. వెరసి ఆ పాట సినీమాలో చిరస్మరణీయమయింది. ఇది 78 సంవత్సరాల వ్యసనం. మనందరం దీని ఆనందకరమైన రుగ్మతకి బానిసలం. చేతిలో ఉన్న పాట పూర్వాపరాలు, అర్థగాంభీర్యం పాఠకుడికి లొంగిన కొద్దీ బాగా నమిలిన చెరుకుగడ లాగ రసం చిప్పిలుతుంది. కాని అర్థం కావాలి కదా అని సినీమా హంసనడక నడిస్తే డెన్సిటీ ఆఫ్ ఎక్సెపీరియెన్స్ యాడిగలపడుతుంది. కొండొకచో పాట అర్థాన్ని నష్టపోయినా - ప్రేక్షకుల వారసత్వపు ఔదార్యాన్ని ఆలంబన చేసుకుంటే సన్నివేశం బతుకుతుంది.

ఈ సారి షూటింగ్ కి వెళ్తుండగా జగ్గయ్యగారన్నారు: 'గళ నిగళము' అంటే దవడకింద వేలాడే చర్మం కదా? అన్వయం బోధపడలేదు - అని. అయ్యా, దేశానికే బోధపడలేదు, శంకరాభరణం చూసిన యిన్ని రాష్ట్రాల ప్రేక్షకుల్లో ఒక్కరయినా ఈ ప్రశ్నని వేసుకున్నారా?

*"శంకర గళనిగళము*
*శ్రీహరి పద కమలము"*

అన్న వేటూరి పాదాలు ఎంతమందికి అర్థమౌతాయి.? అయినా ప్రజలు బ్రహ్మ రథం పట్టారు.." అన్నారు డాక్టర్ హెచ్.ఎస్. బ్రహ్మానంద (శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఆచార్యులు) తమ 'తెలుగు చలనచిత్ర గేయ సౌందర్యం' అనే పుస్తకంలో. నిజానికి ఈ మాటకి సాక్ష్యం మీరూ, నేనూ చాలు.

Immediacy of the film outplays the implication of a lyric.

ప్రేక్షకులను అనుభూతిస్థాయిలో రంజింపచేయగల సన్నివేశాన్ని దర్శకుడు ఆవిష్కరించినప్పుడు అతను నిరంకుశుడవుతాడు.

వాల్టర్ కెర్ అనే విమర్శకుడు మరోమాట అన్నాడు. Verse with its odd talent for giving to words far more than their literal meaning – has access to mysterious regions in which prose can only perspire and make clumsy approximations, to mysterious regions which the photograph can notpenetrate at all.

ఇక సినీమాల్లో మాటలూ, సన్నివేశాలూ -

నేనింతవరకు దాదాపు వంద సినీమాలు రాశాను. కాని ఎప్పుడూ స్క్రీన్‌ప్లే రాయలేదు. నాటకమే రాశాను. 250 సినీమాలు పైగా నటించాను. కాని ఎప్పుడూ నూటికి నూరుపాళ్ళు దృశ్యాన్ని నటించలేదు. పుంఖానుపుంఖాలుగా సంభాషణలు వల్లించాను.

ఎప్పుడో 61 సంవత్సరాల క్రిందట (1947) సన్నివేశం ఒకటి గుర్తుకొస్తుంది.

గుడిముందు ఓ బిచ్చకత్తె చలిలో వణుకుతోంది. ఒకాయన అటుపక్కనుంచి వెళ్తున్నాడు. దృశ్యాన్ని చూశాడు. గుడిలో అమ్మవారి చుట్టూ ఖరీదైన చీరె. అదీ చూశాడు. సరాసరి వెళ్ళి అమ్మవారి మీద చీరె తెచ్చి బిచ్చకత్తె వొంటిచుట్టూ కప్పి వెళ్ళిపోయాడు. పాత్ర - వేమన. చిత్రం 'యోగివేమన'. ఈ సన్నివేశం ఒక దృశ్యకావ్యం. తర్వాత చూసే రెండున్నర గంటల చిత్రానికి ప్రాతిపదిక. ఇక

పాత్రీకరణ అక్కరలేదు. ఈ సన్నివేశంలో సంభాషణ లేదు. ఇది నా మనస్సులో 50 సంవత్సరాలు బతికిన నికార్సయిన దృశ్యకావ్యం. సృష్టికర్త - తెలుగు సినీమా గర్వించదగ్గ కె.వి.రెడ్డి.

నిజానికి స్క్రీన్‌ప్లే - అంటే దృశ్యరూపకం -ముగ్గురు సాంకేతిక నిపుణుల కృషి ఫలితం. ఒకరు -సృష్టికర్త- రచయిత. రెండు - చరణ కర్త - దర్శకుడు. మూడు: ఇద్దరి మనసుల్నీ సమన్వయించి, ఫ్రేముల్ని అమర్చే ఎడిటరు. జీవితంలో మొదటిసారి 'షిండ్లర్స్ లిస్ట్' చిత్రానికి ఆస్కార్ బహుమతి అందుకున్న దర్శకుడు స్టీవెన్ స్పీల్బర్గ్ కృతజ్ఞతలు చెప్పే తక్కువ వ్యవధిలో ముందుగా స్క్రీన్‌ప్లే రచయితనే పేర్కొన్నాడు.

నాకు తెలిసి - తెలుగు సినిమాల్లో స్క్రీన్‌ప్లే అంటే - సినీమా మొదటి సిద్ధమయ్యాక - అసిస్టెంటు ఎడిటింగ్ గదిలో కూర్చుని రాసే సెన్సారు కాపీ. మామూలుగా తెలుగు దర్శకుడు సంభాషణల కాగితం మీద ( అప్పటికే సంభాషణలతో రాజీ ముగిసిందన్నమాట!) షాట్స్ గుర్తు పెట్టుకుంటాడు. కొందరి దర్శకుల మనసుల్లో నిర్దుష్టమైన బొమ్మ వుండవచ్చునేమో కానీ సాధారణంగా జరిగే తతంగం ఇది. తెరకి సంభాషణ బలహీనత నిజానికి. తెరమీద కెమేరా చూపలేని అనుభూతికి ఆలంబన - మాట - సాధారణంగా. ఆ స్థాయికి మనచిత్రాలు రాలేదనే చెప్పుకోవాలి.

ఇక్కడ మరో వింత అనుభవాన్ని చెప్పాలి. ఎన్టీరామారావుగారి నటజీవితంలో - ఆ దశలో - ఒక మలుపు అనదగ్గ డైలెక్టికల్ పాత్రలో నటించిన 'నిప్పులాంటి మనిషి' చిత్రాన్ని రాశాను నేను. అప్పట్లో చాలా ప్రాచుర్యం వున్న సలీం -జావేద్‌ల అద్భుతమైన స్క్రీన్‌ప్లే అది. హిందీ చిత్రం 'జంజీర్'. ఒక విధంగా అమితాబ్ బచ్చన్ కి అదే పెద్దమలుపు.

అందులో ఒక సీను నాకు బాగా గుర్తు. దుండగుల లారీ కిందపడి చాలామంది పసిపిల్లలు ప్రాణాలు కోల్పోయారు. ఒక యువకుడైన పోలీసాఫీసరు కేవలం ఉద్యోగధర్మం లాగ కాకుండా అదొక వ్యక్తిగతమైన 'పగ'లాగ భావిస్తాడు. దుండగుల్ని పోలికపట్టే కార్యక్రమంలో ఒకడు దొరికాడు. అతన్ని ఆవేశంతో చావగొట్టాడు హీరో. సీనియర్ ఆఫీసర్ అతన్ని ఆపాడు. ఆవేశంతో ఊగిపోతున్న హీరో తన గదిలోకి వచ్చాడు. ఇప్పుడు సీను ప్రారంభమవుతుంది. గడగడా మంచినీళ్ళు తాగాడు హీరో. ముఖమంతా చెమటలు పట్టాయి. ఈ లోగా 'సార్' అనేమాట వినిపించింది. అటు తిరిగాడు. ఇందాక దుండగుడిని పోల్చిన అమ్మాయి. కత్తులు సానబెట్టే ఓ అమ్మాయి - హీరోయిన్. ఆమెకిక్కడ పనేమిటి? అతని ముఖంలో ఆశ్చర్యం. ఆమె చేతిలో ఒక పాకెట్ వుంది. చూపించింది. 'డబ్బు' అంది. హీరో ముఖంలో సందిగ్ధం. ఆమే బయటికి చూస్తూ "వాళ్ళు ఇచ్చారు సార్. కాని..వద్దు సార్" టేబిలు మీద పాకెట్ ఉంచింది. ఓ మామూలు జీవితం గడిపే ఓ అమ్మాయి - దుర్మార్గులకు భయపడక - వారిని ధైర్యంగా పోలికపట్టి వారిచ్చిన డబ్బుని వాపసు ఇస్తోంది. హీరో చలించిపోయాడు. దగ్గరికి వచ్చాడు. ఏం చెప్పాలి? ఎలా చెప్పాలి?

ఆమె గుండె ధైర్యాన్ని ఎలా ప్రశంసించాలి? మాటల్లేవు..చాలవు. గొంతు సవరించుకుని 'థాంక్స్' అన్నాడు. అమ్మాయి వెళ్ళిపోయింది. ఇంతే సీను.

మరొక్కసారి ఈ సీనులో రచయిత రాసిన మాటలు గుర్తుచేస్తాను. : 'సార్', 'డబ్బు', 'వాళ్ళు ఇచ్చారు సార్. కాని వద్దు సార్', 'థాంక్స్'.

హీరోహీరోయిన్ కలిసే విచిత్రమైన సీను ఇది. చాలా ఆవేశంతో నడిచే సీను. ఈ సినీమాని భారతదేశంలో అన్ని ప్రధానభాషల్లోనూ తీశారు. 'జంజీర్' సినీమా లేకపోతే - ఈ వాక్యాలు రచయిత రాస్తే - రూపు దిద్దగలడా దర్శకుడు? ఎంత చర్చ, నడిచి వుండాలి పరిశ్రమలో ఈ క్లుప్తతకి?

ఈ మాటే దర్శకుడు ఎస్.డి.లాల్‌ని అడిగాను. లాల్ నవ్వేశాడు. నాకు సలీం జావేద్ మద్దతు ఉంది. అలానే రాశాను. మూలాన్ని హీరో చూశారు. లాల్ అలాగే తీశాడు. సినీమా 25 వారాలు నడిచింది. ఎవ్వరూ ఆ సీన్‌ని ఆక్షేపించలేదు కదా ఆనందించారు.



koumudi

The silence – or comparative silence – of the screen was an inherent condition of the medium - అన్నాడు వాల్టర్ కెర్. ఈ సన్నివేశానికీ, వేమనలో సన్నివేశానికీ ఏమీ సంబధంలేదు. It is the medium in its pristine form.

ఇదే వ్యాసం మొదటి పేరాకి స్ఫూర్తి. ఇక్కడా నేను నేతి బీరకాయని గుర్తుచేసుకున్నది.

నిజాము గారి ఖజానా తాళం చెవులు అలనాటి ఖమ్మం జిల్లా ప్రాంతంలో ఒక రామభక్తుడికి అప్పగించారు. ఆ డబ్బుతో ఆయన రాముడికి నగలు చేయించాడు. 1931 లో సినీమా తీసే బాధ్యత నాటకాల వాళ్ళకి అప్పగించారు. వారిప్పటికీ నాటకాలే తీస్తున్నారు. ఎందుకని? వాళ్ళకి తెల్సిన పని అదే కనుక. వాళ్ళంతా నాటకాల వాళ్ళు కనుక. ఎవరు వారు?

సి.పుల్లయ్య, అద్దంకి శ్రీరామమూర్తి, గోవిందరాజుల సుబ్బారావు, శ్రీవత్స, సి.ఎస్.ఆర్.ఆంజనేయులు, వై.వి.రావు, పీవి రావు, సీనియర్ శ్రీరంజని, రామ తిలకం వంటి నటులు, హెచ్.ఎం.రెడ్డి, గూడవల్లి రామబ్రహ్మం, పి.పుల్లయ్య, బి.ఎన్.రెడ్డి, ఆదుర్తి సుబ్బారావు, కమలాకర కామేశ్వరరావు వంటి దర్శకులు, ప్రభల సత్యనారాయణ, భీమవరపు నరసింహారావు (బి.ఎన్.ఆర్), ఎస్. రాజేశ్వరరావు, గాలిపెంచల నరసింహారావు, ఘంటసాల, పి.ఆదినారాయణ, ఓగిరాల రామచంద్రరావు, కొప్పరపు సుబ్బారావు వంటి సంగీత దర్శకులు, బెజవాడ రాజరత్నం, మట్టెగుంట రామారావు, మాధవపెద్ది, పిఠాపురం వంటి నేపథ్యగాయకులు, అడవి బాపిరాజు, ఎ.కె.శేఖర్, మాధవపెద్ది గోఖలే, ఎస్.వి.ఎస్.రామారావు, కళాధర్ యిత్యాది కళాదర్శకులు, వేదాంతం రాఘవయ్య, వెంపటి పెద సత్యం, వెంపటి చిన సత్యం. వేదాంతం జగన్నాథ శర్మ - యిత్యాది నృత్య దర్శకులు, ఇక నేటి తరానికి వస్తే - సూరిబాబు, ఈలపాట రఘురామయ్య, అక్కినేని, ఎన్టీఆర్, ఎస్వీ రంగారావు, చిత్తూరు నాగయ్య, చదలవాడ, గుమ్మడి, కొంగర జగ్గయ్య, జూనియర్ శ్రీరంజని , ఎస్.వరలక్ష్మి, అంజలీదేవి, చలం, రమణమూర్తి, జె.వి.సోమయాజులు, రచయితలు సముద్రాల, తాపీ ధర్మారావు, పింగళి, బలిజేపల్లి , మల్లాది, ఆత్రేయ, పినిశెట్టి, అనిసెట్టి, బొందలపాటి, కొర్రపాటి, జంధ్యాల, ఈ వ్యాసకర్త - ఇలా యీ జాబితా అనంతం. అందరికీ నాటకమే ఊపిరి- తీసే వారికీ, చూసే వారికీ. అప్పటికీ, ఇప్పటికీ. The communion is uncomplicated and total. రచన చేసేటప్పుడు నాకు దర్శకులు, నిర్మాత చెప్పిన మాటలు: నాటకం పండాలండీ..అని. నాటకాన్నే పండిస్తూ వచ్చారంతా.

koumudi

ఒక ప్రక్రియని మరో ప్రక్రియకి తర్జుమా చేసుకోవడం ఒక సారి వండిన పదార్థాన్ని మళ్ళీ స్టౌ మీద వేడి చేసుకోవడం లాంటిది. అయినా ఎవరూ ఇబ్బంది పడలేదు. వేడి చేసుకునే తిన్నారు. తింటున్నారు. అయినా రుచితో రాజీ పడలేదు. సినీమా నోరిప్పినా , గొంతు సవరించుకున్నా - ప్రక్రియని అజరామరం చేసిన ఎందరో కవులు, రచయితలు ఈ చేర్పుని అదృష్టకరమూ, అభిలషణీయమూ చేశారు.

ఓ కృష్ణశాస్త్రి : ఇది మల్లెల మాసమనీ, ఇది వెన్నెల వేళయనీ
తొందరపడి ఒక కోయిల ముందే కూసింది - అనకపోతే
ఓ ఆత్రేయ : అనుకున్నామని జరగవు అన్నీ
అనుకోలేదని ఆగవు కొన్నీ
జరిగేవన్నీ మంచికని
అనుకోవడమే మనిషి పని - అనకపోతే
ఓ సముద్రాల: నారీ నారీ నడుమ మురారీ
హరికీ హరికీ నడుమ వయారీ - అనకపోతే
సినీమా ప్రక్రియలో తరతరాల రాజీకి చక్కని బంగారు రేఖ ఏర్పడేది కాదు. ఈ కవుల పాటల్లో, మాటల్లో రేంజ్ అందాలంటే మనస్సుతో పాటు ఎంతో కొంత ఆలోచన కావాలి.

ఇమేజ్ తో బాటు ఇమేజిరీ కూడా చేరాలి. ప్రక్రియ దృష్ట్యా మాటకీ, పాటకీ నాటకానికీ ఎక్కువగా ప్రాధాన్యం అక్కరలేదని బల్ల గుద్దాలనిపించినా – వీరంతా ప్రక్రియ లిమిటేషన్స్ తిరగరాసుకోమని తమ కృషిద్వారా నిర్దేశించారు. సిద్ధాంతానికి వీరి మౌలిక సంపద అహంకారంతో చెప్పిన సమాధానం. By default, these great writers have added yet another department to our literary shelf.

ఇప్పుడు – చివరి సారిగా – మొదటి పేరాకి వస్తున్నాను. ప్రముఖ కవి తిలక్ ఓ మాట అన్నాడు: తెరిచే కిటికీని బట్టి పరతెంచే పుష్పపరాగం ఉంటుంది అని. తెలుగు సినిమాలో – మీకు వెదికే మనసుంటే – సృష్టించే కవులుంటే – ఆనందించే ప్రేక్షకులుంటే – ఈ నేతి బీతకాయలో కావల్సినంత నెయ్యి దొరుకుతుంది ఇప్పటికీ.

✷✷✷

ఈ రచనకి తోడ్పడిన పుస్తకాలు:

1) అరవయ్యేళ్ళ తెలుగు సినిమా : సంకలనకర్త: మద్దాళి రఘురాం.
2) తెలుగు చలన చిత్ర గేయ సౌందర్యం: డా.హెచ్.ఎస్. బ్రహ్మానంద
3) How not to write a Play by Walter Kerr
4) Artcile by William Jinks
5) Article by Robert Richardson
6) Article by Morris beja
7) తెలుగు చలనచిత్ర నిర్మాతల చరిత్ర – కె.మురారి

koumudi

✷✷✷